ISSN No:2581-7477

# సాహిత్య ప్రస్థానం

ఫిబ్రవరి 2020

వెల రూ. 20



సాహితీస్రవంతి



శ్రీ గౌ॥ వై.యస్.జగన్‌మోహన రెడ్డి గారు
గౌ॥ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు


సత్యమేవజయతే
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం




శ్రీమతి పాముల పుష్ప శ్రీవాణి గారు
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,
గిరిజన సంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్

# గిరిజన సంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
# ఆదివాసీల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ కార్యక్రమాలు

- గిరిజన సంక్షేమ శాఖ మరియు ట్రైకార్ ఉత్తమ ప్రమాణాలతో సేవలను అందించినందుకు గాను ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్‌ను పొందడమైనది.
- 'జగనన్న విద్యా దీవెన' ద్వారా 66,000 మంది పోస్ట్ మెట్రిక్ గిరిజన విద్యార్థులకు భోజనం మరియు వసతి కోసం ఏడాదికి రూ. 20,000/- చేయూత.
- జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా గిరిజన విద్యార్థుల తల్లుల ఖాతాలో ఏడాదికి రూ. 15000/- ప్రోత్సాహం. 4.76 లక్షల మందికి లబ్ధి.
- వై.ఎస్.ఆర్. చేయూత పథకం కింద 45 నుండి 60 ఏళ్ల మధ్య వయసున్న గిరిజన మహిళలకు రెండవ ఏడాది నుంచి దశలవారీగా రూ. 75,000/-.
- పెళ్లి సమయంలో గిరిజన ఆడపడుచులకు 'వై.ఎస్.ఆర్. పెళ్లి కానుక' పేరుతో జగనన్న ఇస్తున్న ఆడపడుచు లాంఛనం రూ. 100,000/-.
- గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రతి కుటుంబానికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు.
- ప్రమాదవశాత్తూ పెద్దదిక్కును కోల్పోయిన గిరిజన కుటుంబాలకు అండగా ఉండేందుకు వై.ఎస్.ఆర్ భీమా పథకం కింద రూ. 5,00,000/- ఆర్థిక సాయం.
- గిరిజన రైతులకు ఉచిత భూమి పంపిణీతో పాటు సాగునీటి వసతి కొరకు ఉచితంగా బోర్లు తవ్వకం.
- 'వై.ఎస్.ఆర్. రైతు భరోసా' కింద గిరి రైతుల భూములకు రూ. 12,500/- పెట్టుబడి సాయం.
- అటవీ హక్కుల గుర్తింపు చట్టం కింద ఉగాది నాటికి గిరిజనులకు లక్ష ఎకరాల పంపిణీకి కార్యాచరణ.
- రూ. 19.96 కోట్లతో ఏజెన్సీ ప్రాంతాలలో గోడౌన్ల నిర్మాణం ద్వారా అటవీ ఉత్పత్తులు సేకరించే గిరిజనులకు గిట్టుబాటు ధరల కల్పన.
- జీసీసీ ఉత్పత్తులకు మెరుగైన బ్రాండింగ్ మరియు మార్కెటింగ్ కల్పించడం ద్వారా గిరి రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడం.
- ట్రైకార్ ద్వారా రూ. 240.16 కోట్లతో గిరిజనులను స్వయం ఉపాధివైపు నడిపించడం, వారికి ఆర్థిక చేయూతనివ్వడం.
- గిరిజన యువతకు ఉపాధి కోసం రూ. 3.33 కోట్లతో ప్రత్యేక జాబ్ మేళాలు మరియు శిక్షణా కార్యక్రమాలు.
- భూమి కొనుగోలు పథకం ద్వారా రూ.5.00 కోట్లతో భూమి లేని గిరిజన మహిళ వ్యవసాయ కూలీలకు భూములను పంపిణీ చేసి వారి యొక్క ఆర్థిక స్థితిగతులను మరియు సామాజిక స్థాయిని పెంపొందించడం.
- సమగ్ర కాఫీ ప్రాజెక్ట్ పథకం ద్వారా రూ. 34.46 కోట్లతో పాడేరు ఐటీడీఏ పరిధిలో కాఫీ తోటల పెంపకం, నీడ చెట్ల పెంపకం మరియు బేబీ పల్పర్స్ ద్వారా నాణ్యమైన కాఫీ గింజల ఉత్పత్తి.
- వై.ఎస్.ఆర్ వాహన మిత్ర పథకం ద్వారా మొత్తం 8,764 మంది ఎస్టీ సొంత ఆటో/టాక్సీ వాహన దారులకు ఏటా రూ.10,000/- ఆర్థిక సహాయం అందించటం కోసం మొత్తం రూ. 8.76 కోట్లు మంజూరు చేయటం జరిగింది.
- కిడ్నీ వ్యాధులు ఎక్కువగా ఉన్న 22 గిరిజన కుటుంబాలకు ముందస్తు చర్యలు మరియు నివారణ కోసం రూ. 3.00 కోట్లు మంజూరు చేయడం జరిగింది.
- యానాది మరియు ఎరుకల యొక్క 22 కుటుంబాలకు నివాస గృహాల కోసం రూ. 0.57 కోట్లు మంజూరు చేయడం జరిగింది.
- కనెక్టివిటీ సమస్యను అధిగమించడానికి 203 శాటిలైట్స్ ఫోన్స్ ఐటీడీఎలకు ఇవ్వడమైనది.
- ప్రత్యేక గిరిజన జిల్లా ఏర్పాటుతో పాటు గిరిజన విశ్వవిద్యాలయం - సాలూరు, విజయనగరం, వైద్య కళాశాల - పాడేరు, విశాఖపట్నం, ఇంజనీరింగ్ కళాశాల- కురుపాం, విజయనగరంలో ఏర్పాటు ద్వారా గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి కృషి.
- స్వయం పాలన దిశగా గిరిజనులను నడిపించేందుకు 500 మంది నివాసముండే ప్రతి గిరిజన ఆవాసం లేదా తండాను పంచాయతీగా మార్పు.
- షెడ్యూల్ ప్రాంతాల్లో 501 గ్రామ సచివాలయాలలో 100శాతం రిజర్వేషన్ ద్వారా 4704 మంది గిరిజన యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాల కల్పన. మైదాన ప్రాంతాల్లో 5,696 గిరిజన యువతకు ఉద్యోగాలు.
- గిరిజనుల అభివృద్ధి - సంక్షేమమే ధ్యేయంగా గిరిజన ఉప ప్రణాళిక కింద రూ. 4,998 కోట్లు కేటాయింపు పారదర్శకంగా అమలుకు చర్యలు.
- క్రీడల్లో అత్యున్నత స్థాయికి చేరుకునేలా అరకులో గిరిజన క్రీడా పాఠశాల మరియు ప్రత్యేక శిక్షణా శిబిరాలు.
- విశాఖ జిల్లా, కాపులుప్పాడలో రూ. 48.27 కోట్లతో అల్లూరి సీతారామరాజు గిరిజన మ్యూజియం మరియు లంబసింగిలో రూ. 15.00 కోట్లతో గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణం.
- రూ. 10.00 కోట్లతో విశాఖలో గిరిజన సాంస్కృతిక పరిశోధన సంస్థ మరియు శిక్షణ మిషన్ ప్రధాన కార్యాలయం భవన నిర్మాణం.
- గిరిజన ప్రాంతాల్లో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల జీతాలు రూ. 400 నుంచి రూ.4000 లకు పెంపు.
- గిరిజనులకు ఆధునిక వైద్యం అందించేలా ప్రతి ఐటీడీఏలో ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు.
- గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా అమలవుతోన్న 'ఆదివాసీ ఆరోగ్యం' కార్యక్రమానికి రూ. 14.00 కోట్లు.
- సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రభుత్వ పథకాలు మరియు సేవలను ప్రతి ఒక్క గిరిజనుడికి చేరేలా ఐటీడీఏ పాడేరు పరిధిలో ప్రపంచ బ్యాంక్ మరియు రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో రూ. 60 కోట్లతో 200 గిరిసేవా కేంద్రాల ఏర్పాటు.
- గిరిజన సంక్షేమ పాఠశాల్లో విద్యార్థులకు మినరల్ వాటర్ అందించేందుకు రూ. 17.00 కోట్లతో ఆర్.ఓ. ప్లాంట్లు మరియు 400 గిరిజన విద్యాసంస్థల ఆధునీకీకరణ మరియు మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 30.49 కోట్లు.
- అన్ని గిరిజన గ్రామాలను అనుసంధానించేందుకు గాను 'గిరిబాట' పేరుతో రోడ్ల నిర్మాణానికి రూ. 846.50 కోట్లు.
- గృహనిర్మాణ పథకంలో భాగంగా ఆదిమ జాతి గిరిజనులు (పీవీటీజీ) కు ఒక్కో గృహానికి రూ. 100,000/- చొప్పున అదనపు సహాయం కోసం రూ. 48.83 కోట్లు.
- యానాదులు మరియు ఇతర ఎస్టీల గృహనిర్మాణానికి ఒక్కో గృహానికి రూ.75,000/- అదనపు సహాయానికి రూ. 226.98 కోట్లు.
- గిరిజనులకు ఉపాధి కల్పనలో భాగంగా పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు రూ. 242.77 కోట్లు.
- ఐటీడీఏల్లో క్రీడా సముదాయాల నిర్మాణానికి రూ. 126.00 కోట్లు.



శ్రీ ఆర్. పి. సిసోడియా, ఐ.ఏ.ఎస్.,
ప్రధాన కార్యదర్శి,
గిరిజన సంక్షేమ శాఖ



శ్రీ పి. రంజిత్ భాషా, ఐ.ఏ.ఎస్.,
సంచాలకులు,
గిరిజన సంక్షేమ శాఖ



శ్రీ ఈ. రవీంద్ర బాబు, ఎం.ఎస్.సి., (అగ్రి)
అదనపు సంచాలకులు మరియు
కార్యనిర్వాహక సంచాలకులు (ట్రైకార్)

సాహిత్య ప్రస్థానం ఫిబ్రవరి 2020

సంపుటి : 19 | సంపాదకీయం | సంచిక : 2

# మతాలు చూడని భారతీయత

కేంద్రం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం(సిఎఎ)పై దేశ వ్యాపితంగా నిరసనలు పెరుగుతున్నాయి. రాజకీయ పార్టీలూ, ప్రజా సంఘాలు, కళా సాహిత్య సంఘాలూ, ప్రముఖ రచయితలూ మేధావులూ, రాజ్యాంగ కోవిదులూ భారత పౌరసత్వాన్ని మతంతో ముడిపెట్టే ఈ చట్టం సరికాదని ఘోషిస్తున్నారు. ఆఖరుకు నాలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సిఎఎకు వ్యతిరేకంగా శాసనసభల్లో తీర్మానాలే చేశాయి. సిఎఎకు కొనసాగింపు ఎన్‌ఆర్‌సి అమలు చేయబోమని 12 రాష్ట్రాలు ప్రకటించాయి. ఇక ఎన్‌ఆర్‌సికి ముందుమాట అనదగిన ఎన్‌పిఆర్ విషయంలోనూ ముఖ్యమంత్రులు సందేహాలు వెలిబుచ్చారు. తెలంగాణ పాలకపక్షమైన టిఆర్‌ఎస్ పార్లమెంటులో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేసింది. ఎపిలో వైఎస్‌ఆర్ పార్టీ, తెలుగు దేశం అనుకూలంగా ఓటేశాయి. అయితే ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్, కెసిఆర్‌లు ఎన్‌ఆర్‌సి అమలు చేయబోమని స్పష్టంగా ప్రకటించారు. సిఎఎ కేవలం మూడు పొరుగు దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుంచి మత పరమైన వేధింపుల కారణంగా వచ్చే వారికోసం ఉద్దేశించింది గనకనే ముస్లిం మతాన్ని మినహాయించామని కేంద్రం ఇస్తున్న సంజాయిషీ ఎవరినీ సంతృప్తి పర్చదు. భిన్న మతాలకు నిలయమైన భారతదేశ రాజ్యాంగంలో పౌరసత్వం అన్నది మత ప్రసక్తి లేని అంశం. దేశాన్ని మతకోణంలో చూడటం, ఒక మతం వారు పౌరసత్వానికి అనర్హులన్న భావన కలిగించడం రాజ్యాంగ మూల స్ఫూర్తికే విరుద్ధం. సుప్రీం కోర్టు కూడా ఈ చట్టాన్ని సవాలు చేస్తూ కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన కేసును విచారిస్తున్నది. దేశంలో క్రమంగా విస్తరిస్తున్న మతతత్వ రాజకీయాలను మోడీ ప్రభుత్వం సిఎఎతో పరాకాష్టకు తీసుకువెళ్లింది. తెలుగు సాహిత్య కారులు కూడా దీనిపై శాయశక్తులా పోరాడటం అవసరం. ఇప్పటికే ఆ విధమైన కృషి ప్రారంభమైంది. సాహితీ స్రవంతి , ప్రస్థానం పత్రిక అందుకు ప్రత్యేకంగా కృషి చేస్తాయి. ♦

సంపాదకవర్గం:

**తెలకపల్లి రవి** ప్రధాన సంపాదకుడు
**వొరప్రసాద్** వర్కింగ్ ఎడిటర్
**కె. సత్యరంజన్** ◆ **చీకటి దివాకర్**
**గనారా** ◆ **శమంతకమణి**
**కెంగార మోహన్**
**కె.లక్ష్మయ్య,** మేనేజర్

బొమ్మలు: **తుంబలి శివాజి, చిదంబరం గంగాధర్ వీర్ల**

కవర్ డిజైన్: **బ్రౌన్**

రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:
**సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002, ఫోన్: 0866-2577248, సెల్: 9490099059**
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, www.prasthanam.com

**ISSN No: 2581 - 7477**

సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు చందా కట్టండి! తెలుగు భాషా, సాహిత్య కృషిలో భాగస్వాములు కండి!!

**1 సంవత్సర చందా రూ. 240/- ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 / ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000/-**

**Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada**
**A/c No. 52001500585, IFSC: SBIN0020343**
చెక్కులు, డిడిలపై **prasthanam** అని రాయగలరు.

## ఈ సంచికలో ... సాహిత్య ప్రస్థానం ఫిబ్రవరి 2020

### కథలు


**ది బిజినెస్..!?** – శ్రీ భవ్య................................ 5
**కొత్త సంవత్సరం మొదటి రోజు !**
కన్నడం : అదీబ్ అఖ్తర్
అనుసృజన : వేలూరి కృష్ణమూర్తి................. 29
**కెరటం** – మీనాక్షి శ్రీనివాస్ .............................. 38
**వరదానం** – ఎ. అన్నపూర్ణ............................... 50


### కవితలు


**వాన వాసన** – గాజుల పవన్‌కుమార్.................... 4
**శీర్షిక లేని కవిత !!** – బత్తిన కృష్ణ...................... 11
**పంజా** – కళ్యాణదుర్గం స్వర్ణలత........................ 13
**పుస్తకం** – అనిత దావత్ ................................ 16
**పరితపిస్తున్నా...** – మోకా రత్నరాజు ................... 17
**రంగుల కలబోత** – సాంధ్యశ్రీ ......................... 22
**ఒక జ్వలనం గురించి** – బి. గోవర్ధనరావు.............. 23
**అడవి ఒక పచ్చని పట్టువస్త్రం** – ఏ.వి.ఆర్. మూర్తి.... 28
**ఈ గాయాలకు ఏ పేరు పెడదాం?**
– మామిడిశెట్టి శ్రీనివాసరావు...................... 28
**అంగడిలో అక్షరం** – వేంపల్లి సికిందర్................ 31
**సాధన** – ఎరుకలపూడి గోపీనాథరావు................... 31
**మోకరిల్లిన వేళ**– పెనుమర్తి పద్మజవాణి ................. 34
**నేనిప్పుడు...** – రజిత కొండసాని.......................... 37
**చెవికెక్కని మాట !** – కోట్ల వెంకటేశ్వరరెడ్డి ............. 37
**అనుబంధాలు ఆత్మీయతలు!** – దార్ల విజయకుమారి.. 42
**ప్రశ్న** – డా॥ యస్. సత్యప్రసాద్........................ 42
**మట్టినైపోతాను** – దీప నాదెండ్ల.......................... 45
**బాల కష్టమ్మ** – పుట్టి గిరిధర్............................. 46
**మనిషి తప్పిపోయాడు** – బి. కళాగోపాల్................ 49
**ఆ పౌరసత్వం నాకొద్దు** – మామిండ్ల రమేష్‌రాజా....... 54
**అందత్వం** – లక్ష్మి కందిమళ్ళ........................... 54
**స్వేచ్ఛా భారతానికి..** – నూనెల శ్రీనివాసరావు......... 59
**మరో రోజు** – పద్మావతి రాంభక్త....................... 59


### వ్యాసాలు


**సంఘ సంస్కరణ ఉద్యమాల పరిశోధన**
– వకుళాభరణం రామకృష్ణ ...................... 12
**సాహిత్య ప్రస్థానం పురస్కారాలు**.......................... 11
**సామాజిక కథల విపంచి** – యు. హేమలత ......... 14
**మహిళా చైతన్య చిత్రణ** – పొదిలి నాగరాజు ........... 18
**చైతన్య పతాకాలు ఇనాక్ నాటకాలు**
– ఘంసీ కె.వి. కుమారి ......................... 24
**ఎల్లెడలా మాతృభాషే** – ఆర్ లక్ష్మి ..................... 32
**అనంత కరువు సంతకం** – డా.బి. నాగశేషు............ 35
**రెక్కల సృష్టికర్త సుగంబాబుతో..**
– టేకుమళ్ళ వెంకటప్పయ్య........................ 43
**వ్యవస్థను ప్రశ్నించే టీచర్ చెప్పిన కథలు**
– జంధ్యాల రఘుబాబు........................... 47
**విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల సభలు**
– యు. రామకృష్ణ................................ 55
**స్వీకారం**.................................................... 60
**డైరీ** ........................................................ 63



**కవిత**

## వాన వాసన


*- గాజుల పవన్ కుమార్*
*9866265005*


*అందచందాల విరులు కాస్తేనో*
*అష్టగంధాల అత్తరు పూస్తేనో*
*గుభాళించే పరిమళం కాదది*
*మరుమల్లెల మహోత్తు నుండో*
*గులాబీల ఘుమఘుమల నుండో*
*ప్రభవించే ద్రవ్యసారం కానేకాదది–*
*మట్టిని తొలకరి ముద్దాడితే*
*తొణికే తుంపర్ల సౌరభమది*

*పుడమిని వర్షం కౌగిలిస్తే*
*ఒలికే భూధూళి ధూపమది*
*మట్టి–వానల సమ్మోహనంలో*
*చిలికే సహజ సాంబ్రాణియది.*
*'వాన వాసన'ని శ్వాసించాలంటే*
*పెండతో అలికిన వాకిట్లలో*
*పంటలో మలిచిన మడికట్లలో*



*తాపిగా నిల్చుని పీల్చు*
*మట్టివాసనలో మమేకమై పీల్చు* ♦

కథ



# ది బిజినెస్...!?

- శ్రీ భవ్య

ఇంద్రావతి చాలా అందమైన అడవి. జలపాతాలు, పచ్చని కొండలు, నదులు, సెలయేళ్లు, అందమైన ఎడారులు– ప్రకృతి పులకించే ప్రశాంతమైన అడవి అది. రకరకాల జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు అన్ని కలిసి ఆనందంగా జీవిస్తున్నాయి. స్వేచ్ఛగా ఎక్కడ కావాలంటే అక్కడ నివాసం ఏర్పరచుకుని హాయిగా బతికేస్తున్నాయి. సీతాకోక చిలుకులు గాల్లో ఎగురుతూ, పూలపై వాలుతూ ఎంజాయ్ చేస్తున్నాయి. లేళ్లు, దుప్పులు చెంగుచెంగున ఎగురుతూ ఆడుకుంటున్నాయి. ఏనుగులు, పులులు, సింహాలు, గుర్రాలు, పాములు, చేపలు, ఖడ్గమృగాలు.. ఆహారసూత్రం ప్రకారం మాత్రమే ఆకలి తీర్చుకుంటున్నాయి. తొలకరి జల్లులో నెమళ్లు పురివిప్పి నాట్యం చేస్తుంటే, వసంతకాలంలో కోకిలలు గానం చేస్తున్నాయి. భూగోళం మీద ఎక్కెడెక్కడున్న జంతువులకు, పక్షులకు.. సకల జీవరాశులకు ఈ అడవంటే చాలా చాలా ఇష్టం. సంతోషాల సరాగాల రాజ్యం.

పులి ఆ అడవికి కొత్తగా రాజు అయింది. నక్క మంత్రి అయింది. పెద్దపెద్ద జంతువులన్నీ ఆయా పోస్టుల్లో నియమించబడ్డాయి. కొన్ని చిన్న జంతువులు పులి రెకమెండేషన్‌తో ఉద్యోగాల్లో చేరాయి. పాతపోస్టుల్లో కొన్ని మార్పులు, చేర్పులు చేయబడ్డాయి. అడవంతా సంబురాలు జరిగాయి. పాతపాలనలో కంటే కొత్తపాలనలో తమ జీవితాలు మరింత బాగుపడతాయని జంతువులు, పక్షులు వేడుకలు చేసుకున్నాయి. తమతమ టాలెంట్స్ ప్రదర్శించి ఆనందంతో గంతులు వేశాయి. కొత్తకొత్త రాగాలు తీసి పాటలు పాడాయి. ఆడాయి. అడవిలోని ప్రకృతి సైతం సరికొత్త చిగురులు వేసి అడవినంతా ఆనందమయం చేసింది.

ఒకరోజు పులి సింహాసనం మీద ధీరత్వంతో కూర్చొని ఉంది. మంత్రులు, సేనాధిపతి అందరూ తమతమ ఆసనాల్లో కొలువై ఉన్నాయి. పులి 'పాలన ఎలా ఉంది?' అని ఒక్కొక్క దాన్ని అడుగుతుంటే.. ఒక్కో జంతువు, ఒక్కో పక్షి పులి చేస్తున్న పనులను పొగడ్తలతో ముంచెత్తుతూ చెప్తున్నాయి. పులి ఆనందంతో తబ్బిబ్బవుతుంది. మధ్యమధ్యలో మంత్రి నక్క వైపు చూస్తూ గర్వంగా నవ్వుతుంది. పులికి నమ్మినబంట్లన్నీ సంతోషంతో ఉన్నాయి.

అంతలో ద్వారం దగ్గర కాపలా ఉన్న గుర్రం లోపలకు వచ్చి "పులిరాజా! మిమ్మల్ని కలవడానికి ఒక కొత్త నక్క వచ్చింది. మీతో మాట్లాడాలట. పంపమంటారా?" అని అడిగింది.

పులి "ఆ.. పంపండి" అన్నది.

'చిత్తం మహారాజా!' అంటూ బయటకు వెళ్లింది గుర్రం.

గుర్రం వెళ్లిన రెండు నిమిషాలకు కొత్తనక్క లోపలకు వచ్చింది.

పులిరాజు సాదరంగా నక్కను ఆహ్వానించి ఓ ఆసనంపై కూర్చోమంది.

పులి రాజే కాదు, అక్కడున్న పక్షులు, జంతువులు సైతం ఆ నక్క రూపురేఖలు చూసి ఆశ్చర్యపోయాయి. మెడలో టై, ఫ్యాంటు, షర్ట్, కోటు, కళ్లజోడు.. వాటికి తోడు చేతిలో విచిత్రమైన వస్తువేదో ఉన్నట్లు బ్యాగ్ తగిలించుకుని ఉంది ఆ నక్క.

"పులిరాజా నన్ను మీరంతా కొత్తగా చూడాల్సిన పని లేదు. నేను మీ అడవిలోని జంతువునే. అయితే మరో అడవికి వెళ్లి, అక్కడ అభివృద్ధిని చూసి, నేర్చుకుని, మన అడవిని అలా అభివృద్ధి చేద్దామని వచ్చాను" అన్నది.

కొత్త నక్క వేషమే కాదు, మాటలు కూడా చాలా చిత్రంగా అనిపించాయి. అర్థమై అర్థం కానట్లున్నాయి. కానీ, బాగా అనిపించాయి పులిరాజుకు. సభలోని మిగిలిన వాటికీ అంతే. 'మిగిలిన అడవులు, అక్కడ బతికే జంతుజాలమంతా ముందుకు పోతుంటే.. మన అడవి, మీరు ఇంకా పాతకాలంలోనే బతుకుతున్నారు. కాబట్టి ప్రపంచంతో పోటీపడాలంటే మనమూ ముందుకు పోవాలి. అప్పుడే ఇతర అడవుల నుంచి ఇక్కడ చాలా జంతువులు వస్తాయి. మన అడవిని సందర్శిస్తాయి. పర్యాటకంగా మనకు లాభాలూ వస్తాయి. మన అడవిలో దొరికే పూలు, మూలికలు, ఇక్కడ తయారు చేసే వస్తువులు, పండించే పంటలు, గనులు.. ఇతర అడవులకు పంపించొచ్చు. అక్కడవి మన అడవికి తెచ్చుకోవచ్చు. ఇప్పుడు ప్రపంచం అంతా ఓ గ్లోబల్ ఫారెస్ట్' అని చెప్పింది. ఆ నక్క మాటలు అందరికీ బాగా నచ్చాయి. తాము ఓ చిన్న బావిలో ఉంటూ, అదే లోకం అనుకున్నట్లు భావించాయి.

పులిరాజుకు అయితే కొత్త అడవుల్లోని జంతువులతో సంబంధాలు పెట్టుకోవటం, కొత్త ప్రదేశాలకు వెళ్లడం, అక్కడి వాళ్లను కలవడం మహా సరదాగా అనిపించింది. పైగా తమ అడవి అభివృద్ధి చెందుతుందని నక్క చెప్తుంది. దాంతో పులిరాజు 'ఓ.. కె' అనేసింది. పులిరాజు మాటకు సభలో జంతువులన్నీ క్లాప్స్ కొట్టి మరీ తమ ఆనందాన్ని తెలియజేశాయి. కొన్ని పక్షులైతే నాట్యం చేశాయి. కొన్ని పక్షులు రాగాలు తీశాయి.

కొత్తనక్క తన దగ్గరున్న బ్యాగ్ ఓపెన్ చేసింది. లోపల నుంచి ఓ విచిత్రమైన మంత్రదండాన్ని బయటకు తీసింది. దానిలో రకరకాల బొమ్మలున్నాయి. ఇళ్లు, ఆఫీసులు, దుస్తులు, పానీయాలు, తినే పదార్థాలు, ఆడ, మగ తేడా లేకుండా అన్ని రకాల జంతువులు, పక్షులు కలిసిపోయి కలిసి పనిచేయడం. ఆ ప్రదేశాలన్నీ చూడచక్కగా పెద్దపెద్ద బిల్డింగ్‌లతో, కాంతులతో ఉన్నాయి. ఒక్కొక్కటి చూపిస్తూ.. వివరించింది నక్క.

'మాకే కాదు. మేం ఏం చేయబోతున్నామో... ఇక్కడున్న అన్ని జంతువులకు, పక్షులకు తెలియాలి.. దీనిని పెద్దది చేసి చూపించలేరా..?' అని అడిగింది పులి.

'ఓ అదెంత పని!' అని నక్క మంత్రందండాన్ని పట్టుకొని ఏదో మంత్రం చదివింది. అంతే.. మంత్రదండం కాస్తా ప్రొజెక్టర్‌గా మారిపోయింది. ఎదురుగా పెద్ద స్క్రీన్. దాని మీద చూపిస్తూ ప్రెజెంట్ చేసింది. సభలో ఉన్న అన్ని రకాల జంతువులు, పక్షులు చిందులు వేశాయి. సూపర్ అన్నాయి.

పులి రాజా గర్వంగా ఫీలయ్యింది.

కొత్త నక్క... 'ముందుగా మనం వేరే అడవులకు వెళ్లి వాళ్లను ఇక్కడకు పిలవాలి. ఇక్కడ పరిస్థితులు వివరించి మన అడవిని అభివృద్ధి చేయడంలో సాయం చేయమని అడగాలి. వాళ్లు వచ్చినప్పుడు ఏ లోటు రాకుండా అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేయాలి. దేనికీ కాదనకూడదు' అని కన్నుగొట్టి మరీ చెప్పింది. 'సరే.. సరే..' అన్నది పులి. జంతువులన్నీ తలలూపాయి.

పులి నక్కతోపాటు అనేక అడవులకు వెళ్లింది. అక్కడి వాటిని కలిసి, తమ అడవికి తీసుకొచ్చి రాచమర్యాదలు చేసింది. అనుకున్నట్లుగానే.. తమ అడవిని అభివృద్ధిలో మెట్టు మెట్టు ఎక్కించింది. అడవిలో పదిశాతం జంతువులు, పక్షులకు స్వర్గ సుఖాలు వచ్చేశాయి. కోట్లాను కోట్ల ఆస్తులు దక్కాయి. పులికి దగ్గరైన వాళ్లందరూ ఎంజాయ్ చేస్తున్నారు. మరో నలభై శాతం జంతువులు, పక్షులు అటు ఇటు కాకుండా అభివృద్ధికి మధ్యలో ఇరుక్కపోయాయి. పై స్థాయిని అందుకోడానికి వెంపర్లాడుతున్నాయి. ముప్పై శాతం జంతువులు, పక్షలు తమలోతాము కొట్టుకుంటూ, పోట్లాడుకుంటూ ఏం జరుగుతుందో తెలియక తికమక పడుతున్నాయి. మిగిలిన ఇరవై శాతం తింటానికి గడ్డి కూడా దొరక్క ప్రాణాలు కోల్పోతున్నాయి.

పులిరాజుకు ప్రగతిని పరిచయం చేసిన నక్క విందులు విలాసాలలో మునిగి తేలుతుంది. లాభాలలో సగం వాటా

దక్కించుకొని రాజుగారి పక్కన కుర్చీవేసుకుని హాయిగా సేదతీరుతుంది. అప్పుడప్పుడు రాజుగారికి సలహాలు ఇస్తూ, తన ఆస్తులు పెంచుకుంటూ పోతుంది. ఆ అడవిలో సుందరమైన ప్రదేశాలన్నీ సొంతం చేసుకుంటుంది. టెక్నాలజీ పేరుతో కొత్తకొత్త వస్తువులను తయారు చేసి ప్రజల్లోకి పంపుతుంది. లోకల్ టాలెంట్ తో వస్తువులు తయారుచేసే జంతువులకు, పక్షులకు ఇది చాలా ఇబ్బంది అయింది. వాటికి గుర్తింపు లేకుండా పోయింది. సంపాదన కరువై అడవిలో ఉన్న ఆకులు అలములు తిని బతికే స్థాయికి వచ్చాయి.

◆◆◆

ఒకరోజు నక్క, తన దగ్గరున్న మంత్రదండంలోంచి ఓ అందమైన ప్రదేశాన్ని రాజుకు చూపించింది. అక్కడున్న చల్లని కొండలు, వాటి మధ్య సుందరమైన లోయలు, జలపాతాలు, పూలతోటలు, అందమైన స్త్రీలు, గుడులు, దేవుళ్లు.. వాటన్నింటిని చూస్తూ పులిరాజు తబ్బిబ్బై పోయింది. "ఎక్కడిదీ సుందర ప్రదేశం?. నా మనసు ఉవ్విళ్లూరుతుంది. ఎంతదురమైనా సరే, ఎక్కడున్నా సరే వెళ్లాల్సిందే" అన్నది.

రాజు ఇష్టాన్ని గమనించిన నక్క "అయ్యో రాజా..! మీకు నిజంగా ఈ ప్రదేశం గురించి తెలీదా..!? ఇది మీ అడవే!?" అన్నది.

"నాకు తెలియకుండా ఇంత ఆహ్లాదకరమైన ప్రదేశమా నా అడవిలో! తప్పక వెళ్లాలి" అన్నది.

వెళ్లాలంటే చిన్న చిక్కుంది రాజా..! మీ పూర్వపు రాజుల వల్ల వచ్చిందా చిక్కంతా. ఆ ప్రదేశం మీదైనా, పూర్తి అధికారాలు మీకు లేవు. మీ రాజ్యాధికారం, నీతి శాస్త్రం ఒప్పుకోవు" అని చెప్పింది నక్క.

"అవన్నీ మేం చూసుకుంటాం.. ముందు ఆ సుందర లోయల్ని తనివితీరా ఆస్వాదించి వద్దాం. వెంటనే ఏర్పాట్లు చేయిస్తాను. మీరూ మాతో రావాలి" అన్నది పులి.

"అంతకంటే భాగ్యమా..!" అని వినయాన్ని చాటుకుంది నక్క

◆◆◆

సభ కోలువుతీరి ఉంది. పులి, మంత్రి నక్క, వ్యాపారి నక్క, ఇతర పరివారం మొత్తం సభలో ఉన్నాయి. ఎదురుగా సీతాకోక చిలుకలు ఎగురుతూ తమ విన్యాసాలను పులిరాజుకు చూపాయి. తర్వాత నెమళ్లు నాట్యం చేసి తామ సౌందర్యాన్ని ప్రదర్శించాయి. ఆ తర్వాత కోయిలలు అద్భుతంగా పాడి పులిరాజుకు ఆనందం కలిగించాయి. తర్వాత చిలుకలు మనుషుల మాటలను అనుకరించి మాట్లాడాయి. అన్ని జంతువులు శభాష్ అన్నట్లు మెచ్చుకున్నాయి. ఇలా రాజుముందు తమ టాలెంట్ ప్రదర్శించి అన్నీ మెప్పుకోలు పొందుతున్నాయి.

గుర్రం లోపలకు వచ్చి "రాజా... మీకోసం దూర ప్రాంతం నుంచి ఏవో వచ్చాయి. మీరు అనుమతిస్తే.." అన్నది.

"మా కోసం దూర ప్రాంతం నుంచా... రమ్మను" అన్నది పులిరాజు.

ఉన్ని దుస్తుల్లో రెండు పక్షలు, రెండు జంతువులు లోపలకు వచ్చాయి. చూడ్డానికి చాలా చక్కగా ఉన్నాయి. తెల్లటి మేఘాల్ని శరీరానికి అతికించుకొచ్చినట్లు ఉన్నాయి. గమ్మత్తైన పరిమళమేదో వాటి నుంచి సోకి నభమొత్తాన్ని మైమరిచిపోయేలా చేసింది. వెంటనే వ్యాపారి నక్క తేరుకొని "మీరు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు?" అని అడిగింది.

"మేం మీ రాజ్యంలోనే వాళ్లమే ప్రభు... కానీ మీకు మాకు దూరం పెరిగిపోయింది. కొన్ని పొరుగురాజ్యంతో సంబంధాలు పెంచుకుంటున్నాయి. మా అందరికీ మీరు అన్నా, మీ పాలనా విధానాలన్నా చాలా ఇష్టం. మీ భక్తి, ముక్తి సిద్ధాంతాలంటే అమితమైన ప్రేమ. అందుకే మా ప్రాంతంలోని కొందరు పూర్తిగా మీ రాజ్యంలోకి వచ్చి ఇక్కడే స్థిరపడిపోయాయి, పోతున్నాయి." అన్నాయి అవి.

"పులిరాజుగారి కోసం ఏదో మాకు తోచిన బహుమతులు తెచ్చాం.." అని తమ దుగ్గరున్న మూట విప్పాయి తెల్లటి ఎలుగుబంట్లు. ఆ మూటలోని అందమైన ప్రకృతి పూలు, సుగంధ ద్రవ్యాలు రాజుగారికి ఇచ్చాయి. వాటిని చూడగానే రాజుగారి మతి పోయింది. ఇంతకాలం ఇన్ని సౌందర్యభరితమైన వాటిని అనుభవించకుండా ఉన్నానా..! అనుకుంది.

"మీరు తప్పకుండా మా ప్రాంతానికి రావాలి. మా ఆతిథ్యాన్ని స్వీకరించాలి" అని కోరాయి అవి.

"తప్పకుండా వస్తాం" మాటిచ్చింది పులి.

వాటిలో ఓ సుందరమైన పక్షి వ్యాపారి నక్కవైపు చూసి నవ్వింది. నక్క కూడా మెచ్చుకోలుగా ఒక్కసారి కళ్లు ఆర్పి, తల ఆడించింది.

◆◆◆

పులిరాజా, వ్యాపారి నక్క ఆ సుందర ప్రాంతంలో

ఉన్నారు. అందమైన లోయలు, మంచు కొండలు, మధ్యలో ప్రవహించే సెలయేళ్లు, సరస్సులు, ఎన్నో రకాల అందమైన, అరుదైన జంతువులు, చూడగానే నవయవ్వనాన్ని మనసుకు అద్దే ప్రాంతాలు. పులి, నక్క తిరుగుతూ అక్కడున్న ఒక్కో ప్రాంతంలో సేదతీరుతూ హాయిగా విహరిస్తున్నాయి.

పులిరాజుకున్న భక్తిని ముందే గమనించిన వ్యాపారినక్క అక్కడున్న దేవుళ్ల గుళ్లకు తీసుకెళ్లింది. ఒక్కో గుడికున్న చరిత్ర, అక్కడి పూజారులతో ప్రత్యేకంగా చెప్పించింది. ఆ గుళ్లే ఇంద్రావతికి ప్రాణం అని చెప్పించింది. ఆ చరిత్ర తెలుసుకోకపోతే జీవితమే దండగని వివరించేలా చేసింది. ఈ సృష్టికి మూలం మొత్తం ఆ కొండల్లోనే ఉందనే చరిత్రను సృష్టించి, పాత చరిత్రకు కొత్త హంగులు అద్ది మరీ చెప్పించింది. అవన్నీ విన్న పులిరాజుకు సరికొత్తగా జ్ఞానోదయం అయింది.

రాజుకోసం ఇంద్రావతి రాజధానికి వచ్చిన జంతువులు, పక్షులు పులిరాజుకోసం ప్రత్యేకమైన నృత్యాన్ని ఏర్పాటు చేశాయి. ఆ రోజు రాత్రి పులిరాజుకు నిద్రలేదు. నక్క పులి పక్కనే ఉండి "ఇంత సౌందర్యమైన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే.. ఇతర రాజ్యాల నుంచి కావాల్సినంత లాభం రాజా" అని చెప్పింది.

"ఎలా?" అడిగింది పులి

"రాజా... ఈ ప్రాంతానికి అందరూ రావడానికి అవసరమైన రవాణా సౌకర్యాలు కల్పిస్తాం. అందుకోసం కొన్ని చెట్లు నరికేస్తాం, సెలయేళ్లను పూడ్చేస్తాం. తోటలున్న స్థలాల్లో భవంతులు కడతాం. ప్రతి ప్రాంతాన్ని విహారకేంద్రంగా మార్చేస్తాం. విద్యుత్ ప్లాంట్లు నిర్మిస్తాం. వెలుగులతో నింపుతాం. చూడ్డానికి వచ్చే జంతువుల దగ్గర సుంకం వసూలు చేస్తాం. ఒక్కో ప్రాంతాన్ని చూసినందుకు, ఇక్కడ విడిది చేసినందుకు ప్రత్యేకంగా వాటి నుంచి విదేశీ మారకద్రవ్యాన్ని వసూలు చేస్తాం. పైగా ఇక్కడికి వచ్చిన ప్రతి పక్షి, జంతువు తప్పకుండా ఇక్కడి వస్తువులు కొంటాయి. అదీ మనకు లాభమే.. వాళ్లకు అనుకూలంగా విందులు వినోదాలు ఏర్పాటు చేస్తాం. సంతోషిస్తాయి. మన ఇంద్రావతికి కావాల్సినవాటిని ఆ రాజ్యాల నుంచి పొందుతాం. ఇతర రాజ్యాల రాజులను పిలిచి ఇక్కడి అందాలను చూపించి పెట్టుబడులు పెట్టమంటాం. ముగ్ధులవుతారు.. అలా.. అలా.. అన్ని రాజ్యాలకన్నా మన ఇంద్రావతి ముందుకు వెళ్తోంది.. ముమ్ముందుకు వెళ్తోంది" అని నవ్వింది నక్క.

లోపల మాత్రం ఇక్కడ కట్టే ప్రతి ప్రాజెక్టు నాకే ఇస్తుంది పులి రాజు... అనే ధీమా నక్కలో.

"నక్కా... నీ తెలివితేటల ముందు మా మంత్రి బలాదూర్. అసలు నీకే మంత్రి పదవి ఇస్తే సరిపోలా" అన్నది పులిరాజు.

"అయ్యో.. నాకెందుకు పదవులు, ఏదో వ్యాపారం చేసుకుని బతుకుతూ ఉంటా" అని వినయాన్ని నటించింది జిత్తులమారి నక్క.

♦♦♦

పులిరాజుకు ఆ ప్రాంతం నుంచి వచ్చినప్పటి నుంచి నిద్రపట్టడం లేదు. ఆ నదులు, సెలయేళ్లు, మంచు కొండలు, అక్కడి గుళ్లు.. ప్రపంచానికే ఇంద్రావతి వైభవాన్ని చాటాయని వాటి గురించి చెప్పిన పూజారులు, అక్కడి పరిమళం, అందాల సోయగం, నృత్యాలు చేసేటప్పుడు ఆ స్త్రీల వయ్యారాల ఒంపు సొంపులు.. ఇలా ఎన్నో.. ఎన్నెన్నో.. అన్ని కలిసి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దానికితోడు నక్క 'దాన్ని పర్యాటకప్రాంతం చేస్తే బోలెడు లాభాలొస్తాయి. మిగిలిన రాజ్యం అంతా ఆ డబ్బుతో ఇంకా అభివృద్ధి చెందుతుంది, ఇక్కడి ప్రజలు పాతరాతి యుగంలో బతికినట్లు బతుకుతున్నారు' అని చెవిలో ఇల్లుకట్టుకుని చెప్తూనే ఉంది. పులిరాజుకు ఆ మాటలు కూడా బాగా ఎక్కాయి. దాంతో సభ ఏర్పాటు చేసింది. నా మాటే శాసనం అన్నట్లు అన్ని జంతువులకు తను చేయేబోయే పని గురించి చెప్పింది. అన్నీ తలలు ఊపాయి. వ్యాపారి నక్క ఒక్కసారిగా సభ మధ్యలోకి వచ్చి.. "పులిరాజుకు జై" అని అరిచింది.

మిగిలిన పక్షులు జంతువులు కూడా "జై.. జై.." అని ధ్వానాలు చేశాయి.

కానీ ఆ ప్రాంతంలో ఉన్న జంతువులకు, పక్షులకు అది ఇష్టమో, కష్టమో తెలుసుకోవాలన్న ఆలోచన మాత్రం ఏదీ చేయలేదు... రాజు, మంత్రితో సహా..

ఏ పక్షి అయినా పులిరాజు నిర్ణయాన్ని కాదంటే ఒప్పుకునేది లేదన్న మాట ఆప్రాంతానికి ముందురోజే వెళ్లిపోయింది. దాంతో ఏ పక్షి, జంతువు కిక్కురుమనలేదు. ఏవరైనా అంటే వెంటనే ఆ ప్రాంతం నుంచి తరిమేస్తారో, జైల్లో పెడతారో, చంపేస్తారో అన్న భయం ఏర్పడింది వాటిలో. ఎలా అయితేనేం మొత్తానికి ఆ ప్రాంతం సకల రంగులతో అభివృద్ధి చెందింది.

♦♦♦

ఇది జరిగిన నాలుగేళ్లకు పులిరాజు ప్రవర్తనలో వింతమార్పు వచ్చింది. సభకు రావడం తగ్గించేసింది. ఎవరన్నా ఇంటికి వెళ్లినా వాళ్లతో చిత్ర విచిత్రంగా ప్రవర్తించేది. తన తోకతో తనే కొట్టుకునేది. పులి అన్న విషయం మర్చిపోయి, కోతిలా ప్రవర్తించేది. పైకి దూకి కొరికబోయేది. ఎక్కిరించేది. పళ్లు బయటకు తీసి కోపంగా ఇకిలించి చూసేది. ఇక వ్యాపారి నక్క వెళ్తే అమాంతం పైకి దూకేది. దాంతో ఎక్కడ తనను చంపుతుందోనని భయపడి పులిరాజా దగ్గరకు వెళ్లడమే మానేసింది నక్క.

రాజులో వచ్చిన మార్పు గురించి ఇంద్రావతి అంతా తెలిసింది. రాజాస్థానంలో ఉన్న పెద్దపెద్ద వైద్యులను తీసుకొచ్చి మంత్రి నక్క చూపించింది. కానీ ఫలితం లేదు. ఇంద్రావతిలోనే కాకుండా, పక్కనున్న అడవుల్లో ఉన్న వైద్యులను కూడా పిలిపించి చూపించింది. కానీ వచ్చిన రోగం ఏమిటో ఎవరికీ అంతుచిక్క లేదు. రాకరకాల మూలికలు తెచ్చి సాధి వాటి నుంచి రసం తీసి పులికి ఇస్తున్నాయి. తాగనంటే బలవంతంగా గొంతులో పోస్తున్నాయి. కానీ గుణం కనిపించలేదు. చెట్ల ఆకుల నుంచి పసురు తీసి శరీరానికి రాస్తున్నాయి. కానీ పులి రంగు మారిందే తప్ప, ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. ఇంకా ఏం చేయాలో తెలియక మంత్రి నక్క, సైనికాధిపతి ఏనుగు తలలు పట్టుకుని కూర్చున్నాయి. వ్యాపారి నక్క మాత్రం పులిరాజు చేష్టలకు భయపడి తనను ఎక్కడ చంపుతుందోనని మరో అడవికి పారిపోయింది. పులిరాజుకు వచ్చిన వింతరోగం గురించి ఆ అడవికి, ఈ అడవికి పాకింది. క్రమంగా ప్రపంచం అంతా తెలిసింది. ఎక్కడెక్కడ నుంచో వైద్యం తెలిసిన జంతువులు, పక్షులు, సకల జలరాశులు వస్తున్నాయి. కానీ రోగాన్ని మాత్రం తగ్గించలేకపోతున్నాయి. కొత్తగా చాలా దూరప్రాంతంలో ఉన్న అడవి నుంచి వచ్చిన ఒక తూనీగ మాత్రం 'ఇది పులిరాజుకు వచ్చిన శారీరక సమస్య కాదు, మానసికమైన సమస్య. అందుకు కారణం తెలుసుకుంటే వైద్యం చేయొచ్చు' అని సలహా ఇచ్చింది.

మంత్రి నక్క, పులిరాజా భార్య రాజుకు పిచ్చి పట్టడానికి ముందు ఏం జరిగిందో ఆలోచించాయి. రోగం వచ్చిన రోజునుంచి ఒక్కో రోజును వెనక్కు వెళ్లి రాజ్యంలో, రాజు జీవితంలో ఏమేం జరిగాయో ఆలోచించాయి. చివరకు వాటికి జ్ఞాపకం వచ్చింది. పులిరాజుకు కొత్తగా తన రాజ్యంలో కలుపుకున్న ప్రాంతాన్ని రెండోసారి చూసి వచ్చినప్పటి నుంచి ఈ రోగం మొదలైందని అర్థమైంది. అసలు ఆ ప్రాంతంలో రాజు ఏం చూసింది. అది రాజుపై అంత ప్రభావం ఎందుకు చూపాయి అన్నది తెలుసుకోవాలనుకున్నాయి. మంత్రి నక్క ఆడ పులి ఆ ప్రాంతానికి బయలుదేరాయి.

♦♦♦

ఎక్కడ చూసినా పెద్దపెద్ద భవంతులు, ఫ్యాక్టరీలు, నియాన్ లైట్ల కాంతులతో ఆ ప్రాంతం అంతా వెలిగిపోతుంది. అక్కడి జంతువులన్నీ హడావుడిగా వాళ్లవాళ్ల పనుల్లో బిజీగా ఉన్నాయి. ఏదీ మరొకదాన్ని గురించి పట్టించుకోవడం లేదు. కొండలు గుట్టలు ఏమీ లేవు. నదులు లేవు. సెలయేళ్లు లేవు. ఇళ్ల మధ్యలో అక్కడక్కడా చిన్నచిన్న లాన్స్ మాత్రం కనిపిస్తున్నాయి. తోటలు, అడవులు లేవు. అన్నీ బిల్డింగ్ లే. వాటికి తోడు అక్కడక్కడా రాత్రి, పగలు అనే తేడా లేకుండా జంతువులకు వచ్చే రోగాలు తగ్గించేందుకు హాస్పిటల్స్ ఉన్నాయి. అలా.. వాటన్నింటిని చూసుకుంటా మంత్రి నక్క, పులిరాజు భార్య ఆడపులి రోడ్ల మీద నడుస్తున్నాయి.

ఒక బిల్డింగ్ లోంచి పెద్దపెద్ద శబ్దాలు వస్తుంటే.. లోపలికి వెళ్లాయి. లోపల రెండు మూడొందల రకరకాల జంతువులు, పక్షులు ఊగుతున్నాయి. మధ్య మధ్యలో ఏదో తాగుతున్నాయి. ఆ బిల్డింగ్ లోనే ప్రత్యేకంగా ఉన్న గదుల్లోకి ఆడ, మగ అనే తేడా లేకుండా అన్ని రకాల జంతువులు వెళ్లి వస్తున్నాయి. తాగిన మత్తులో ఎలా అంటే ఎలా ప్రవర్తిస్తున్నాయి.

ఆడపులి ఒక పక్షి దగ్గరకు వెళ్లి ''ఇక్కడ ఏం జరుగుతుంది?" అని అడిగింది.

ఇది తెలీదా అన్నట్లు.. ముఖం పెట్టి "మేం చాలా దూరం నుంచి ఇక్కడి ప్రకృతి అందాలు చూడ్డానికి వచ్చాం. టూరిస్టులం. మాకు ఇక్కడ పార్టీ జరుగుతుంది. తాగడం, తినడం, డాన్స్ చేయడం.. ఇక ఇష్టమైన వాటితో.. ఇష్టమైన విధంగా ఎంజాయ్" అంటూ వెటకారంగా నవ్వుతూ వెళ్లింది.

మరో ఆడ నెమలి దగ్గరకు వెళ్లి "ఏమిటి.. ఇదంతా..?" అని అడిగింది.

ఆ నెమలి కన్నీళ్లు పెట్టుకుంటూ... "నేను ఇక్కడే పుట్టి పెరిగాను. కానీ ఇక్కడకు బలవంతంగా తీసుకొచ్చారు. ప్రతిరోజు ఇష్టం ఉన్నా లేకపోయినా ఇక్కడకు వచ్చే రకరకాల జంతువులకు సుఖం పంచాలి. అదేమంటే టూరిజంలో పెద్ద

ఉద్యోగం ఇచ్చాం. నెలకు లక్ష జీతం ఇస్తున్నాం. నీ అందం ఉపయోగించుకుంటే తప్పేంటి? అన్నాయి" అని చెప్పింది.

అక్కడ ఉండలేక మంత్రినక్క, ఆడపులి ఆ భవనం నుంచి బయటకు వచ్చేశాయి.

నడుస్తూ ఉంటే... వాటికి ఎడారి కనపించింది. అక్కడ వృద్ధ ఒక జంతువు అరుస్తూ బాధతో తిరుతూ ఉంది. రెండూ అక్కడకు వెళ్లాయి. "ఏమైంది? ఇక్కడ ఎందుకు అరుస్తూ తిరుగుతున్నావు?" అని అడింది నక్క.

ఆ జంతువు "నేను ఇక్కడే పుట్టి పెరిగాను. నా చిన్నప్పుడు ఇది మా పూలతోట. ఎంతో అందమైన పువ్వులు పూసేవి. వాటిని చూస్తుంటే ఎంతో సంతోషం వేసేది. నేను మా నాన్న, చెల్లి, అమ్మ.. తోటలో పనిచేసేవాళ్లం. వాటి మధ్య ఆడుకునే వాళ్లం. కానీ ఇప్పుడు అవన్నీ మాయమయ్యాయి. పులిరాజు మా ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పి, మాకు మేం మిగలకుండా చేసింది. మా సంతోషాన్ని దోచుకుంది. మమ్మల్ని బతికి ఉండగానే చంపేసింది. మా నాన్న, అమ్మ ఆ దిగులుతోనే ఇక్కడే చనిపోయాయి. మా చెల్లి బాగా చదువుకుంది, కొంతకాలంగా కనిపించకుండా పోయింది.." అని ఏడ్చేసింది. రాణిపులికి, మంత్రి నక్కకు ఏం చెప్పి ఓదార్చాలో తెలియలేదు. మౌనంగా తలలు వేళ్ళాడేసుకొని అక్కడ నుంచి దూరంగా వచ్చేశాయి.

అలా నడుస్తూ ఉంటే రాణి పులికి, మంత్రి నక్కకు మరో విచిత్రమైన ప్రాంతం కనిపించింది. ఏనుగు తన తొండంతో నేలను బలంగా తొవ్వుతూ ఉంది. కాళ్లతో తొక్కుతూ ఉంది. ఎందుకు అలా చేస్తుందో నక్కకు, ఆడపులికి అర్థం కాలేదు. దగ్గరకెళ్లి అడిగాయి.

"అయ్యో.. మీకు తెలియదా...?! ఇక్కడకు కొత్తగా వచ్చారా.. మీ లాంటి వాళ్లకోసం అక్కడ విందులు, వినోదాలు ఉంటాయి. వెళ్లండి. మా గురించి మీకెందుకు?" అని కసురుకుంది.

"మేం ఈ ప్రాంతాన్ని పాలించే పులిరాజా దగ్గర నుంచి వచ్చాం. నేను మంత్రిని, పులిరాజా భార్య.. ఈ ఆడపులి" అని పరిచయం చేసింది నక్క. అప్పటి వరకు తనపని తాను చేసుకుంటున్న ఏనుగా ఒక్కసారిగా చంపడానికి వాటిపైకి దూకింది. రెండూ చాకచక్యంగా తప్పుకున్నాయి.

"ఆగు మిత్రమా.. ఆగు.. అసలు ఏం జరిగింది? మీ ప్రాంతాన్ని చూసిన పులిరాజుకు పిచ్చిపట్టింది. అసలు ఇక్కడ ఏం జరిగిందో తెలుసుకుందామని వచ్చాం" అని చెప్పాయి రెండూ.

దాంతో ఏనుగు కొంత నెమ్మదించి చెప్పడం మొదలుపెట్టింది.

ఇక్కడ ఒకప్పుడు ఆపిల్ తోటలు ఉండేవి. తోటలన్నీ నరికేశారు. అడవంతా కొట్టేశాయి. బిల్డింగ్‌లు కట్టాయి. ఎక్కడో ఒక చోట మా ప్రాంతం చూడ్డానికి వచ్చేవాటి కోసం నాలుగైదు చెట్లు మాత్రం మిగిల్చాయి. వాటిని కాపాడుతూ గొప్పగా చూపిస్తున్నాయి. సెలయేళ్లన్నీ ఎడారులుగా మారిపోయాయి. ఇప్పుడు తాగడానికి నీళ్లు కరువయ్యాయి. కొనుక్కునే దుస్థితి. ఇక నాలాంటి పెద్ద జంతువుల పరిస్థితి ఏంటో మీకు తెలుసుకదా..! ఈ నేల మీద, ఇక్కడున్న చెట్లు, పూల మీద ఇష్టం చావక ఇలా.." అని అంతపెద్ద జంతువు బోరున ఏడ్చేసింది.

నక్కకు, పులికి అక్కడ ఉండబుద్ధి కాలేదు. వెంటనే తమ రాజధానికి బయలుదేరాయి.

అవి తిరిగి వచ్చేసరికి పులిరాజుకు పిచ్చి బాగా ముదిరింది. తన కాళ్లతో తనే కొట్టుకుంటుంది. తనతోకను తనే కొరుక్కుంటుంది. టైంకు భోజనం పెట్టినా తినడం మానేసింది. ఏ జంతువు దగ్గరకు వెళ్లినా తినేసేంత కోపంతో అరుస్తుంది. వ్యాపారి నక్క వచ్చి పులిరాజు పరిస్థితిని చూసి పెద్ద బోనులో బంధించమని సలహా ఇచ్చింది. రాజు పరిస్థితికి అదే పరిష్కారమని సభలో కూడా తీర్మానం చేశాయి అన్ని జంతువులు. అలా పులిరాజును బోనులో పెట్టాయి. వ్యాపారి నక్క బోనులో ఉన్నా.. పులిరాజు ఎక్కడ చంపుతుందోనని అ వైపుకు వెళ్లడం పూర్తిగా మానేసింది.

మంత్రి నక్క, పులిరాణి.. రాజు పరిస్థితి చూశాయి. ఆ పని చేయించింది వ్యాపారి నక్క అని తెలుసుకొని... దాన్ని బహిరంగంగా ఉరి తీయమని అజ్ఞాపించాయి.

ఆ మాట విన్న పులిరాజు బోనులోనే గంతులు వేసింది.

ఇప్పుడు పులిరాజుకు పిచ్చి తగ్గించడానికి, ఆ ప్రాంతాన్ని ఎప్పటిలా మార్చడానికి అడవిలోని అన్ని జంతువులు రహస్య సమావేశం జరుపుతున్నాయి. ప్రకృతిని తిరిగి అక్కడ పునఃప్రతిష్ట చేయడానికి ఏం చేయాలో చర్చిస్తున్నాయి. అందమైన జలపాతాలు, పూలూ, మంచుకొండలు ఎలా... అని ఆలోచిస్తున్నాయి. ♦

## పురస్కారాలు

### సాహిత్య ప్రస్థానం జనవరి 2020 పురస్కారాలు

**అనివార్యం**
కథకు : రూ.500/-
రచయిత : దుర్గాప్రసాద్

**నా డైరీ కనిపించడం లేదు**
కవితకు : రూ. 500/-
రచయిత : చిరిగిన మంజుల

■■■

కవితకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం,
కథకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి

■■■

పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు. - ఎడిటర్

కవిత

## శీర్షిక లేని కవిత!!

- బత్తిన కృష్ణ
9989370681



అలలు అక్కడే ఆగిపోండి
అందంగా కనిపించే తీరమిపుడు
కోరల్లేని రాకాసి మింగేస్తుంది

కలాల్లారా కాగితపు కోనేరు
కడుపు నిండిపోయింది
ఇక కన్నీరు పెట్టకండి
నులిమి నులిమి హృదయం
ఎరుపెక్కుతుంది

నివురుగప్పిన నక్షత్రాల్లారా
ఈ పూటకి మెరవకండీ
ఉల్కల్లా రాలిపోయిన ఈ నిశీధిలో
వెదకండీ..

దిక్కులు మీ స్థానాలను
మార్చుకోకండీ
మీ స్థితి గతులను మరచిపోతారేమో

ఉదయసంధ్యాల్లారా మీ మీ
ద్వారాలను
గడియలతో బిగించకండి


ఏ ఆర్తనాదమెపుడు
మీగుండెతలుపు తడుతుందో
ఎదురు చూస్తుండండి...

తోడబుట్టిన అన్నదమ్ముల్లారా
యౌవనతనువులను ఎటువైపు
మలపాలో మననం చేసుకోండి

ఆడతనమా సూర్యచంద్రుల నీడలు
నీకు శాపనార్థకాలు
భంగపరచడమే కానీ
బ్రతకనీయవు

కూలిన స్వప్నాలను ఏరుకొంటూ
నిరాశ నిస్పృహలతో దిశను
వెతుక్కొంటూ
అక్కడ్నుంచి ఎక్కడికో మరెక్కడికో
ఆగాగు.....
సముద్రగర్భమంతా నిర్మలమంట
నిన్ను అక్కడ పదిలంగా భద్రపరుస్తాలే
నీ అస్థికలను రాల్చలేని
నా కన్నీటి చుక్కలతో మూటగట్టి

రాయలేని కలాలకు పచ్చినెత్తుర్ని
అక్షర సిరాగా పోస్తూ...
నా కవితకు శీర్షికగా
నీ ఆర్తనాదాన్ని దిద్దుకొంటా ♦




# సంఘ సంస్కరణ ఉద్యమ పరిశోధన

**- వకుళాభరణం రామకృష్ణ**

**భా**రత దేశ చరిత్ర రచన ప్రధానంగా రాజకీయాంశాలతో ఆరంభమై, క్రమేపీ, ఇరవయ్యో శతాబ్ది ఆరంభం నాటికి, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలపై దృష్టి సారించింది. 1885లో సంస్థాగతంగా మొదలైన జాతీయోద్యమం యీ మార్పుకు ఊపిరిలూదింది. దేశం, దాని గతం, వర్తమానాలతోపాటు, భవిష్యత్‌కు బాటలు వేయడానికి చరిత్ర అధ్యయనం తప్పనిసరి. ఈ నేపథ్యంలో భారతీయుల మూలాలు, చరిత్ర, సంస్కృతులపై రచనలు వచ్చాయి. ఇవి గతకాలపు వైభవాన్ని కీర్తించడం ప్రధానాంశం. అది అప్పటి జాతీయోద్యమ అవసరం.

క్రమేపీ దేశస్థాయి చరిత్రల నుండి, ప్రాంతీయ చరిత్రల ఆనవాళ్ళు పరిశోధించడం మొదలై, ఆ జిజ్ఞాస కేవలం రాజకీయ ఘటనలకు ప్రాముఖ్యం యివ్వకుండా, ప్రాంతీయ సమాజాల సంస్కృతులపై దృష్టి సారించింది. 19వ శతాబ్దంలో మొదలై, ఇరవయ్యో శతాబ్దిలో కొంతవరకు, జాతీయోద్యమం ప్రజాఉద్యమ స్థాయికి ఎదిగేవరకు, కొనసాగిన సంస్కరణోద్యమాలపై విస్తృతస్థాయిలో పరిశోధనలు జరిగాయి.

1920 దశకం నాటికి సంస్కరణోద్యమం భావజాలం తెలుగు సమాజపు పొరల్లో చొచ్చుకుపోయింది. శిష్ట మధ్యతరగతి వర్గాలకే గాక ఇతరేతర సామాజిక బృందాలపై వాటి ప్రభావం ప్రసరించడం మొదలైంది. 1920 ఒక హద్దుగా పరిగణిస్తే, బ్రహ్మ సమాజ ఉధృతి తగ్గుదల కన్పించింది. స్త్రీలలో చైతన్యం బలపడింది. అయితే, 1920 దశకానికున్న చారిత్రక ప్రాముఖ్యత ఏమిటి? 1920ల నుండి సంస్కరణోద్యమాల గతీ, గమనం ఏమిటి?

1920 నాటికి, దేశ రాజకీయాల్లో మహాత్మాగాంధీ 'మొనగాడు'గా పరిణమిస్తున్నాడు. అప్పటికి ఒక సంవత్సరం తర్వాత నాటికి మొదటి సహాయ నిరాకరణ ఉద్యమాన్ని దేశవ్యాపిత మహోద్యమంగా నిర్వహించబూనాడు. దేశ రాజకీయాల్లో చోటు చేసుకొన్న పెనుమార్పులు సమాజాన్ని తాకి, సాంఘిక సంస్కరణలు మరో రూపంలో ముందుకొచ్చాయి. అయినప్పటికీ, కొత్త సామాజిక ఉద్యమాలు ముందుకొచ్చాయి. కొన్ని కొనసాగింపుగానూ – ముఖ్యంగా స్త్రీ సంబంధిత ఉద్యమాలు – మరికొన్ని కులప్రాముఖ్యంగానూ – బ్రాహ్మణేతర సంస్కరణోద్యమాలు (కులసంఘాలు), ఆస్తికతను ప్రశ్నిస్తూ ముందు ఇచ్చిన నాస్తికోద్యమం – దేవుడున్నాడా? లేడా? అనే ఆస్తి, నాస్తి చర్యలను దాటి, 'పాజిటివ్' (Positive) – సానుకూల నాస్తికత్వం – దీనిపై దృష్టి సారించిన, గోరా మహాశయుడు జరిపిన కృషి – ఇవి అప్పటి ప్రధాన స్రవంతి లోని సంస్కరణోద్యమాలు.

విశ్వవిద్యాలయ స్థాయిలో జరిగిన పరిశోధన ఈ

## కవిత

# పంజా

- కళ్యాణదుర్గం స్వర్ణలత
98486 26114



మిట్ట మధ్యాహ్నపు సూర్యకాంతి
వేళ్ళూనిన వెదురు తోపులను మేరువంత అయిన
దేవదారులను ప్రవేశానుమతిని అడిగింది...
నిట్టనిలువునా పరచుకున్న పచ్చదనం మధ్య
కొత్తగా వినిపిస్తున్న భ్రమరీ నాదం ఝుమ్మంది...
పాదాల కింద
లేళ్ళు దాగిన పొద కదిలిన మెత్తని చప్పుడైంది...

రాలిన ఆకులపై పరుగెట్టే ఉడతలు కొమ్మ కొమ్మ పై
ఊయలూగే వానారాల వయ్యారాల మధ్య
గమ్మత్తైన గజగమనం గుంపుగా గుచ్చుతోంది...
ఒక్కో జలపాతపు సవ్వడి పచ్చని ప్రకృతికి మైలపడని
వన్య ప్రాణుల ఊపిరికి ఆనవాలమౌతోంది...
అలాంటప్పుడు..
స్వచ్ఛమైన మట్టివాసన స్తన్యంగా ఊపిరి పోసుకున్న
కోటి కోటి ప్రాణుల మనుగడే ప్రశ్నార్థకం అయితే...
అంతవరకు స్థిమిత పడ్డ పరిసరాలు
ఒక్కసారిగా స్థాణువులై కంపిస్తే..
న్యూక్లియర్ ఫ్యూయల్ లోని అణువణువునా
ప్రసరించే న్యూక్లియర్ కరెంట్
ఒక్కసారిగా ప్రాణాలను హరిస్తే...
విద్యుత్తుకు విద్యుత్తుకు మధ్య
వనమే విధ్వంసం అయితే...
అవినీతి మూలాలను తాకిన ప్రభుతే
మూలకాల తవ్వకాలు చేస్తే..
మానవత్వపు మూలాలనే మంట కలిపే
మహామోసపు మేధో రచన సాగితే..

అమ్రాబాద్ ఒక అంపశయ్య అయ్
కడప బేసిన్ రావణ కాష్టమై
టైగర్ రిజర్వులు మ్యాపులు మాత్రమే అయితే..

కృష్ణా జలాలు కాలకూటమై విశ్వమంతా అయిన
విలయం భవిష్యత్తు భరోసాను ప్రశ్నార్థకం చేస్తే..

నిశ్శబ్దపు రోదనలో మౌనమైన ఆవేశంలో
కరపత్రాలు కాదు పంచాల్సింది...
బోర్డులు హోర్డింగులు కాదు పెట్టాల్సింది ..

నల్లమల నిర్వాసితుల నిట్టూర్పుల వేడితో మరుగుతున్న
నెత్తురు సాక్షిగా రండి...
సరిహద్దుల్లో సైన్యంలా మనమే నల్లమల సైన్యమౌదాం..

అనుమతులు ఇస్తున్న ప్రభుతపై
బలంగా ఎత్తిన పంజాలౌదాం..

♦

---

గ్రంథానికి మూలం. కుల సంఘాలు – బ్రహ్మణేతర – ప్రత్యేక, నిర్దుష్ట కారణాలు, సమస్యలతో, జాతీయోద్యమానికి సమాంతరంగా, కొన్నిసార్లు, ఆ ఉద్యమ ప్రతికక్షగా వ్యవహరించిన తీరు, గమనార్హం. వీటి గూర్చి, అవి చేపట్టిన కార్యక్రమాల గూర్చి (ఒక్క కుల సంఘానికి ప్రత్యేకంగా ఒకటి లేక రెండు పత్రికలు, కేంద్ర కార్యస్థానం, అనుబంధంగా ఏర్పాటైన పలు శాఖలు) ప్రస్తుత గ్రంథం వివరంగా విశ్లేషించింది.

ఇదే క్రమంలో, ముందే చెప్పినట్లు, నాస్తికోద్యమం, ఏటికి ఎదురీది సాగించిన నిర్మాణాత్మక కృషి, సామాజిక, సేవా, విద్య, వైద్య రంగాల్లో – గూర్చి వివరించింది.

విశ్వ విద్యాలయం పరిధిలో, అకడమిక్ పరిమితులను దృష్టిలో వుంచుకొని కొనసాగిన ఈ పరిశోధన ఆంగ్ల, తెలుగు భాషల్లో వెలవడ్డ సాధికారిక రచనలు, ఆయా ఉద్యమాలపై వెలువడ్డ మౌలిక గ్రంథాలు, అర్కైవ్స్‌లో వున్న, అపూర్వ చారిత్రక రికార్డులు, ఆయా కుల సంఘాలు ప్రచురించిన పత్రికలు, సభలు, తీర్మానాలు ఆధారంగా ఆంగ్లంలో రాసిన గ్రంథాన్ని, చక్కని తెలుగులోకి అనువదింపచేసి, ప్రచురించిన ప్రజాశక్తి పబ్లిషింగ్ వారు అభినందనీయులు.

♦




బండి ఉష



# సామాజిక కథల విపంచి

- యు. హేమలత

సాధారణంగా ఓ కథ ఒక అంశం చుట్టూ తిరుగుతుంది. కథల సమాహారం (సంపుటి) అయితే ఒక్కో కథ ఒక్కో అంశాన్ని స్పృశిస్తుంది. కనుక, ఒకే 'ఒక్క కథ'కన్నా, 'కథా సంపుటి' బహుళ ప్రయోజనకారి అని నా ఉద్దేశం. ఈ కోవలోదే "గ్రహణం వీడిన వేళ" కథా సంపుటి. ప్రముఖ కవయిత్రి, రచయిత్రి బండి ఉష వెలువరించిన ఈ సంపుటిలో సామాజిక స్పృహ కలిగించే కథలు 23 ఉన్నాయి. ఇవన్నీ వైవిధ్యం కలిగి ఉన్నాయి. ఎంతయినా వీటన్నింటినీ చదివే సమయం చదువరికి ఉండకపోవచ్చు. సమయాన్ని, అవకాశాన్నిబట్టి వీటిని ఎప్పుడైనా చదువుకోవచ్చు. కానీ ఈ సంపుటిలోని కథలన్నీ ఒకేసారి వరుసబెట్టి చదివించేంత తృష్ణ కలిగిస్తాయి. కథలు చదువరిని తమలో మమేకం చేసుకుంటాయి. మస్తిష్కంలో దృశ్యాలను ఆవిష్కరింపచేస్తాయి. సంపుటిలోని కథలు సమాజంలోని సమస్యలను లేదా రుగ్మతలను ఎత్తిచూపుతాయి. శిల్పం, శైలి, భాష, భావం అన్నీ రంగరించి రచయిత్రి ఉష కథలను చక్కగా వండి వార్చారు. సహజంగా ఉపాధ్యాయులకు సామాజిక స్పృహ ఎక్కువగా ఉంటుంది. ఈ రచయిత్రి కూడా ఉపాధ్యాయినే. గ్రామీణ నేపథ్యమూ, పట్టణ వాసమూ కలగలిసిన జీవితం వారిది. నేటి సమాజంలో ప్రధానమైన అన్ని రుగ్మతలనూ కథల్లో ఎత్తిచూపి చక్కటి 'మానవీయ, సామాజిక పరిష్కారాలు' సూచించారు. ఆ కథలేంటో ఒక్కసారి అవలోకిద్దామా.

టైటిల్ కథ 'గ్రహణం వీడిన వేళ'.. ఓ బిడ్డకు తల్లయిన వితంతువును పునర్వివాహం చేసుకోవడానికి యువకుని తల్లిదండ్రులే చొరవ తీసుకోవడం ఈ కథలో ప్రత్యేకత. పూర్వాశ్రమంలో ఈ యువకుడే ఆమెను ప్రేమించాడు. అయితే ఆమె ఇంటివారు ఈ వివాహాన్ని అంగీకరించలేదు. ఆమెకు ఇష్టం లేకపోయినా వ్యసనపరుడైన మేనమామను పెళ్లి చేసుకోవాల్సి వస్తుంది. ఓ బిడ్డకు జన్మ కూడా ఇస్తుంది. ఈ దశలో భర్త ఓ ప్రమాదంలో చనిపోతాడు. కొంతకాలం తరువాత పూర్వం ఆమెను ప్రేమించిన యువకుడి తల్లిదండ్రులు ఆమెకు రైలు ప్రయాణంలో యాదృచ్ఛికంగా తారసపడతారు. మాటల సందర్భంగా ఆమె గురించి తెలుసుకుంటారు. వారు ఎంతో పెద్ద మనసుతో బిడ్డ తల్లయిన ఆమెకు తన కుమారుడితో పెళ్లి జరిపిస్తారు. ఎంతో ఉదాత్తంగా సాగే ఈ కథను చదివితే మహిళ పట్ల చక్కని ప్రగతిశీల భావన కలుగుతుంది.

"మేల్కొలుపు" కథ.. ఆడపిల్లల పట్ల సాటి మహిళే దారుణ వివక్ష ప్రదర్శించడంపై సాగుతుంది. ఈ కథకు చక్కని ముగింపూ పలికారు. అత్త తన కోడలు ఆడపిల్లకు జన్మనివ్వడాన్ని సహించలేకపోతుంది. కోడలి గర్భవిచ్ఛిత్తికి

శతథా ప్రయత్నిస్తుంది. గర్భస్థ శిశువు.. నానమ్మకు కలలో కనిపించి, తన జన్మను అడ్డుకోవద్దనీ, నీకు మంచి పేరు తెస్తాననీ వేడుకొంటుంది. అలా నానమ్మ కళ్లు తెరిపించి ఆ శిశువు జన్మకు నోచుకుంటుంది. ఆడపిల్లల పట్ల వివక్ష నేటి సమాజంలో తీవ్రమైన రుగ్మతగా ఉంది. ఈ కథ అలాంటి ఉద్దేశం ఉన్నవారిలో కొందరినైనా కళ్లు తెరిపిస్తుందని ఆశించొచ్చు.

తల్లిదండ్రులను భారంగా భావించే బిడ్డల మనస్థత్వాన్ని వివరించే కథే "అనుబంధాలు". ముగింపు కన్నీరొలికించినా.. మంచి నీతి అందించిన కథ ఇది. తండ్రిని ఎంతో బాగా చూసుకున్న బిడ్డలు, ఆయన గతించాక.. ప్రేమాస్పదమైన తల్లిని వాటాలేసుకుని తమ వద్ద ఉంచుకుంటామని అనడంతో ఆ అమ్మ గుండె పగిలిపోతుంది. ఆ ఇంట్లో దశాబ్దాల తరబడి ఉన్న పనిమనిషి.. మీరు అనుమతిస్తే ఆ అమ్మను నేను జీవించి ఉన్నంతకాలం దగ్గరుండి చూసుకుంటానని చెపుతుంది. తమకు అమ్మను చూసే బాధ తప్పిందని బిడ్డలు సంతోషిస్తారు. తండ్రి తాను మరణించడానికి ముందు పనిమనిషిని ఉద్దేశించి రాసి తనకిచ్చిన కవరొకటి అతడి తమ్ముడు ఆమె చేతిలో పెడతాడు. దాన్ని విప్పి చూస్తే ఆ ఇల్లు పనిమనిషి పేరున రాసి ఉంది. 'ఈ ఇల్లేం చేసుకుంటాను. నాకు అమ్మ ఎటూ లేదు. ఈ అమ్మే నాకు అమ్మ. ఆ అమ్మను ప్రేమగా చూసుకుంటాను' అని ఆ కాగితాలు తిరిగి అతడి చేతిలోనే పెడుతుంది. ఆ కుటుంబం పట్ల ఉన్న నిష్కపటమైన ఆమె ప్రేమకు ఆ కాగితాలు చిన్నబోతాయి. ఇదీ కథకు ముగింపు.

డాలర్ల వేటకు పశ్చిమ దేశాలకు వెళ్లిన మన తెలుగు కుటుంబాలపై ఇందులో రెండు కథలున్నాయి. అవి: "అమ్మ ఒడి", "మమతల పందిరి". ఈ కథలు రెండూ ఒకే అంశం చుట్టూ తిరిగినా రెండు విరుద్ధ కోణాలను ఆవిష్కరిస్తాయి. "అమ్మ ఒడి" కథలో.. దంపతులు ఒకే దేశంలో వేర్వేరుగా చాలా దూరాన ఉంటారు. వీరిలో భార్యకు అమెరికాపైన, విలాసాలపైన మోజు ఉంటుంది. భర్తకు భార్యతో అనురాగంగా జీవించాలని ఉంటుంది. ఇంతదూరం వచ్చి కలిసి ఉండలేని స్థితి భర్తను ఒంటరిని చేస్తుంది. మాతృదేశంలోని అమ్మానాన్నల, బంధువుల అనుబంధాలు గుర్తుకొస్తాయి. ఈ విషయంలో భార్య వీటికి పూర్తి విరుద్ధం. దీంతో భర్త.. తాను కోరుకున్న విధంగా మాతృదేశం తిరిగి వెళ్లిపోతాడు భార్యను అక్కడే వదిలి. ఇక "మమతల పందిరి" కథలో.. తల్లిదండ్రులను వదిలి అమెరికా వెళ్లిన వారి కుమారుడు తాను ప్రేమించిన అక్కడి యువతినే పెళ్లి చేసుకుంటాడు. ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పకపోగా మాతృదేశంపైపు కన్నెత్తి కూడా చూడడు. ఓ రోజు తల్లిదండ్రులు కుమారుడుకు చేసిన ఫోను సంభాషణను బట్టి విషయాన్ని అర్థం చేసుకున్న అమెరికా కోడలు.. అత్తమామలపై అనురాగంతో పిల్లలతోసహా ఇండియా వచ్చి వారిని కలుస్తుంది. అమెరికాలో ఉన్న భర్త కూడా ఒంటరిగా ఉండలేక తానూ స్వగ్రామానికి బయలుదేరతాడు. ఇక్కడికొచ్చాక తల్లిదండ్రుల, బంధువుల, మిత్రుల ఆప్యాయతానురాగాలు అతణ్ణి కట్టిపడేస్తాయి. దాంతో భర్తతోపాటు ఇక్కడే ఉండిపోవడానికి అమెరికా కోడలు కూడా అంగీకరిస్తుంది. ఇలా ఈ రెండు కథలనూ వైవిధ్యభరితంగా మలిచినా.. పశ్చిమ దేశాలకు పోయి మోహం మొత్తి మాతృదేశం తిరిగి రావడమే వీటికి కొసమెరుపు.

"పండగొచ్చింది" కథ సోమేపల్లి జాతీయ కథల పోటీల్లో ద్వితీయ బహుమతి పొందింది. "ఓట్ల పండగ" నాయకులకు "కోట్ల పండగ" అయితే అనుచరులకు మాత్రం "కొట్లాటల పండగ" అవుతుందని రుజువు చేసిన కథ ఇది. ఇంటినీ, పొలంలో పైరునూ గాలికి వదిలేసి అస్తమానం తాగుతూ ఎమ్మెల్యే వెనుక చేరి ఎన్నికల్లో అతనికి జేజేలు కొడుతూ.. కొట్టించడంలో మునిగిపోతాడు ఓ పేద రైతు యువకుడు బంగారాజు. ఎమ్మెల్యే నైజం తెలిసిన తల్లిదండ్రులు, భార్య ఎంత మొత్తుకున్నా అతడు వినడు. ఎమ్మెల్యే తనను ఊరికి యూత్ ప్రెసిడెంట్‌ను చేస్తానన్నాడని గొప్పగా చెపుతాడు బంగారాజు. ఎమ్మెల్యే విజయోత్సవ ప్రదర్శనలో ఇచ్చిన కల్తీ మద్యం తాగి ఎందరో పడిపోతారు. అందులో బంగారాజూ ఒకడు. ఆసుపత్రిలో మూడు రోజులకు కళ్లు తెరిచిన అతడు తల్లిదండ్రులతో కూడా మాట్లాడకుండా నా ఎమ్మెల్యే ఏడీ అనడుగుతాడు. రాలేదని చెపుతారు తల్లిదండ్రులు. పది రోజులపోయాక తన ఇంటి ముందు నుంచి వెళ్తున్న ఊరేగింపులో 'యూత్ ప్రెసిడెంట్ రమేష్‌కి జిందాబాద్" అనే మాటలు వినిపిస్తాయి. దీంతో బంగారాజుకు జ్ఞానోదయం అవుతుంది. ఇది నేటి ప్రజాప్రతినిధులు అవసరానికి అనుచరులను వాడుకొని కరివేపాకులా తీసి పారేయడం మనం చూస్తున్నదే.

"పుష్కర గోదావరి". కథకు వస్తే... వరదల్లో ఇల్లు మునిగిపోతుందనే భయంతో బాలింతరాలైన తన కుమార్తెను

## కవిత

# పుస్తకం




- అనిత దావత్

9394221927


**నా** ఒంటరి నేస్తం
అజ్ఞానపు దారిలో
వెలుగు దీపం!

కాలక్షేపానికి మందు
ఉత్సాహానికి ప్రేరణ
నిరాశకు బద్ధ శత్రువు
బద్ధకానికి బుద్ధి చెప్పే
గురువు!

ఒంటరి తనంలో
నీడలా వెంటాడే తోడు
పుస్తకం
మస్తకాలను పదును పెట్టే
సానరాయి!
ఆలోచనల నిప్పురవ్వల్ని రాల్చే
చెకుముకి రాయి!

కొత్త లోకపు
మెట్లు ఎక్కించి
మైమరపింప చేస్తావు!
ప్రపంచాన్ని
నీ పుటల్లో దాచిన

అనంత విజ్ఞాన
సర్వస్వానివి!

ఓ పుస్తకమా!
నువ్వులేని లోకం
అక్షరాలా చీకటి గుహనే!! ♦

---

కొద్ది రోజులు మీ ఇంట పంచన ఉంచుతానని పాలేరు అడిగినా ఏమాత్రం కనికరం చూపలేదా పెత్తందారు. యాదృచ్ఛికంగా ఆ పెత్తందారు మనవడికి వరదల కారణంగా ఊళ్లో ఎక్కడా పోతపాలు లభించలేదు. ఆకలితో అల్లాడిపోతున్న శిశువు గుక్క పట్టి ఏడుస్తుంటే, మనసు కరిగిన పాలేరు.. బాలింతరాలైన తన కుమార్తె చనుబాలు ఇప్పించి పెత్తందారు మనవణ్ణి కాపాడతాడు. ఆ సందర్భంలోనే సెలవులకు ఇంటికొస్తున్న పెత్తందారు కొడుకు వరదలో చిక్కుకుపోతే పాలేరు కొడుకు ప్రాణాలకు తెగించి కాపాడతాడు. పెత్తందారుకు జ్ఞానోదయమవుతుంది. పెత్తందారు.. పాలేరు చేతులు పట్టుకొని.. 'మానవత్వాన్ని మించిన కులం', 'అమానుషత్వాన్ని మించిన అంటరానితనం' మరోటి లేదని వీరయ్యా అని పశ్చాతాపం చెందుతాడు.

''శుభ ఘడియలు'' కథ.. కృతజ్ఞతకు మించిన మానవత్వం లేదని చాటి చెపుతుంది. ఎవరి సహాయంతో అయితే తాను డాక్టరయ్యాడో.. వారి అమ్మాయి పెళ్లి నిశ్చితార్థం మోసపూరితమని తెలుసుకొని ఆ అమ్మాయినే పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడిన డాక్టర్ అశోక్ కథే ఇది.

ఇలాంటి మానవత్వం పరిమళింపచేసే అనేక కథలలోపాటు.. ఆర్థిక.. సాంఘిక.. రుగ్మతలను ఎత్తిచూపే కథలకు కూడా ఇందులో ఉన్నాయి.

"హరివిల్లు" కథ.. కులాభిమానాలు వికృత రూపం దాలుస్తూ మానవత్వానికే మచ్చను తేకూడదన్న సారాంశాన్ని తెలియజెపుతుంది. వన భోజనాలు, కుల భోజనాలుగా ఎలా మారుతున్నదీ విశదపరిచారీ కథలో.

"జీవనతీరం" కథ.. అనేక కష్టనష్టాలకోర్చి పెంచి పెద్దచేసిన తండ్రి చనిపోతే తల్లిని వృద్ధాశ్రమంలో చేర్పిద్దామనే కొడుకులకు ఎప్పుడో వారి ఇంట పనిచేసిన మహిళ గుణపాఠం చెపుతుందీ కథలో.

"పొరబాటు" కథ ద్వారా కూడా వృద్ధాశ్రమాలకు పంపించే యత్నాలకు అడ్డుకట్టు వేసే చక్కని ప్రయత్నం కనిపిస్తుంది.

"జ్ఞానోదయం" కథ.. కార్పొరేట్ చదువుల వికృత విన్యాసం తేటతెల్లం చేస్తుంది. రెసిడెన్సియల్ స్కూళ్లలో అధిక మార్కుల కోసం తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాల పెట్టే ఒత్తిళ్లు ఓ విద్యార్థినిని ఆత్మహత్యాయత్నానికి పురికొల్పుతుంది. అప్పుడుగాని ఆ తల్లిదండ్రులకు జ్ఞానోదయం కలగదు. ఇది నేటి సమాజాన్ని బాగా అతలాకుతలం చేస్తున్న సమస్య.

ఫేస్‌బుక్ ఫ్రెండ్‌షిప్ యువతీయువకులను ఎలా పెడదారి పట్టిస్తున్నదీ తెలియజెప్పే కథే "అమ్మమనసు".

ఇలా 23 కథలూ వైవిధ్యభరితంగానూ, సృజనాత్మకంగానూ మలిచారు రచయిత్రి బండి ఉష. ఆమె ఇంతకుముందు ఓ కవితా సంపుటి కూడా వెలువరించారు. బడి పిల్లల్లో నీతి పెంపొందించేందుకు అనేక పద్యాలూ రాశారు. వర్తమాన విషయాలపై అనేక వ్యాసాలు కూడా రాశారు. బహుముఖంగా ఆమె సాహితీ సేవ చేస్తూ 'సాహితీ సవ్యసాచి' అనిపించుకున్నారు. తమ కథల ద్వారా మానవీయ పరిమళాలను వెదజల్లడమేగాక, సామాజిక రుగ్మతలకు తనదైన శైలిలో చక్కని పరిష్కారాలు చూపిన ఆమె ఎంతయినా అభినందనీయులు.

23 కథలతో 192 పేజీలున్న ఈ పుస్తకం ధర రూ.100 మాత్రమే. బండి ఉష, ఫోన్ నెం.9676377462 ద్వారా కథా సంపుటిని తెప్పించుకోవచ్చు. ♦

# పరితపిస్తున్నా...



- మోకా రత్నరాజు

నిద్రాహారాలు మరచి
కట్టినదాన్ని కూల్చుతూ
కూల్చినదానిని కడుతూ
పలుమార్పు చేర్పులతో
మగపక్షి నిర్మించే గూడును చూడు
తోడును కోరే ప్రేమ తపన కన్పిస్తోంది

ప్రసవించిన
పచ్చి బాలింత పందిని చూడు
దవడ బెంకులు గాయాల మయమై
రక్తం చిందుతున్నా-
తాటి మట్టల్ని : ఈత కంపల్ని కొరికి త్రెంచి
ఆకూ అలమల్ని కూర్చి పేర్చి
పసికందు పిల్లలకి
వెచ్చెచ్చని పడక పాన్పు అమర్చే అమ్మతనం అగుపిస్తోంది

నీటి నివాసమ్మీద
ఆదమరచి ఈదులాడే పిల్ల కచ్చును చూడు
అడుగున రక్షణ కవచమై
తల్లి కొర్రమేను సిపాయిలా ఆదుకుంటుంది

ప్రాణాలకు తెగించి
పరిసరాలను పరికించి
తీరాన తవ్విన గోతిలో
ప్రసవించిన గుడ్లను వదల్లేక వదులుతూ
వళ్ళారకుండానే జలప్రవేశమయ్యే
తాబేలు ఆవేదనల్ని ఆలకించు
సాగరఘోషై విన్పిస్తోంది

తన్నుకెళ్ళబోయే గ్రద్దను ఎగిరెగిరి పొడిచి
రెక్కల చాటున పిల్లల్ని దక్కించుకునే
తల్లి కోడిపెట్ట పోరును చూడు
ప్రాణానికి ప్రాణం పెట్టే మాతృత్వం కన్పిస్తోంది

పిల్లల్ని నోటకరచుకుని
స్థావర శిబిరాల్ని మార్చే
జాగురతెరిగిన తల్లి పిల్లిని చూడు

చెట్టు చెట్టుకూ మకాం మారుస్తూ
పొట్టనంటు పెట్టుకుని కాపాడుకుంటూ
తాను గాయపడ్డా కాని
పిల్లకు పిసరంత నొప్పి వాటిల్ల కూడదని తల్లడిల్లే
తల్లికోతిని చూడు

పశు పక్షాదుల
ప్రేమ; వాత్సల్యాల తపనల్ని చూసైనా చలించక
కులమని, మతమని, పరువని ఛాంబికాలకు పోయి
కన్న బిడ్డల్ని, వాళ్ళ ప్రేమల్ని హతమారుస్తున్న వాళ్ళను
చూస్తుంటే-
మనుషుల కన్నా
మృగాలే నయమని
అరణ్యాల కన్నా
జనారణ్యాలే భయమన్పిస్తున్నా-
ఎప్పటికైనా మనుషులంతా
ప్రేమకు పట్టం కట్టకపోతారా అని
కొండంత ఆశతో ఎదురు చూస్తున్నాను
మార్పు కోరి అనునిత్యం పరితపిస్తున్నాను. ♦

# మహిళా చైతన్య చిత్రణ

- పాదిలి నాగరాజు
7989320752



డా॥ పి. శ్రీదేవి



"దౌర్బల్యాన్ని చూసి బాధపడడమే ఒక దౌర్బల్యం ఆ బాధ తనకులేదు. ఈ విచిత్ర ప్రపంచంలో అలాంటి బాధను పెట్టుకుంటే బతకడం కష్టం. ఆ మాటకొస్తే అలాంటివాళ్ళ వెనకాల నడవడం కూడా కష్టమే". ఇదే స్ఫూర్తిగా నడిచిన నవల కాలాతీతవ్యక్తులు. గోరాశాస్త్రి సంపాదకత్వంలో హైదరాబాదు నుంచి వెలువడిన 'తెలుగుస్వతంత్ర' పత్రికలో ఈ నవల 21 వారాలపాటు (సెప్టెంబరు, 1957 నుంచి జనవరి 5, 1958 వరకు ) నిర్విరామంగా కొనసాగింది. డాక్టరు పి. శ్రీదేవి ఈ నవలను 1957 లో రాసినా ఇది 1958లోనే పుస్తకరూపానికి వచ్చింది. ''తరతరాల బానిసత్వంలో మ్రగ్గిపోతూ చాలినా చాలకున్నా భర్త పాదాలచెంత జానెడుచోటు వెతుక్కుంటూ జన్మజన్మ బంధాలను నమ్ముతూ వుండే స్త్రీ లోకంలో జాగృతి కలిగించాలని కృషిచేసిన రచయిత్రులను వేళ్ళపై లెక్కపెట్టవచ్చు. (మహిళ – పు..67)". ఇలాంటి రచయిత్రులలో మొదటితరానికి చెందిన రచయిత్రి డాక్టరు పి. శ్రీదేవి. 1929లో పుట్టి 1961లో చనిపోయిన ఈమె వృత్తిరీత్యా మెడికల్ డాక్టర్. ఈమె మరణించింది చిన్నవయసులోనే అయినా తరాల తరబడి మరచిపోలేని గొప్ప నవలను తెలుగు నవలా సాహిత్యానికి అందించారు. తెలుగు సాహిత్య పెద్దలు పేర్కొన్న పంచనవలల్లో ఇది ఒకటిగా ప్రసిద్ధిచెందింది. సభ్యసమాజంలో సమకాలీన స్త్రీలపట్ల మారుతున్న అలోచనల పరంపరలకు అద్దం పట్టిన నవల కాలాతీతవ్యక్తులు.

"ఆధునిక మహిళలే చరిత్రను తిరిగి రచించగలరు" అన్న గురజాడ కాలానికే స్త్రీ చైతన్యవంతమైన జీవితంవైపు దృష్టిని సారించిందని తెలుస్తుంది. భవిష్యత్తులో మహిళ మంచి నైపుణ్యంతో సమాజాన్ని శాసించే స్థాయికి చేరుతుందనే వాస్తవాన్ని గురజాడ ఎప్పుడో గుర్తించడం వలన అయన మహాకవి అయ్యాడు. కాలచక్రం సమాజాన్ని తనలో కలుపుకుని చైతన్యంతో పరిభ్రమిస్తుంటుంది. ఈ భ్రమణంలో కొంతమంది కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంటే, కొంతమంది కాలంతోపాటు కలిసి నడుస్తుంటారు. మరికొంతమంది కాలానికి ఎదురీది కాలంకన్నా ముందు నడుస్తూ కాలాతీత వ్యక్తులవుతారు. ఇటువంటివారే నవలలో ఇందిర, కళ్యాణి, వసుంధరలు. స్వాతంత్ర్యం వచ్చిన పది సంవత్సరాలకు వచ్చిన నవల ఇది. నాటి సమాజంలో యువతీయువకులు వారి జీవితాలలోకి వచ్చే "కొత్తపాతల మేలుకలయిక"తో కలిసి జీవించే సంధికాలమది. అయితే పాశ్చాత్య ప్రభావంతో కొత్తజీవితాలవైపు దృష్టి మరల్చిన మధ్యతరగతి విద్యాధికుల జీవితగాధలను "కాలాతీతవ్యక్తులు" చిత్రించింది. కొత్తగా

ఇల్లువిడిచి చదువులకోసం, ఉద్యోగాలకోసం బయటి ప్రపంచంలోకి అడుగుపెడుతున్న మధ్యతరగతి, మధ్యతరగతి దిగువవున్న ఆడపిల్లలు, మగపిల్లలు ఈ ప్రపంచంలో ఎలా నెగ్గుకురావాలనే ఆలోచనలలోనుంచే ఈ నవల పుట్టిందనిపిస్తుంది. ఇంత పెద్ద పోటీ ప్రపంచంలో డబ్బు, విద్య, ఆశ్రయం ఇవేవీ లేకపోయినా ధైర్యంగా ఆత్మవిశ్వాశంతో సుడిగుండాల జీవితాన్ని సైతం తనకు అనుకూలంగా మలచుకొని చివరికి అనుకొన్న గమ్యానికి చేరుకొనేవారంతా ఎదుటివారికి వంచకులుగా, అసత్యవాదులుగా కనిపిస్తారు. కానీ ఇలాంటి వారికి ఏఒక్క అవకాశం లభించినా వారే సత్యసంధులుగా, ధర్మమూర్తులుగా మారి మనగలుగుతారు. ఇటువంటి భావజాలాల ప్రతిరూపమే కాలాతీతవ్యక్తులు. ఉదయం లేచినప్పటినుండి ఎన్నో సంక్లిష్ట పరిస్థితుల మధ్య జీవిస్తూ పరుగెడుతున్న విభిన్న మనస్తత్వాల సమ్మేళనంతో కొన్ని నెలలపాటు నడిచిన సంఘటనల సమాహారమే ఈ నవలా ఇతివృత్తం.

విశాఖపట్నంలోని రైల్వేకు చెందిన ఒక ఆఫీసులో స్టెనోగా పనిచేస్తున్న ఇందిర 22 ఏళ్ళ యువతి. తండ్రి ఆనందరావుతో కలిసి చెంగళరావుపేటలో నాలుగు గదుల అద్దె ఇంటిలో ఉంటుంది. అద్దె కలిసివస్తుందని డాక్టరు చదివే ప్రకాశానికి ఒక గది అద్దెకు ఇస్తుంది ఇందిర. ప్రకాశం స్నేహితుడు కృష్ణమూర్తి అప్పుడప్పుడు ప్రకాశంకొసం వస్తూ వుంటాడు. చురుకైన స్వభావం కల్గిన ఇందిర ఇద్దరినీ స్నేహితులను చేసుకుంటుంది. ఇందిర తండ్రి ఆనందరావు సోమరి.కూతురి సంపాదనపై ఆధారపడి జీవిస్తూ వుంటాడు. మద్యపానం, జూదం లాంటి దుర్వ్యసనాలకు బానిస. బి.ఎ. జూనియర్ చదువుతూ చదువుమానేసిన ఇందిర టైపు, షార్ట్‌హేండ్ నేర్చుకొని ఆ చిన్న ఉద్యోగంతో వచ్చే చాలీచాలని సంపాదనతో తీరని ఎన్నో ఆశలతో, కోరికలతో కాలాన్ని, లోకాన్ని, ఒకేసారి జయించాలని ప్రయత్నిస్తుంటుంది. ప్రకాశం మేనమామచేతిలో కీలుబొమ్మ. తండ్రి పోగా మేనమామ సంరక్షణలో మెడిసిన్ చదువుతుంటుంటాడు. అతనికి అది ఆఖరు సంవత్సరం. కళ్యాణి తల్లిలేని పిల్ల. పల్లెలో వున్న తండ్రి అతి కష్టంమీద డబ్బు పంపుతూ పట్నంలో న్యాయవాదివిద్యను చదివిస్తున్నాడు. యూనివర్సిటీ హాస్టల్లో కళ్యాణికి కుదరకపోవడంతో ఇందిర తన ఇంటికి తీసుకువచ్చి ఆశ్రయం ఇస్తుంది. కృష్ణమూర్తి జల్సాపురుషుడు. పల్లెనుంచి వచ్చి చదువుసంధ్యలకు స్వస్తి చెప్పి మార్చి, సెప్టెంబరు పరీక్షలలో కూర్చుంటాడు. జీవితానికి తగిన లక్ష్యంలేక విలాసంగా జీవిస్తూవుంటాడు. ఎంతతిన్నా తరగని ఆస్తి ఉండడమే కృష్ణమూర్తి బలాదూర్ జీవితానికొక కారణం. ఒకరి కష్టాలు ఒకరికి చెప్పుకోవడంలో ప్రకాశం, కళ్యాణి దగ్గరవుతారు. ఇలాంటి సమయంలో కళ్యాణి జబ్బుపడడం, ప్రకాశం డాక్టరుగా ఆమెకు సేవలుచేయడం వల్ల ఇద్దరి బంధం మరింత గట్టిపడుతుంది. ప్రకాశాన్ని ప్రేమిస్తున్న ఇందిర ఇది చూసి సహించలేకపోతుంది. ఇంతలో కళ్యాణి తండ్రికి జబ్బుచేయడంతో కళ్యాణి వాళ్ళ ఊరికి వెళ్ళిపోతుంది. ఇంతలో ఇందిర ప్రకాశాన్ని తనవైపు తిప్పేసుకుంటుంది. ఊరినుంచి తిరిగివచ్చిన కళ్యాణి ప్రకాశంలోని మార్పును చూసి బాధపడుతుంది. తండ్రిని పోగొట్టుకున్న కళ్యాణికి ప్రకాశం, ఇందిరల తీరు మరింత బాధను కలిగిస్తుంది. ఇందిర ఇల్లువదిలి తోటి స్నేహితురాలైన వసుంధర ఇంటికి వెళ్ళిపోతుంది. ప్రకాశం అమ్మాయిలతో కలిసి తిరుగుతున్నాడనే వార్త మేనమామకు తెలిసి ప్రకాశాన్ని, ఇందిర ఆనందరావులను గట్టిగా హెచ్చరిస్తాడు. మేనమామ కోపానికి లొంగిపోయిన ప్రకాశం ఇందరను వదిలేసి రాజమండ్రి సంబంధానికి వప్పుకుంటాడు. ఇందిర పిరికివాడైన ప్రకాశాన్ని ఒద్దనుకుంటుంది. కృష్ణమూర్తితో పరిచయాన్ని పెంచుకుంటుంది. కళ్యాణి ఖాళీ చేసిన గదిని కృష్ణమూర్తికి ఇవ్వాలని కుట్రచేస్తుంది. కళ్యాణిని మోసంచేసి తరిమేసిన ఇందిరను కృష్ణమూర్తి అసహ్యించుకుని ఇందిరకు దూరంగా వెళ్ళిపోతాడు. కళ్యాణి జీవితంపై జాలిపడిన కృష్ణమూర్తి కళ్యాణిని వెతుకుతూ చివరికి వసుంధర ఇంట్లో వుందని తెలుసుకుంటాడు. తరచూ వసుంధర ఇంటికి వస్తూ కళ్యాణి మంచి చెడులను తెలుసుకుంటుంటాడు.

ఒక సన్నివేశంలో వసుంధర ఇంట్లో కళ్యాణి ఊరి మునసబు రామనాయుడు ప్రాణాపాయ పరిస్థితిలో ఉండగా కృష్ణమూర్తి కళ్యాణి వసుంధరలకు చక్రవర్తి అనే డాక్టరును పరిచయం చేస్తాడు. చక్రవర్తి కృష్ణమూర్తి స్నేహితుడు. కళ్యాణిలోని మృదుత్వానికి ప్రసన్నమవుతాడు. కృష్ణమూర్తి, కళ్యాణి వసుంధరల పరిచయాలతో జీవితంలోని సున్నితమయిన పొరలను, లోతులను చూడడం తెలుసుకుని తన జీవనవిధానాన్ని మార్చుకుంటూ సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తాడు. వివాహ జీవితంలో అన్ని వికృతకోణాలనూ అనుభవించిన చక్రవర్తి తనలాగే దగాపడి, జీవితాన్ని చూసి

భయపడుతున్న కళ్యాణికి అండగా నిలవాలని ఆమెకు దగ్గరవుతాడు. వసుంధర తన కుటుంబ వ్యక్తుల మమతల ప్రభావంతో బాహ్య ప్రపంచంతో సంబంధంలేని జీవితాన్ని అనుభవిస్తూ స్వేచ్ఛకోసం పోరాటానికి దిగి తాను కోల్పోయిన స్వేచ్ఛను అనభవించడానికి కృష్ణమూర్తి స్నేహాన్ని సాధనంగా చేసుకుంటుంది. తనకు తెలియకుండానే కృష్ణమూర్తిని ప్రేమిస్తుంది. ఇది గ్రహించిన కృష్ణమూర్తి వసుంధరకు అన్నివిధాల తాను తగినవాడను కానని వసుంధరకు దూరం కావాలని నిశ్చయించుకున్న సమయంలో ఇందిర కృష్ణమూర్తిని ఆకర్షిస్తుంది. తన శరీరాన్ని కృష్ణమూర్తికి అర్పిస్తుంది. దీనితో కృష్ణమూర్తి ఇందిరను పెళ్ళిచేసుకోవాలని నిశ్చయించుకొంటాడు. చక్రవర్తి కళ్యాణిని పెళ్ళి చేసుకోవాలనుకొంటాడు. ఈ విధంగా కళ్యాణి చక్రవర్తి, ఇందిర కృష్ణమూర్తుల పెళ్ళిళ్ళు తిరుమలలో జరగడంతో కథ సుఖాంతంగా ముగుస్తుంది.

ఈ నవలలోని ఇతివృత్తం ఇప్పటికీ సమాజంలో మన కళ్ళముందు కనిపిస్తూనే వుంటుంది. సాంకేతిక పరిజ్ఞానం అందలమెక్కిన ఈ రోజుల్లో స్త్రీలు తమ సాధికారికతకోసం పోరాడుతూ ముందుకు సాగిపోతున్నారన్నది వాస్తవమే. నవలాకాలానికి కేవలం విద్యావంతులైన స్త్రీలలోనే చైతన్యభావాలు వుండేవి. డాక్టరు చదివిన రచయిత్రి నాటి వైవిధ్యభరితమైన స్త్రీల జీవితాలను పరిశీలించి స్త్రీ చైతన్య ధోరణిలో నడవాలనే ఆకాంక్షతోనే ఈ నవలను చిత్రించినట్లు తెలుస్తుంది. ఈ ప్రభావంతోనే నవలలో తనతోపాటు తన చుట్టూవున్న స్త్రీలలో చైతన్యవంతమైన భావ జాలాలను నింపగలిగిన పాత్రగా ఇందిర కనిపిస్తుంది. "ఏపనిచేసినా నేను కళ్ళు తెరుచుకొనే చేస్తాను. నాకూ మిగతావాళ్ళకూ అదే తేడా. ఏడుస్తూ ఏదీ చెయ్యను. ఏం జరిగినా ఏడవను." అనుకొనే ఇందిరే నవలలో ప్రధాన పాత్ర, నాయికపాత్ర. ఇందిరలాంటి పాత్ర తెలుగు సాహిత్యంలోనేకాదు ప్రపంచ నవలా సాహిత్యంలోనే కూడా అరుదుగా కనిపించే పాత్ర. ఈమె పోరాట జీవితానికి అత్యంత కీలకం తాను పుట్టిపెరిగిన వాతావరణమే. "నిరంతరం రోగంతో మూలిగే తల్లి అంటే ప్రేమాభిమానాలు పెంచుకోలేక పోయింది. రాత్రి నిద్రపోయేటప్పుడు కూతుర్ని గుండెలమీద పడుకోపెట్టుకొనేవాడు నాన్న. ఆయన పెదాల్లోంచి ఘాటైన ద్రావకాల వాసనలు వెదజిమ్మేవి. అటువంటి అనుభవాల వల్ల గట్టిపడింది పిల్ల. ప్రకృతి ఇచ్చిన గట్టి శరీరమూ, చురుకైన మెదడు ఈ రెండిటివల్లా అన్ని అడ్డంకులున్నా నెమ్మదిగా చదువులో కాలేజీదాకా ఎగబాకింది." జూదానికి తాగుడుకు బానిసైన తండ్రి తన బాధ్యతనెలా తీసుకోగలడు. గుర్రాలతో పరుగులు తీసే ఇందిర కోరికలను, అభిప్రాయలను ఎలా అర్థం చేసుకోగలడు. బి.ఎ. జూనియర్ వరకు చదివిన ఇందిర తన బతుకును తానే మోసుకుంటూ సుడిగుండాలతో నిండిన జీవననదిని దాటాలని నిశ్చయించుకొని సమయస్ఫూర్తితో సందర్భానికి తగిన విధంగా నడుచుకుంటూ వెళ్తుంటుంది. ఈ దారిలో ఎవరెలా నష్టపోయినా ఆమెకనవసరం. "నాయిల్లు నేను కట్టుకుంటుంటే పక్కనించి నడచి వెళ్లేవారి నెత్తిమీద యిటికలు పడ్డాయంటే నేనేం చెయ్యగలనూ ఎవరిమటుకు వాళ్ళు చూసుకునడవాలి" అంటూ కాలాన్ని నెట్టేసుకుంటూ జీవిస్తుంటుంది. ప్రేమ, అభిమానం, ఆర్థిక సమానత్వం, సామాజిక గౌరవం లాంటివి అందని వ్యక్తులు ఈ లోకం మీద కసిని పెంచుకోవటం సహజం. ఈ కసిలో వాళ్ళు లోకం మర్యాదలను ఏ మాత్రం ఖాతరుచెయ్యరు. వారి భావజాలాలతో రూపొందిన ఇందిర "నువ్వు పురుగులాగ బతికేస్తే అందరూ నీమీద కాలేసి తొక్కేస్తుంటారు" కాబట్టి ఎదురుతిరిగి పోరాడటమే జీవిత పరమార్థమని హెచ్చరిస్తుంది. ఈ మాటలతో రచయిత్రి స్త్రీ జీవితాన్ని వెన్నుతట్టి పరుగులెత్తిస్తుంది. అణిచివేతకు గురైన ఎవరైనా సరే ఈ అభిప్రాయాన్ని ఏకీభవిస్తారనే చెప్పాలి. ప్రేమించిన తనను కాదని కళ్యాణిని ఇష్టపడిన ప్రకాశంను ఇందిర చాకచక్యంతో తనవైపుకు తిప్పుకుంటుంది. "నేనున్నానులే నీకేం భయంలేదు. నీ సమస్యలూ, బరువులూ అన్ని నామీద పడేయ్ అనగలిగే పెద్ద ఛాతీ మొగాడు, అవసరమైతే నాకోసం సమస్తమూ ఒదులుకో గలిగే మొగాడూ" ప్రకాశమని ఊహించుకుంటుంది. కానీ తన ఊహలకు వెన్నుముకలేనివాడు ప్రకాశమని తెలిసి ప్రకాశాన్ని వదిలించుకుటుంది. వసుంధరను ప్రేమంచిన కృష్ణమూర్తికి తన శరీరాన్ని అర్పించి తనవైపుకు లాక్కుంటుంది. ప్రతీదీ చాలా తేలికగా తీసుకునే ఇందిరకు ఇది పెద్ద విషయమేమికాదు. "పరవాలేదులే ఇంతలోకే నా పాతివ్రత్యానికి భంగంరాదు. ఇద్దరం కూర్చోని పోదాంపద" అన్నంత సులభంగానే ఒకరాత్రి పరపురుషుడుతో గడిపేయగలదు. అందుకే తన శీలాన్ని ఒకసారి ప్రకాశానికి అర్పించినా కృష్ణమూర్తికి అందించేటప్పుడూ కూడా అభ్యంతరం

చెప్పదు. తనతో ఒకరాత్రి గడిపిన కృష్ణమూర్తి పెళ్ళిచేసుకుంటానని చెప్పినపుడు తాను ఎవరికీ బానిసగా వుండనని నిర్మొహమాటంగా చెప్పే ధైర్యం ఇందిరది. "నీతో ఎంతదూరం రమ్మన్నా వస్తానుగాని ఏ ఘట్టంలోనూ నా వ్యక్తిత్వాన్ని చంపుకోలేను. ఆ మాత్రం అర్థం చేసుకొని నా అవసరాలను గౌరవించటం నేర్చుకొని, నన్ను నాయిష్టం వచ్చినట్లు వూపిరి పీల్చుకోనిస్తానా నువ్వు సుఖపడగలవు నన్ను సుఖపెట్టగలవు. లేదా ఇద్దరికీ నరకం తప్పదు. ఇద్దరం కలిసి ఒకళ్ళ కళ్ళలోకి ఒకళ్ళం చూస్తూ కూర్చునేందుకుకాదు ఇలా దగ్గరికి వచ్చింది. ఇద్దరం కలిసి ఒకే లక్ష్యంవైపు చూడగలిగితే సార్థకం అంతేగాని, నాన్న ఒకరకం జైలులోకి వెళితే నేను ఇంకోరకం జైలులోకివచ్చాననుకోకు" అంటూ తన మీద తనకు వున్న గౌరవాన్ని నిర్భయంగా చెబుతుంది. ప్రతి స్త్రీ తన భాగస్వామితో ఇలాంటి అభిప్రాయాన్ని చెప్పే ధైర్యం ఆమె ఆర్థికస్వావలంబన నుంచే పుడుతుందని ఇందులో నిగూఢంగా దాగివుంది. దీనిని రచయిత్రి నవలలో చాలాచోట్ల పేర్కొంది. ఇందిరకు ఇందిరమీద గౌరవం తప్ప లోకంలో ఇంక ఎవరిమీదా గౌరవం వుండదు. దీనికి కారణం లోకమే అంటుంది ఆమె. స్వేచ్ఛాహక్కులు ఎవరో ఇస్తారని దేబరించుకుంటూ వుండటం వృథాప్రయాసే. వాటిని ఎలాగైనా లాక్కోవటమే వ్యక్తుల కర్తవ్యం. తన స్వేచ్ఛలో తానే జీవిస్తూ లోకానికి ఎదురీది తన జీవితాన్ని తాను సాధించుకుంటుంది ఇందిర. ప్రతి చిన్న విషయానికీ మదనపడుతూ, ఆత్మహత్యలు చేసుకొనే ఆడవాళ్ళకు ఇందిరపాత్ర ఒక ఆదర్శం. ఇది కాలానికి అతీతంగా నిలిచిన గొప్పపాత్ర.

నవల చదివిన సాధారణ పాఠకులందరికీ నచ్చేపాత్ర కళ్యాణి. అణుకువ, స్వాభిమానంలాంటి భావాలతో అనామకంగా జీవించే బీదపిల్ల ఈమె. "ఐదేళ్ళ కళ్యాణి నాన్నతోపాటు బడికి వెళ్ళేది. ఎనిమిదేళ్ళ కళ్యాణి పిన్నితోపాటు గుడికి వెళ్ళేది. పదేళ్ళ కళ్యాణి రుక్మిణీకళ్యాణం, గజేంద్రమోక్షం, వేమన శతకం కంఠస్థం చేసి కరణంగారి కోడలు దగ్గర చిలకమర్తివారి నవలలు ఎరువు తెచ్చుకుని కూడబలుక్కుని చదివింది." ఇటువంటి పెంపకంలోనుంచి వచ్చిన కళ్యాణికి లోకం పోకడలు అంతగా తెలియవు. "యుద్ధం ఆపేశారట అని ఊళ్ళో అమ్మలక్కలు కూడి అనుకుంటుంటే విని, పిన్ని చిన్నప్పుడు చెప్పిన రామరావణయుద్ధం అదేనేమోననుకుని ఏదో తెలిసినదానిలా తృప్తిపడింది." అంత అమాయకురాలు కళ్యాణి. వాస్తవంగా నాటి సమకాలీన సాధారణ స్త్రీలకు ప్రతీక కళ్యాణి పాత్ర. తండ్రి అచ్యుతరామయ్య కూతురిని (కళ్యాణిని) చూసి "చదివిస్తాను. ఝాన్సీలక్ష్మీభాయి అంతటిదాన్ని, పోని సరోజినీనాయుడు అంతటిదానిని చేస్తానని" కలలు కంటాడు. సమాజాన్ని శాసించే వీరవనితగా తయారుచేయాలన్న తండ్రి అచ్యుతరామయ్య పెంపకం ఆమెకు కరువవుతుంది. పదకొండేళ్ళకే పెళ్ళిచేయాలనే ఉద్దేశం కలిగిన పినతల్లి పెంపకం అందుతుంది. పినతల్లి పెంపకంలో కళ్యాణి మంచి, మర్యాదలాంటి గవాక్షాలనుంచే ఈ లోకాన్ని చూసింది. పిన్నిని కోల్పోయి ఒక్కసారిగా బయటిప్రపంచంలోకి అడుగుపెడుతుంది. యవ్వనంలో తండ్రిని కోల్పోతుంది. ప్రకాశం, ఇందిరలు తనను మోసం చేసినా వారినుండి తాను దూరంగా వెళ్ళిపోయిందే తప్ప వారినెప్పుడూ ద్వేషించలేదు. సమాజం ఆమెను ఎంతబాధపెట్టినా ఓపికతో సహించింది. అయితే స్త్రీకి సుఖమైన జీవితానికి ఇది మార్గం కాదని తెలుసుకుంటుంది. తన ఒంటరి జీవితానికి ముగింపుపలకాలని నిశ్చయించుకుని లోకాన్ని చిరునవ్వుతో జయించటానికి పూనుకుంటుంది. వసుంధర పిన్నిగారి దెప్పిపొడుపుమాటలు ఆమెలో కొత్త జీవితానికి నాంది పలుకుతాయి. స్త్రీ సమస్యలన్నింటికీ ఆర్థికస్థోమతే ప్రధాన కారణమని తెలుసుకుని ఆర్థికస్వావలంబనకు సిద్ధపడుతుంది. తనను పెళ్లిచేసుకుంటున్న డాక్టరు చక్రవర్తితో "జీవితంలో యేం జరిగినా ఒకటి ఖాయం. తను ఎవరి పోషణకిందో పాడగలగడం అసంభవం. దేనికోసమయినా సరే. అవతల కొండంత అనురాగం తనకు దొరికినా సరే ఆర్థికంగా జన్మలో యింకొకరిమీద ఆధారపడడం తనకిష్టంలేదు. ఆ సంగతే చక్రవర్తికి స్పష్టం చేసింది." సంఘానికి భయపడి తలవంచుకుని భరించే స్థాయి నుంచి సంఘాన్ని ఎదిరించి నిలిచే స్థాయికి చేరుకున్న కళ్యాణి పాత్ర కాలాతీతమైనదనే చెప్పాలి.

నవలలో మరో ప్రధానపాత్ర వసుంధర. అనామకురాలిగా మిగిలిన కళ్యాణిని ఆదరిస్తుంది. ఆశ్రయమిస్తుంది. కుటుంబ పెంపకంలో బయటి ప్రపంచానికి దూరమైనా, కృష్ణమూర్తి ద్వారా ఈ లోకాన్ని చూస్తూ స్వేచ్ఛగా జీవించాలని కోరుకుంటుంది. కృష్ణమూర్తి ఇందిరను పెళ్ళి చేసుకోవాలనుకున్నప్పుడు అతని అభిప్రాయాన్ని సాదరంగా ఆహ్వానిస్తుందే తప్ప స్వార్థంతో ఓర్వలేనితనాన్ని చూపించదు. "నేనంత కుంగిపోవలసినదేమీలేదు. ఇదొక అనుభవం.

# రంగుల కలబోత

- సాంధ్యశ్రీ
8106897404



నా కెందుకో
కాలం తామరాకు మీద
ఋతువుల మంచుబొట్లు కదులుతున్నట్లు
ఎప్పుడూ
ఏదో జీవనగీతిక
ఎద మెదలుతున్నట్లుంటుంది
ఆకాశపు నీలోదకాల్లో
కారుణ్య సంపద తడిసి వస్తున్నట్లుంటుంది
మమతల పందిళ్ళలో
మల్లెలు ఏరుతున్న పరిమళాలు తేలుతున్నట్లుంటుంది
సంధ్యారేఖల మీంచి
స్వర్ణద్రవం పొర్లుతున్నట్లు
ఒక్కక్షణం
ఆరుసార్లుగా హృదయాన్ని ఆత్మీయంగా మీటినట్లు
ఆనందపు అంచుల కోసం వెతుకుతుంటే
ఆకాశంలో కొదిగిన భూమి కనిపించి ఎంత బాగుందని...?
కొమ్మమీద పక్షి కూచుంటే
తోటంతా పాటైపోయింది
రెమ్మమీద పూవు వికసిస్తే
ప్రాంతమంతా పరిమళమైపోయింది...
పొదరిళ్ళు
ఎదలు విప్పుకున్న నెలువులన్నీ
తోటమీదపడి ఆడుకుంటున్న తొందరలైపోయాయి...
కాలం
కనురెప్పలమాటు కనికరంగా
కలల్ని కదిలించినట్లు అనిపించింది...
కాలమే తిరిగి తిరిగి జీవితాన్ని
తీరాల తరంగాల కందిస్తున్నట్లనిపించింది
అయినా నాకెందుకో కాలం తామరాకు మీద
నీటి బిందువుగానే కనిపిస్తోంది...
ఆత్మగీతాన్ని అలరు తావిగా, ఆత్మీయంగా
ఆవిష్కరిస్తున్న శబలనికుంజం – అంతలోనే
అనాదృశమౌతుందేమిటి?
చివురు జొంపాల వెచ్చని కౌగలింత చిందువారెడు కాంతి
మరందలహరి
ఎండిపోయిన హృదయాన ఇంకిపోయిందేమిటి?
చెవిసోకి పరువెత్తే సెలయేరు ఏది?
ఇప్పటిదాకా కాలం మనిషిని ఇంద్రజాలంలో ముంచి
ఇంతలోనే
కలత ఎరుగని లేత ప్రాయపు తవిరుటిడదను తీగవారిన
జలిమి జ్ఞప్తికి వచ్చి కన్నులు చెమ్మగిలిపోయేక
లొంగిన ఆకర్షణలు
దూరంగా జరిగి ఊపిరి ఆలాపనగా సాగిపోతుంటే
ఉనికి పై ఉపరితల ద్రోణి ఏర్పడి
బ్రతుకుపై విసుగెత్తి నెమ్మది చితుకుమంటగ నుండ
స్వప్నము
గతిని జ్ఞప్తికి వచ్చి యేదో కలచె హృదయమ్మున్ ♦

---


మరికొంచం కళ్ళు పెద్దవిచేసి లోకాన్ని చూడాలి. ముందుకుసాగాలి" అనే గొప్ప అభిప్రాయాన్ని వసుంధరచేత చెప్పించింది రచయిత్రి. లోకంలోని స్త్రీ పురుషులంతా ఇలా ఆలోచిస్తే ప్రేయసీ ప్రియులలో అనవసర మనస్పర్ధలు, ఈర్ష్యాద్వేషాలు కలగవు. జీవితం ఆనందంగా సాగిపోతుందనేది రచయిత్రి అభిప్రాయం. నవలలో ఇందిర, కళ్యాణీలతో పాటు వసుంధరకూడా కాలాతీతవ్యక్తే. ఈ ముగ్గురూ చైతన్యంతో కదిలాడే స్త్రీమూర్తులే.

చైతన్యవంతులైన వ్యక్తులు సాధారణ మనుషుల్లాగా సమస్యల వలయంలో చిక్కుకొనిపోకుండా తమతోపాటు తనను నమ్ముకున్న వాళ్ళకూ సంతోషాలను పంచిపెడతారు. చిన్నవయసులోనే జీవితాన్ని అర్ధంచేసుకుని లోకాన్ని జయించి అనుకున్న జీవితాన్ని అందుకోగలిగిన ఇందిర చైతన్యమూర్తే. ఎటువంటి కుటుంబంలోనుంచి వచ్చినా జీవితమే అనుభవాలను నేర్పుతుంది, ఆ అనుభవాల ద్వారా తాను సాధించవలసినదాన్ని చిరునవ్వుతో సాధించిన కళ్యాణి చైతన్యమూర్తే. ప్రేమించిన వ్యక్తి దూరమైనా లోకాన్ని మునుపటిలాగే చూస్తూ మరో కొత్త జీవితానికి నాంది పలకాలనుకున్న వసుంధర చైతన్యమూర్తే. ఈ ముగ్గురిని డాక్టరు పి. శ్రీదేవిత స్త్రీల జీవితాలలో చైతన్యవంతమైన భావజాలాలను కొత్త కోణంలో ఆవిష్కరించటానికి సృష్టించిన చైతన్యమూర్తులుగానే చెప్పుకోవాలి. ♦

**కవిత**

# ఒక జ్వలనం గురించి

- బి. గోవర్ధనరావు
9441968930



నాకు
పగలేమిటి... రాత్రేమిటి..!
తూర్పు తెరతీయటం
పడమర ముసుగెయ్యటమేమిటి!?
ఇంకా అవగతంకాని... నా స్వగతం కోసం
ఈ అనంత విశ్వసృష్టి విన్యాసాల కోసం
ఈ భ్రమణ, పరిభ్రమణల.. నిజాల కోసం
నిత్యం వీక్షిస్తూ... నిరీక్షిస్తూ...
క్షణం... క్షణం... ప్రతిక్షణం కలవరిస్తూ...
పరితపిస్తుంటే...యోచిస్తుంటే...!
రోజంతా ... దారి పొడుగునా
జ్వలనమే... నా నైజం
ఊరికే... ఉషస్సులు మధ్యన
కదిలే.. సాయం సంధ్యల ఒడ్డున
యుగాల నుండి... కొత్త జగాల వరకూ...
నా అంతరంగ రంగస్థల
ఉచ్ఛ్వాస.. నిచ్ఛ్వాసలను.. పదిలపరుచుకుంటూ
ఉద్వేగాలను.. ఉద్రేకాలనూ.. వొదిలించుకుంటూనే..
కాలగమన.. గుండెలయలు వింటూనే...
నాకు... నేనే, ఓ 'ఫజిల్'.. అవుతాను
చిరుగాలి స్పర్శకు.. కదిలే.. అగ్నిపూల అలనౌతాను!!
ఎపుడు చూసినా.. ఎటువైపు తిరిగినా
ఏ దారిన సాగినా... ఎటువైపు మళ్ళినా
నా జనన, మరణ చక్రాలు.. ఆరనిమంటలు...
తీరని ఆశలు!!
మరి నేను ఆరిపోయేదెలా!?
అఖండ జలరాశుల్ని
నాపై కుమ్మరించుకుని
నేను,. నేనుగా... ఉపసంహరించుకుని
నన్ను...నేను..ఒక్కసారి చూసుకోవాలనుంది!
అలా...జరగబోతున్నదనీ...తెలిసినపుడు..!!
లెక్కలేనన్ని చూపుల బింబాలు
నా...నిజరూపాన్ని చూసేందుకు
నిరీక్షిస్తూ...ఎదురుచూస్తుంటాయి!
ఏదో...జరగబోతున్నదనీ ఉత్కంఠల
జడివానల్లో..కూర్చొంటాయి!!
నా గురించి..నేనే ఆలోచిస్తూ
అంతర్మథనాల్ని... తర్కిస్తున్నపుడు
అలౌకితత్వాన్ని...దర్శిస్తున్నపుడు
నన్ను...నేను..తెలుసుకోవాలనే...ఆరాటం
నాలోని...నన్ను...కలుసుకునే...అవకాశం
ఇక...రానట్లేననిపించింది!
ఇక...లేనట్లేననితెలిసింది!!
ఈ భౌతిక ప్రపంచం నుండి
నా ఒంటికి పట్టించుకున్న
అహాల్ని..త్యజించాలనేదే... నా తపన
పనికిరాని అంతరాలను
అంతమొందించాలనేదే... నా ఆలోచన–
నేను...నేనుగా
ఆరిపోయిన... ఆగిపోయిన
బ్రహ్మాండమైన చీకటినై.. శూన్యమై మిగిలిపోతే..!
ఈ విశ్వం..జాడల్ని...నీడల్ని విప్పలేను...
చివరకు దేన్ని...దర్శించలేను... ఆవిష్కరించలేను!!
ఓ మానవుడా!
నా చిన్ని ప్రేమికుడా!!
ప్రతీ..సమస్యకూ..
ఓ పరిష్కారమున్నంత వరకూ..
నా నిలకడే నీకు బలమనుకుంటా!
నిరంతర...జ్వలనకు
నాకు ముద్దనుకుంటా!
భవిష్యత్తును చూసే ఆరని దీపమనుకుంటా!
చిరకాల...ప్రయోజనమనుకుంటా!

♦

విశ్లేషణ



# చైతన్య పతాకాలు ఇనాక్ నాటకాలు

- ఝాన్సీ.కె.వి.కుమారి
9010823014

2012లో ఇనాక్‌గారు ప్రచురించిన నాటక సంపుటిలో 'ఓట్లాట', 'నీడ', 'ఇదుగో యేసుక్రీస్తు!' అనే మూడు నాటకాలున్నాయి. ముందుగా 'ఓట్లాట' ప్రాంగణంలోకి అడుగుపెడదాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే పాలకులు, పాలితులు ఎంత జాగరూకతతో ఉండాలో సిఎమ్ పాత్ర ద్వారానే హెచ్చరికలు చేయించడం రచయిత నాటకీయ నైపుణ్యం!

"అందరూ అన్ని పనులూ చేస్కోరు. మీరు పనులకు, కులాలకు లంకె పెట్టారు. చేయవలసిన పనులు నిండవలసిన కడుపులు ఎప్పుడూ హాజరు. దేశానికి పల్లెలే వెన్నెముకలా? అవి విరుగుతున్నాయి. నడుం విరిగిన పల్లె హాస్పిటల్ బెడ్డెక్కింది."

"శ్రమించని జాతులు అంతరించాయి. భోగలాలసులు చరిత్ర జ్ఞాపకాలలో శిధిల అవశేషాలే! మీరు శ్రమజీవులైతే మేం మీ సేవకులం, మీరు సోమరులైతే మేం యజమానులం తెల్సుకోండి మీరు." (పేజి105) చరిత్ర నేర్పిన పాఠాలను మనమింకా నేర్చుకోలేదే... వేదన చెందుతున్న రచయితలోని చరిత్రకారుణ్ణి మనం దర్శించగలం.

'ఓట్లాట' నాటకంలో 11 దృశ్యాల వరకు అందరికి పంపకాలు యధేచ్ఛగా సాగుతాయి. 12వ దృశ్యం ఓ ఝలక్! 11వ దృశ్యంలో మిత్రులుగా ప్రేమ పంచిన ఓఎస్‌డి, మినిస్టర్లందరూ 12లో సియమ్ మీద కుట్ర చేయడంతో రాజుల అంతఃపురాల్లో కుట్రలు మన కళ్ళ ముందు కదలాడతాయి. అక్కడినుండి క్లైమాక్స్‌కి వేగం పెరిగిపోతుంది.

చివరి దృశ్యం ప్రతిపాఠకుడు చదివి తీరాలి. ప్రజాస్వామ్యంలో, ఓట్లాట పర్వంలో ఎంతెంత అవినీతి, ఎవరెవరు ఎలా చేస్తున్నారో, చివరికి ప్రజలు సైతం ఈ అవినీతి మహాపర్వంలో తమ వంతు పాత్ర ఎలా పోషిస్తున్నారో కళ్ళకు కట్టిన మాటలతో సిఎమ్ పాత్రను గంభీరంగా మలిచిన రచయితకు జేజేలు ఎన్ని కొట్టినా తక్కువే అనిపిస్తుంది.

'ఓట్లాట' నాటకంలో 25 పాత్రలు 18 దృశ్యాలున్నాయి. ఈ నాటకం ఆంగ్లాంధ్రాలలో సమాంతర సృష్టి' అని రచయిత రాశారు. నాయకుడు సి.ఎమ్. పరిశ్రమలు, ఆర్థికశాఖ వంటి నాలుగుశాఖల మంత్రులు, పార్టీ అధ్యక్షుడు, అపోజిషన్ నాయకుడు మీడియాకింగ్ మొదలైన పాత్రల్లో ఒకే ఒక్క స్త్రీ పాత్ర సిఎమ్ బాడీగార్డ్. అమె ఒక ఐపిఎస్ ఆఫీసర్. రంగస్థల ప్రదర్శన పరిమితుల్లో ముఖ్యమైనది స్త్రీ పాత్రల అంశం గనుక రచయిత ఆ కోణంలో ఎక్కువ స్త్రీ పాత్రలను చూపించి ఉండరు.

ఈరోజు మన ముందు జరుగుతున్న 'నాలుగు స్థంభాలాట'– రాజకీయం, న్యాయవ్యవస్థ, పాలనావ్యవస్థ, పత్రికారంగం లేక మీడియా– ఆరాట పోరాటాల్లో ప్రజలస్థానమేమిటి అన్నదే రేకెత్తించాల్సిన ఆలోచన! ప్రారంభంలో సూత్రధారుడు కొన్ని ప్రశ్నలు ఎక్కుపెడతాడు!

ఈ 'ఓట్లాట' నాటకాన్ని ఊరూర ప్రదర్శించగలిగే దర్శకులు, ట్రూపులు త్వరగా ప్రజలను పాలకులను

చైతన్యవంతం చేసి ఆ పనిని చేపడితే ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో తమ బాధ్యతను నెరవేర్చుతారు. రచయిత ఆశయాన్ని నెరవేర్చడంలో విజయాన్ని సాధించగలుగుతారు!

**ఈ నాటక సంకలనంలోని 2వ నాటకం "నీడ"**

ఈ దేశవ్యవస్థ గుండెలో అడుగడుగునా పేలుతూ మన మనస్సులను చీల్చి చెండాడే సత్యతూటాల వాహిక ఈ 'నీడ' నాటిక! భారతదేశంలోని 'నిచ్చెనమెట్ల కులసమాజానికి సంకేతం. ఇందులోని చెట్టు. ఆ చెట్టుమీద కూర్చున్న చాతుర్వర్ణం అనే వివక్షాపూరిత వర్ణవ్యవస్థలోని నాలుగు కులాల ప్రతినిధులు! బ్రాహ్మణ, (దేవర), క్షత్రియ మారాజు వైశ్య, స్వామి, శూద్ర దొర అనే పేర్లతో చెట్టుమీద, ఒకరి కాళ్ళ కింద ఒకళ్ళు వేర్వేరు స్థానాల్లో కుర్చీల్లో ఉంటారు. చెట్టునీడలో అయిదవవాడు, పైన స్థిరంగా కూర్చున్న నలుగురూ యిచ్చిన 'మొద్దు', 'దున్నపోతు', 'గాడిద' అనే ప్రాణం లేని చెక్క, ప్రాణం కలిగిన జంతువుల పేర్లతో చెట్టును భద్రంగా కాపలా కాస్తుంటాడు. వాడి పరిస్థితి ఒకటో వాడుచెప్పినట్టు – "ఎవరేది చెప్తే అది చేయాలి, తల ఎత్తమంటే ఎత్తాలి, దించమంటే దించాలి. నోరెత్తమంటే ఎత్తాలి. ముయ్యమంటే ముయ్యాలి. మానీడ నీకు రక్షణ; సుఖం, శాంతి'' (పేజి.నెం.11) అయితే వినగలిగే చెవ్వుల్లో సీసం పోసిన కాలాన్ని, ప్రశ్నించే నాలుకలను ఉత్తరించిన కాలాన్ని దాటి వచ్చిన 5వవాడిలో నీడను గురించిన చైతన్యం కలిగింది. గనుకనే

"చెట్టు నీడంటే మీ మోసం దోపిడి, మాయ." నీడ లేకుంటే పుణ్యం, చెట్టేలేకుంటే స్వర్గం. (పేజి.12) నాకు" మీ నీడా వద్దు. మీ పీడా వద్దు. ఈ అయిదో వ్యక్తి ఈ మాట అనే రోజుకోసం ఈ దేశం ఎదురుచూస్తోంది. అణిచివేయబడ్డ జాతుల్లో ఈ ఎరుక కలిగితే అది పెద్ద చైతన్యం, స్వేచ్ఛకు రాజమార్గం కాని 5వవాడి సహనమే. వేల వత్సరాలు వాడిని బానిసగా ఉంచింది. ఈ భరతనేలకు స్వంత దారుడై – కూడు, గూడు గుడ్డ కోసం ఎక్కడినుండో ఇక్కడికి పొట్ట చేతపట్టి వచ్చిన వాళ్ళను ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నాడు. వాడి ప్రేమ, వినయం, మానసిక ధైర్యం, శారీరక బలం అర్థం చేసుకున్న విదేశీయులు ఈ నేలపై తమ స్థానాన్ని, సుస్థిరం చేసుకొనేందుకు వాడ్ని 'మతం', 'దేవుడు' పేరుతో బానిసను చేయడమే గాక, ఆ బానిసత్వాన్ని సుస్థిరంగా కొనసాగించడం కోసం సమాజాన్ని విభజించి, అసమానతతలను సృష్టించి అనైక్యత పునాదులను పటిష్టంగా వేయడంతో 5వవాడు జీవితాంతం జీతంలేని పనివాడుగా, జీవమున్న శవంగా వేల సంవత్సరాలు మిగిలిపోయాడు!

5వవాడి బానిస చరిత్రను, చైతన్య ప్రస్థానాన్ని రచయిత ప్రణాళికాబద్ధంగా కళ్ళకు కట్టారు.

మొదటి 6దృశ్యాల్లో చెట్టుపైనున్న 4గురి మధ్య ఉండే తారతమ్యాలు, రాజకీయాలు, స్వార్థాలు, 5వవాడిని అణచివేయడంలో మాత్రం ఏకమయ్యే ఐక్యతారాగాలు స్పష్టంగా చూపబడ్డాయి. 7వదృశ్యంలో సృష్టికర్త ప్రత్యక్షమై అంతవరకూ జరిగిన చరిత్రను 5వ వాడికి వివరించినప్పుడు 'దేవుడా, నాకు తెలివినివ్వు, తమ్ముళ్ళతో కలిసి శాంతంగా జీవించే తోవ చూపు" అంటాడు. 8వదృశ్యంలో బౌద్ధభిక్షువు హింసకు దూరంగా ఉండమని, 9వ దృశ్యంలో ముస్లిం ఫకీరు తెలివిగా బ్రతకమని 5వవాడికి సలహా ఇస్తారు. 11వ దృశ్యంలో క్రైస్తవ మిషనరీ 5వవాడిని గుండెకు హత్తుకొని, గాయపడిన వాడి దేహానికి మందులిచ్చి బలహీనమైన శరీరాత్మకు రొట్టె, పాలు గుడ్డు తిన్పించి, పలకాబలపా యిచ్చి 'రాత నేర్చుకో! నీ బ్రతుకు మార్చుకో' అని క్రీస్తుయేసు ప్రేమను రుచి చూపిస్తారు. ఇంత ప్రేమను, వెలుగును ఇంతవరకు చూడలేదు అని కరిగిపోయిన 5వవాడు ఆయన వెళ్ళిన తర్వాత మాట్లాడిన మాటల్లో వచ్చిన మార్పు, ధైర్యం, తెగువ చెట్టుపై వాళ్ళను ఆలోచనలో పడేసింది. అంతేకాక "ఈ ముంతను భూదేవికి దానం చేస్తా" అని మూతికి కట్టిన ముంత విప్పి నేలకేసి కొడ్తాడు. "ఈ చీపురుతో మనల్ని చీల్చిన చిల్లకంపకు చితిపెడతా" అని దాన్ని దూరంగా విసిరి పారేస్తాడు,

"ఇవ్వాళ్టి నుండి నేను ఊడవను. మీరు ఊడ్చిన నేలమీద నేను నడుస్తా, ఉమ్మి వేస్తా, నా ఇష్టం" అని తనలో ఇంతవరకు గూడుకట్టిన అజ్ఞానాంధకారాన్ని ఖాండ్రించి ఉమ్మి వేస్తాడు.

"తపస్సు... పలకా బలపంతో తపస్సు...రాత్రిపగలు అదే తపస్సు..." 5వవాడి ఈ మాట విన్న చెట్టుపైనున్న వాళ్ళ బుర్రలు తిరిగిపోయాయి.

"నీకు చెట్టు బహిష్కారం విధించింది. నీకు నీడలేదు" అన్న ఒకటో వాడి మాటలకు 5వవాడి సమాధానం: "ఈ నీడను ఎడంకాలితో తన్ని వెళ్ళే అవకాశం నాకుంది. కాదనే హక్కు మీకు లేదు" చెట్టుపై వాళ్ళ దిమ్మ తిరిగిపోయింది.

12వ దృశ్యంలో గాంధీ రాజకీయ సన్యాసిగా ప్రవేశిస్తాడు.

అసమానతలన్నీ నిర్మూలిస్తేనే స్వాతంత్ర్యం' అన్న బ్రిటిష్‌వారి కండిషన్‌కు గాంధీ 5వవాడి అభ్యంతరాలన్నీ పక్కనబెట్టి బలవంతంగా ఒప్పించి ఈ 5గురి చేత "మేమంతా ఒక్కటే జాతి, అన్నదమ్ములా కలసి ఉంటాం" అని వాగ్దానం చేయించి స్వాతంత్ర్యాన్ని ప్రకటింపజేస్తాడు. చేసిన వాగ్దానాన్ని స్వాతంత్ర్యానంతరం ముగ్గురూ కొట్టి పారేస్తారు కాని 4వవాడు నిజాన్ని ఒప్పుకుంటాడు.

"పిచ్చిమాటలొద్దు. ఇచ్చినమాట ప్రకారం అందరం కలిసుండాలి. మీరు పొరుగూరోళ్ళు మేం ఉన్న ఊరోళ్ళం. పెద్దోడు మనిషే! వాడికి యిక నేను పని చెప్పను. నేను చెప్పినా, పెద్దోడు పనిచేయడు. మా పనులేవి చేయొద్దురా పెద్దోడా, అన్నగా అన్నీ సహించావు. ప్రేమను చూపావు... తమ్ముడిగా నేను నిన్ను గౌరవించడం నేర్చుకుంటా" ఇక్కడ రచయిత చరిత్రలోని సత్యాన్ని వెలిగించారు! పొట్టకూటి కోసమో, పొరుగు రాజ్యాలకోసమో ఈ దేశానికొచ్చిన విదేశీయులు – స్వదేశీయులను విడదీస్తేగాని, వాళ్ళను అణిచివేస్తేగాని తమకు బానిసలుగా చేసుకోవడం సాధ్యం కాదని కులమనే అసమానతలను కల్పించారు. కార్మిక కర్షక వృత్తుల కోసం నాల్గవవాడిని తమతో కలుపుకొన్నట్టు తమ వాడే నన్నట్టు నటించి, మురికంతా కడిగే అశుద్ధ పనుల కోసం 5వవాడ్ని సమాజం మొత్తం నుండి వెలివేశారు. మూలవాసులు విడగొట్టబడి, విరోధులైన సన్నివేశాన్ని 12వ దృశ్యంలో నాల్గవవాడు విప్పిచెప్పడం ఒక చారిత్రక ఘట్టం!

4వవాడు, 5వవాడు ఒకటైతే మిగిలిన మూడింటికి ఓ ప్రత్యేక అస్తిత్వం ఉండదు. అందరూ కలిసి 'భరతజాతి' అవుతారు. 1992 డిశంబరు 6వతేదీన – రాజ్యాంగపిత డా॥బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి నాడే బాబ్రీమసీదును కూల్చి వేసిన ఘట్టాన్ని చూచినప్పుడు నా గుండెలో నుండి పెల్లుబికిన విషాదంలో వెలువడిన గేయం.

***"ఏడురంగులు ఏకమయ్యి/ శ్వేతవర్ణ ముదయించినట్టు/ జాతులన్నీ కలిసిపోయి/ భరతజాతి అవతరించె"–*** పల్లవి

నాలుగు చరణాల ఈ బృందగానం ఆ తర్వాత నుండి ఆకాశవాణిలో ప్రసారమవుతూనే ఉంది.

ఈ సత్యాన్ని మరుగుపరిచే ప్రయత్నాలే కులాల పైశాచికాలు, మతాల మారణ హోమాలు!

**మూడో నాటకం 'ఇడుగో యేసుక్రీస్తు!'**

ఆచార్య ఇనాక్ నాటక సంపుటిలో మూడో నాటకం 'ఇడుగో యేసుక్రీస్తు!' దేనికోసమైనా, ఎవరికోసమైనా, ఎవరైనా వెతుకుతుంటే ఆ వ్యక్తో, ఆ వస్తువో దొరికినప్పుడు 'ఇదిగో ఫలానా!' అని ఎలుగెత్తి చాటుతాం. ఆచార్య ఇనాక్ అలాగే ఎలుగెత్తారు తన అన్వేషణ అనంతరం. మొదటి నాటకం 'ఓట్లాట'లోని అవినీతికి, అక్రమాలకు, అధర్మానికి, అన్యాయాలకు పరిష్కారమే 'ఇడుగో యేసుక్రీస్తు!' అన్నట్టు 20వ దృశ్యంలో ఫాదిరి పాత్ర చేత ఈ మాటలు పలికించారు:

"కుయుక్తులతో గర్వపడేవాళ్ళను పునాది వేళ్ళతో పెకలించివేస్తాడు. మనల్ని హింసించే పరిపాలకుల్ని, దుర్మార్గుల్ని పతనమొందిస్తాడు. వాళ్ళ అగ్రాసనాలను దగ్ధం చేస్తాడు"

అలాగే 'నీడ' నాటకంలోని అసమానతలను పెంచి పోషించిన దుష్టసమాజ నిర్మూలన జరిగి సమానత్వం సాధించాలంటే యేసుక్రీస్తు చాటిన ప్రేమ అత్యవసరం అని, పొరుగువారిని ప్రేమించమన్న సందేశంతో ఈ దేశానికి వచ్చిన మిషనరీలు 'అంటరాని వాళ్ళు' అనే ముద్రతో అణచివేయబడిన వారికి అందించిన సేవలను ఈ పద్యంలో వివరించారు. (పే.88)

***"గొంతులోనుంచి లాక్కున్నట్టి ఓనమాల/ నిసుకలో వెదికించి యిచ్చుగురువు/ అన్నదమ్ములనంట నట్టిట్టు గుంజాడ/ నల్లతోలును తాకు తెల్లవారు..../..../క్రీస్తుమతము వచ్చి కీడు గోడలు కూల్చి/ రక్షణమ్మునిచ్చి రాజ్యమేలే!/ ఊరిబయటివాడు ఊరిలోపలివాడు/ చేయి చేయి పట్టు స్నేహమిచ్చె"*** 'క్రీస్తుమతము అంటే క్రీస్తు అభిమతం' అని వివరించారు అదే పేజీలో.

ఈ నాటకంలోనూ ఓ ప్రయోగం చేశారు రచయిత. గ్రీకు నాటకాలలో వలే మూడు రంగస్థలాలను ప్రవేశపెట్టారు. అటు పరలోకంలోనూ, ఇటు భూలోకంలోనూ నాడు అంటే వేల ఏళ్ళ కిందట జరిగిన సంఘటనలను 2,3 రంగస్థలాలమీద, నేడు అంటే వర్తమానంలో– క్రీస్తు ప్రేమను సంఘంలో ఎలా చూపాలి అన్న అంశాన్ని మొదటి రంగస్థలం మీద ఆవిష్కరించారు. నాటిపాత్రలు పద్నాలుగు కాగా నేటి పాత్రలు ఐదు. మొత్తం దృశ్యాలు ఇరువై ఒకటి. చివరలో ఆకాశవాణి నేటి రంగస్థలంలో మాట్లాడుతుంది. ఫాదిరి మాటల్లోనూ, ఆకాశవాణి ప్రకటనలోనూ మనిషికి అవసరమైన ఎన్నో సత్యాలను మొదటిరంగస్థలం మీద రచయిత వివరంగా చర్చించారు.

నాటకం మొదటి దృశ్యం జ్యోతి అ నే యువతి క్రిస్మస్ పర్వదినాన తల్లిదండ్రులతో కలిసి, దేవాలయానికి రావడంతో ప్రారంభమవుతుంది. దాసు అనే పదేళ్ళ బాలుడు 'ధర్మం చేయక్కా' అంటూ ఆమె వెంటపడతాడు. చిరిగినబట్టలు, చింపిరిజుట్టు, కారే ముక్కుతో దయనీయంగా ఉన్న వాడి ముక్కును తన కొత్త చున్నీతో తుడిచి, ఇక నుండి వాడు అడుక్కోనక్కరలేదని, తన ఇంట్లో తమ్ముడుగా ఉంటాడని చెప్తుంది జ్యోతి:

"జ్యోతి: (పేజి :18) ... అడుక్కోడానికి చర్చికి వచ్చిన నువ్వు ఇక ధర్మం చేయడానికి వస్తావు. కాళ్ళకు చెప్పుల్లేని నువ్వు షూస్‌తో కారెక్కి వస్తావు. అమ్మానాన్నా లేని నువ్వు అమ్మానాన్నలతో హాయిగా ఉంటావు... ఏమీలేని నీకు భగవంతుడు అన్నీ ఇస్తాడు" క్రీస్తు ప్రభువు ప్రేమతో మనదేశానికి వచ్చిన మిషనరీలు – ఇక్కడ కులం పేరుతో అణగగొట్టబడ్డ వాళ్ళను ఎలా ఆదరించి, మనుషులుగా గౌరవించారో, రచయిత మొదటి రంగస్థలం మీద చూపించారు.

*"క్రీస్తు జననం అద్భుత సందర్భం!*

*ఆశ్చర్యకర సన్నివేశం, ఆనందకర ఘటనం!*

*అందుకే నాటకీయతను పుష్టిగా, తుష్టిగా సంతరించుకొంది"*

ఇంకా, *"ప్రజాస్వామ్యం వ్యక్తుల సంఘటన కావడం వాంఛనీయం.*

*అందుకు మతాలు అవరోధకం కారాదు. మనది మతాతీత లౌకిక రాజ్యం అన్న రాజ్యాంగ ప్రకటన కాగితాల్లోనూ మాటల్లోనే ఉంది, ఇది అక్షరాలా నిజం కావాలి..."*

ఇదే ఆకాంక్ష నేడు దేశమంతటా ప్రతిధ్వనిస్తున్నది ఎందరో రచయితల, ఉద్యమకారుల, దేశప్రేమికుల, నాయకుల గళాల్లో, కలాల్లో! నేడు మతం పేరుతో, జాతీయవాదం పేరుతో, పౌరహక్కుల పేరుతో రాజ్యాంగానికి వ్యతిరేకంగా చెలరేగుతున్న హింస దేశాన్ని మరోసారి ముక్కలు చేస్తుందా? అనే భయాన్ని కలిగిస్తున్నది.

రచయిత ఉన్నత శ్రేణి ఆచార్యులు. ఏది చెప్పినా, రాసినా, వెచ్చించిన ఆ కాలం అందరికీ క్షేమాన్నివ్వాలన్న ఆకాంక్షే ఆయనను అక్షరాలతో కాపురం చేయిస్తుంది. నాటకం చివరిలో 'ఆకాశవాణి' పలికే మాటలు ప్రతిఒక్కరు – నాయకత్వంలోని వాళ్ళు, అధికారులైనవాళ్ళు – సీరియస్‌గా ఆలోచించి ఆచరణ దీక్షాపరులు కావాలనే అవసరాన్ని నొక్కి చెప్తాయి:

"నిన్ను వలే నీ పొరుగువారిని ప్రేమించు అన్న యేసుక్రీస్తు ప్రేమసందేశం ప్రపంచం శాంతిమార్గం వెతుక్కునేలా చేసింది. క్షమించమంది. సహించమంది. నిన్ను నువ్వు తగ్గించుకొమ్మంది. అక్కరలోని వారిని ఆదుకొమ్మంది. అందరూ సమానమే అంది. అప్పటివరకూ ఉన్న దోపిడీ వ్యవస్థకు ముగింపు పలికి మనిషే కేంద్రంగా ప్రభుత్వాలు, చట్టాలు ఏర్పడేలా చేసింది."

మతం, కులం మన గుండెల్ని నింపిన గుడ్డితనం తొలగించుకున్నప్పుడే ఈ మూడునాటకాల గొప్పతనం మనం అర్థం చేసుకోగలం. రచయిత ఆకాంక్ష నెరవేరుతుంది. ఈ నాటకాలు మహాఉద్యమంలా దేశమంతా ఆయా భాషల్లో ప్రదర్శింపబడి భారతీయులను తీర్చిదిద్దాలి. ప్రజల, పాలకుల ఆలోచనల్లో విప్లవాత్మకమైన మార్పులు తేవాలి. 'ఇదుగో యేసుక్రీస్తు!' నాటకం అచ్చులోకి రాకముందే 2011 డిసెంబరు 25వతేదీ క్రిస్మస్ పర్వదినం నాటి మధ్యాహ్నం 3గంటలనుండి 4గంటలవరకు ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ప్రసారం చేయగా రాష్ట్రంలోని మిగిలిన ఆకాశవాణి కేంద్రాలన్నీ రిలే చేశాయి. నాడు ఆ నాటకానికి దర్శక నిర్వహణ బాధ్యతలు నా అధికారులు నాకు అప్పగించడం, ప్రముఖ నటులు శ్రీచాట్ల శ్రీరాములు యెహోవా దేవుని పాత్రను, శ్రీప్రసాదరెడ్డి గబ్రియేలు దేవదూత పాత్రను పోషించడం, ఇంకా ఎందరో పేరెన్నిక గన్న నటీనటులతో మూడు రోజుల పాటు రిహార్సల్సు, రికార్డింగు ఆ తర్వాత ఎడిటింగు, మిక్సింగు వంటి సాంకేతిక కార్యక్రమాలు పూర్తిచేసి ప్రసారానంతరం శ్రోతల నుండి, అధికారులు, కొలీగ్సు నుండి స్పందన అందుకోవడం, వీటన్నింటిని మించి రచయిత తన సంతృప్తిని వ్యక్తం చేయడం ఓ మధురజ్ఞాపకం.

ఈ నాటక సంపుటి పేజీలు 112, వెల: 210రూ.లు. ప్రతులు దొరుకుచోటు : విశాలాంధ్ర ప్రచురణాలయం, ఆబిడ్స్, హైదరాబాద్. ఈదేశంలోని వ్యక్తులు మతం, కులం సరిహద్దుల్లోనే కుంచించుకుని తమ ఎదుగుదలను, దేశ ప్రగతిని కోల్పోయిన గతం, కోల్పోతున్న వర్తమానంలో – రాజకీయ, సామాజిక, సౌభ్రాతృత్వ విలువలతో రూపొందించిన గొప్ప ఔషధ రాజం 'ఓట్లాట', 'నీడ', 'ఇదుగో యేసుక్రీస్తు!' నాటక సంకలనం. ♦

## అడవి ఒక పచ్చని పట్టువస్త్రం

- ఏ.వి.ఆర్.మూర్తి
9652488342

అడవి ఎవరూ
నేయని పచ్చని పట్టువస్త్రం
అడవి ఒక తీపిగుర్తు
ఒక నందనవనం
ఒక బృందావనం
ఒక ఔషధాలయం
పర్యావరణాన్ని కాపాడే
ఒక కవచం
అడవిని నరకడమంటే
మన కాళ్ళను మనం నరుక్కోవడం
పశువులను పక్షులను నిర్లక్ష్యం చేయడం
ధ్వంసం చేయడమంటే
వధించుకోవడం
దళారుల చేతుల్లోపడి అడవులు
పరిమళాలు కోల్పోతున్నాయి
కాలుష్యకోరల్లో చిక్కుకొని



పర్యావరణం
గిలగిలలాడుతోంది
శుభ్రత అనుకుంటూ
గిరిపుత్రులను గిరిలో
లేకుండా చేస్తున్నారు
మనిషి కృంగి కృషించినట్లే
భూమి కూడా కృంగిపోతోంది
అభివృద్ధి పేరిట
మన అడవులు కొన్ని
వెనక్కి జరిగిపోతున్నాయి
అడవులు
కుంచించుకుపోతున్నాయి

గిరిజనులు బలవంతంగా
బయటకు నెట్టబడుతున్నారు
రియాల్టర్ల వలన
కొన్ని అడవులు
అదృశ్యమైపోతున్నాయి
నరుకుతున్న చెట్లవల్ల
జీవరాశులు దిక్కులేని
పక్షుల్లా అయ్యాయి
చెట్లను నరికితే
గిరిజనుల తేనె బ్రతుకు
చేదు బ్రతుకవుతుంది. ♦

---

## ఈ గాయాలకు ఏ పేరు పెడదాం?

- మామిడిశెట్టి శ్రీనివాసరావు
7386030717

గుప్పెడు శూన్యాన్ని పోగేసి
చిటికెడు రక్తమాంసాలు అద్ది
పిడికెడు ప్రాణమున్న ముద్దగా మలిచావు
నీ కళ్ళతో ప్రపంచాన్ని చూపించి
నీ కాళ్ళతో నడకలు నేర్పించి
నీ పొత్తిళ్ళను పట్టు పరుపుల మెత్తను చేసావు
నీ చిన్నారి కీర్తిని కీర్తి శిఖరాలపై నిలబెట్టాలని
ఎన్ని నిద్రలేని రాత్రిళ్ళు గడిపావో?
ఎన్ని కడగండ్ల బాటలు నడిచావో?
ఎన్ని కన్నీటి సంద్రాల్ని ఈదావో?
ఆకలిగొన్న ఏ గ్రద్ద నీడ నీ కోడిపిల్లపై
పడకూడదని తల్లికోడిలా ఎంతగా తల్లడిల్లావో?
కానీ నీ పేగుబంధమే నీ ప్రేమగంధాన్ని
తుడిచేస్తుందని తలంచగలిగావా?
నీ ప్రాణవృక్షం నుంచి పెరిగిన కొమ్మే
నిన్ను ప్రాణంలేని బొమ్మను చేస్తుందని ఊహించగలిగావా?



కామం కంపు కొడుతున్న ఆ కుర్ర దేహానికి నీ నిర్జీవ
కాయం కంపు కనువిప్పు కలిగించలేకపోయింది.
పాడుబడ్డ బావిలాంటి బాట తప్పిన ఆ బంధానికి
నీ మాటల మాధుర్యం మమతల మార్గాన్ని
చూపించలేకపోయింది
వృద్ధాశ్రమాలు, ఫుట్‌పాత్‌లు, శ్మశానాల్లో
తల్లిదండ్రుల్ని అనాధలుగా వదిలేస్తున్న ఆధునిక
పుత్రరత్నాల్ని చూసి గుండెలు బాదుకుంటున్న మాకు
గుండె ఆగిపోయింది ఒక్కసారిగా నీ హత్యోదంతాన్ని చూసి
నశించిన విలువల శిలువలపై వ్రేలాడుతున్న
ఈ సంసారాలకి సంస్కారం నేర్పే చదువుల సుగంధాలేవి?
వర్తమాన సంస్కృతి ప్రసవిస్తున్న
ఈ గాయాలకు ఏ పేరు పెడదాం?

***(19.10.2019 న రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో కన్నతల్లి రజితను బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి చంపిన కూతురు గురించి చదివి...)***

♦



# కొత్త సంవత్సరం మొదటి రోజు!

కన్నడం: **అదీబ్ అఖ్తర్**
అనుసృజన: **వేలూరి కృష్ణమూర్తి**
**94489 77877**

'కొత్త సంవత్సరం మొదటి రోజు మంచి బాడుగ లభించనీ, సంవత్సరం పూర్తి మంచిది జరుగనీ' అని మనసులో దేవుడిని తలుచుకొని యింటిముందు నిలిచిన ఆటో ఎక్కాడు రవి. ఆటో స్టార్ట్ చేస్తూ వాకలి వద్ద నిలబడ్డ భార్య, అలాగే బిడ్డవైపు చూసి ఒక నవ్వు నవ్వాడు. మైసూరు–బన్నూరు దారిలోవున్న విద్యావికాస్ విద్యా సంస్థ వెనుకవైపు అతడి యిల్లు. తెల్లవారి టిఫిన్ ముగించి బయలుదేరితే, సమయం చిక్కితే మధ్యాహ్నం భోజనానికి యింటికి వచ్చేవాడు. దూరంగా ఏదైనా బాడుగ లభిస్తే దారిలో లభించే హోటల్ లోనే మధ్యాహ్నం భోజనం చేసేవాడు. కాని, రాత్రి మాత్రం ఎనిమిది గంటలకు యిల్లు చేరేవాడు. అతనికిపుడు దగ్గిర దగ్గిర నలభై ఏళ్ళు. అంతేమీ చదివినవాడు కాదు. కూలిపని చేసుకొనేవాడు. ఇపుడొక ఆరేళ్ళనుండి ఆటో నడపడం ప్రారంభించాడు. కొత్త ఆటో కొనుక్కొని యింకా సరిగా ఆరు నెలలు కూడా కాలేదు. ఆటో మరియు జీవితం రెండూ ఒకటేనని అతడి నమ్మకం. జీవితంలో ఏ క్షణంలో ఎలాంటి మార్పు జరుగుతుందో చెప్పడానికి లేదు. జీవితంలో సుఖమూ వస్తుంది, దుఃఖమూ వస్తుంది. అదే విధంగా ఆటోలో మంచివారు వస్తారు, చెడ్డవారూ వస్తారు.

క్రిందటేడు మొదటిరోజు మధ్యాహ్నం దేవరాజ వీధిలో ఒకడు ఆటో ఎక్కి సంగం థియేటర్ వెనుక ఒక గల్లీ అడ్రస్ అడిగాడు. వాడు ఆటో ఎక్కినమీదటే తెలిసింది అతడు గుండుపార్టీ ఆసామి అని. కొద్దిగా ఎత్తుగా వున్నాడు, మీసాలు విడిచాడు, రౌడీలా కనపడ్డాడు. అతడు అడిగిన అడ్రసుకు చేర్చిన మీదట ఆ ఆసామి బాడిగ యివ్వక ఆటో నుండి దిగి సరసరమని జోరుగా నడిచిపోతుండగా రవి అతడిని అడ్డుకొన్నాడు. అతను ఏం మాట్లాడక రవి చెంపకు జోరుగా ఒక దెబ్బ వేశాడు. ఇలాంటివారితో మాటలు పెంచకూడదని రవి తనను సమాధానపరచుకొని వేరే దారిపట్టాడు.

ఈ ఘటనవల్ల తాను అనుభవించిన యాతన చాలనిపించి, ఈ సంగతి యింటిలో కూడ చెప్పలేదు. కాని, అతడు ఆ గుండుపార్టీ ముఖాన్ని మాత్రం మరువలేదు. కొత్త సంవత్సరం మొదటి రోజూ ఆ దుష్టుడిని ఎందుకు గుర్తుంచుకోవాలి. ఆటోలో మంచివారు కూడ ప్రయాణించారు కదా? వారిని జ్ఞాపకం పెట్టుకోవాలి. కొద్దిగా సంతోషమైనా కలుగుతుంది.

తన ఆటోలో ప్రయాణం చేసిన పాతకాలపు సీనియర్ నటుడొకరు యింటికి పిలుచుకొని పోయి భోజనం పెట్టలేదా? సరియైన సమయానికి రైల్వే స్టేషన్ చేర్చినందుకు కన్నడ భాష రాని ఆ దంపతులు అతనికి బాడిగకంటే నలభై రూపాయల బాడుగ ఎక్కువివ్వలేదా? ఆపైన, తన విద్యాభ్యాసం సర్టిఫికేట్లను ఆటోలోనే మరిచిపోయిన ఒకతని అడ్రస్ వెదుక్కొని పోగా వద్దు వద్దన్నా అతను రెండునూర్ల రూపాయలివ్వలేదా? తన ఆటోలో ప్రయాణం చేసినవారు అనేకమంది మరలా ఎదురవలేదు. అదే విధంగా ఆ తాగుబ్రోతు సహా మరలా ఎదురుపడలేదు. ఆటో యింటినుండి

బయలుదేరి రింగ్ రోడ్డు వద్దకు వచ్చినపుడు అక్కడ ముగ్గురు స్త్రీలు ఆటో ఆపారు. వారు ఎక్కడికో అర్జంటుగా పోవాలన్న తొందరలో వున్నట్టనిపించింది. ఆటో ఆపిన వెంటనే వారు ఆటో ఎక్కి తమను చాముండి కొండవద్ద వున్న స్మశానం వద్దకు పిలుచుకొని పొమ్మని చెప్పారు. బాడుగ ఎంతైనా పరవా లేదు అర్జంటుగా పొమ్మని అన్నారు. వారి వైపువారి మృతదేహాన్ని స్మశానానికి తీసుకొనిపొయ్యారని వివరించారు. కొత్త సంవత్సరం మొదటిరోజే స్మశానానికి బాడుగ లభించినదానికి కొద్దిగా చిరాకనిపించింది. అనంతరం రవి తనకు తానే సమాధానపడ్డాడు. మృత దేహం స్మశానం చేరే సమయానికి వీరి ఆటో కూడ అక్కడికి చేరింది. ఆ స్త్రీలు రవి అడిగినంత బాడుగ యిచ్చారు. రవి అక్కడినుండి వెనుదిరిగి వచ్చేటపుడు దారిలో ఒక జంట ఆటో ఎక్కి డయిరీ దగ్గరున్న కల్యాణ మంటపం అడ్రస్ అడిగారు. కల్యాణ మంటపం చేరగానే అక్కడ చూస్తే ఎలాంటి సందడి వాతావరణం లేదు. మూసిన గేటువద్ద వున్న వాచ్మన్ అక్కడికి వచ్చినవారికందరికీ ఏదో చెబుతున్నాడు. ఈ జంట వెళ్ళి వాచ్మన్ ను విచారించగా కారణాంతరాలవల్ల పెళ్ళి ఆగిపోయిందని అన్నాడు. నిరాశతో వెనుదిరిగి అటో ఎక్కి మరలా తమ యింటి అడ్రస్ చెప్పారు.

జీవితంలో ఎలాంటి వారు ఎదురౌతారని! కొత్త సంవత్సరం మొదటిరోజు పెళ్ళిపీటలపై కూర్చొని కొత్త జీవితాన్ని ప్రారంభించాల్సిన వారి పెళ్ళి ఎందుకు ఆగిపోయింది? ఆ జంటను వారి యింటికి చేర్చి వెనుదిరుగుతున్నపుడు ఒక యువకుడు, ఒక యువతి ఆటో ఆపారు. ఆటో ఆపి తక్షణం ఆటో ఎక్కి రైల్వే స్టేషన్ అని అన్నారు. వారిద్దరూ గాబరా చెందుతుండడం చూచి ఇంటినుండి పారిపోతున్నారనిపించింది. ఈ రోజు పెళ్ళికావాల్సిన పెళ్ళికూతురు ఈమే అయివుండవచ్చని అనుమానం కలిగింది. ఆటో రైల్వే స్టేషన్ వద్ద ఆపగానే వీరికోసం వేచివున్న నలుగురు స్త్రీలు అక్కడ నిలబడ్డారు. వీళ్ళు ఆటోనుండి దిగి వారికి డబ్బున్న పర్స్ యిచ్చి 'వేగిరం లోనికి పోండి! ఇంకేమిటి రైలు బయలుదేరుతుందని' వారిని ఆత్రంగా లోనికి తరిమారు. వీళ్ళు పర్స్ మరిచి వచ్చారని అనంతరం రవికి అర్థమైంది. రైల్వే స్టేషన్ నుండి అగ్రహారానికి ఒక బాడుగ లభించింది.

రవి ఆటో అగ్రహారంలో నిలబడివుండగా ఒక యువకుడు వచ్చి పశ్చిమవాహినికి వస్తావా అని విచారించాడు. పశ్చిమవాహినివద్ద కొంతసేపు వుండాలి, అస్థికలు విసర్జన చేయాలని అన్నాడు. ఎవరో పుణ్యాత్ముడి చివరి ప్రయాణం. కొంచం బాడుగ తక్కువ తీసుకొంటే అది ఒక పుణ్య కార్యానికి సహాయం చేసినట్లవుతుంది. కొత్త సంవత్సరం మొదటి రోజు. తనవల్ల వారికి కొంతైనా సహాయం అందుతుంది అని అతనికి బాడుగ ఎంతవుతుంతో చెప్పాడు. ఆ యువకుడు అంగీకరించి, యిల్లు యిక్కడే ఓణిలోవుందని చెప్పి ఆటో ఎక్కి యింటి దారి చూపించాడు. అతడు చెప్పిన దారిలో ఆటో నడిపాడు రవి. ఒక యింటి ముందు ఆటో నిలపగా, ఆ యింటిముందు వ్రేలాడ దీసిన శ్రద్ధాంజలి ఫ్లెక్స్ చూచాడు రవి. శ్రద్ధాంజలి అని వ్రాసివున్న దానిక్రింద ఒక చాయా చిత్రం అంటించారు. ఆ ఫోటో చూడగానే దిగ్భ్రాంతి చెందాడు రవి. అతడా యిపుడు చనిపోయినవాడు లేక వేరే ఎవరైనానా? క్రిందటేడు కొత్త సంవత్సరం మొదటి రోజు ఇతడే కదా తన చెంపపై కొట్టింది. అనుమానం లేదు, ఇతడే!

ఆటో వచ్చేదానికి కాదు, వేరే ఆటో చూచుకోండి అని చెప్పేద్దునా అని అసహనంతో చింతిస్తూ గందరగోళంలో వుండగా ఆరేడు ఏళ్ల వయసున్న బాలుడొకడు యిద్దరు యువకులతో అస్తికలు నిండిన కుండను పట్టి యింటిలోనుండి బయటికి వచ్చాడు. వారి వెనుకే నలుగురు స్త్రీలు రొమ్ములు కొట్టుకొంటూ రోదించసాగారు. ఈ దృశ్యాన్ని చూడలేక రవి తల దించుకొన్నాడు. అతడి కళ్ళలో నీళ్ళూరాయి.

ఆ అబ్బాయి మరి యిద్దరు వచ్చి ఆటోలో కూర్చొన్న వెంటనే ఆటో స్టార్ట్ చేశాడు. తాగిన మత్తులో ఐదారుమంది కొట్లాడుకొన్నారట. చివరకు ఒకడి ప్రాణం పోయిందని ఆ యువకులు వివరించారు. అస్థికల కుండ పట్టుకున్న అబ్బాయి కన్నీళ్ళు కారుస్తూనే వున్నాడు. తన జీవితంలో యిలాంటిదొక ఘటన జరుగకుండా వుండాల్సినది. ఆటో నడుపుతూ ఆలోచించాడు రవి.

క్రిందటేడు ఆ త్రాగిన ఆసామి నా ఆటోలో కూర్చోకుండా వుండాల్సింది. నన్ను కొట్టకుండా వుండాల్సింది. అతడు కొట్టినా నేను అతడి ముఖం జ్ఞాపకం పెట్టుకోకుండా వుండాల్సింది. జ్ఞాపకం పెట్టుకొని వున్నా అతడికి యిలాంటి దురంతపు చావు రావాల్సింది కాదు. అతడు చనిపోయినా అతడి ఆస్థికలు నా ఆటోలోనే తీసుకొని పోయేటటువంటి సందర్భం రాకుండా వుండాల్సింది. కాని, మనం అనుకొన్నట్టు జీవితంలో అన్నీ జరుగవు! ఆలోచించాడు రవి.

♦

## అంగడిలో అక్షరం

- వేంపల్లి సికిందర్
9848351779

అంగళ్ళలో రతనాలమ్మి పొంగిన పోతుగడ్డ మీద
అక్షరాలమ్ముకొంటున్న దైన్యం వేలాడుతూ వుంది
నోట్ల ఆకలి ఒళ్ళు విరుచుకొంటూ వుంది
బిడ్డల్ని డాలర్ల శిఖరాలకు చేర్చే తపనలో
మాడ్చుకొన్న కన్నపేగుల పచ్చనోట్ల త్యాగాలు
హారతి కర్పూరంలా హరించుకపోతున్నాయి
కుహనా స్వాభిమానాలు నలిగిముక్కలై
అంతరాత్మలు అంతర్‌మదనాలు చుక్కల్లోకెగసి
మినుకు మినుకుగా విహరిస్తున్నట్లు
తల్లి భాషకు మించిన సంపదలేదని తెలిసీ
మక్కువ చావని బక్కబతుకులు
మండుటెండలో నెత్తుటి చెమటపిండి
వార్చిన గంజికి రూపుదాల్చిన రూపాయలతో
పరభాషా వ్యామోహం పిల్లిమొగ్గలేస్తూ వుంది
కార్పొరేట్ల చుట్టూ వెంపర్లాట ముగిశాక
బాబు చదివి కాంక్రీట్ జంగల్స్‌లో గద్దెమీద కూచోగా
వాడి బాబు బతికి బట్టకట్టలేక కుదేలవుతున్నాడు



అక్కడ అక్షరం ఒక అంగడిబొమ్మ
ఇక్కడ బోధన..ఒక శోధన
ఇక్కడ ఉరితాడు బిగించుకొన్న అధ్యయనాలు
వ్యాపార రంగు పులుముకొన్న విజ్ఞానం
అవకాశ వాదమై వెక్కిరిస్తున్న వికాసం
ఈ తికమకలో కాలం నిట్టూర్పుల నిగూఢం
ఎంతకూ అంతుబట్టడం లేదు ♦

---

## సాధన

- ఎరుకలపూడి గోపీనాథరావు
9848293119


గతించే లోపు
ఒక్క సుకృత్యాన్నైనా సుసంపన్నం చేసుకోవాలి
అనిశ్చిత కాలపరిమాణం కలిగిన అల్పజీవితంలో
సుషుప్తావస్థలకూ, క్రియాశూన్యస్థితులకూ
మిక్కిలి నిరుపయోగంగా వెళ్ళబుచ్చిన
సమయాన్ని మినహాయించగా
మిగిలిన కాలాన్నైనా
సత్కర్మలతో పరిపూర్ణం చేసుకోవాలి!
అంతరించేలోపు
అభినందనీయమైన కొన్ని అధ్యాయాలను రచించి
జీవిత చరిత్రను గౌరవప్రదంగా ధన్యం చేసుకోవాలి!
ఒక ఫలవృక్షంలానైనా ప్రవర్తిస్తూ
ఒక బాటలానైనా విస్తరిస్తూ
ఒక దీపస్తంభంలానైనా ప్రకాశిస్తూ
పుట్టుకను పూజనీయంగా తీర్చిదిద్దుకునే
పుణ్యం చేసుకోవాలి!
పాపపుణ్యాల ఆవర్జాలూ
వైతరణి తారణ విధానాలూ



యమపురి యాతనలూ
కైవల్యపథాలూ, అమరలోకానందాలూ
పరమ సత్యాలో పచ్చి అబద్ధాలో మనకెందుకు కానీ
మట్టిలో మట్టిగానో
కట్టెల్లో కట్టెగానో మారేలోపు
మనిషిలా మనుగడ సాగిస్తూ
మహిలోనే మన స్వర్గాన్ని నిర్మించుకునేందుకు
శక్తివంచన లేకుండా శ్రమిస్తూ
కాలపరీక్షలలో మనను మనం
ఉత్తీర్ణం చేసుకోవాలి!

కాలధర్మం చెందినా
కాలగర్భంలో వ్యర్థంగా కలిసిపోకుండా
కీర్తిశేషులుగా మనను జీవింపజేసే
కొన్ని మంచి పనులనైనా నిర్వహించేందుకు
బ్రతుకునే తగిన సాధనం చేసుకోవాలి! ♦

విశ్లేషణ



# ఎల్లెడలా మాతృభాషే


**- ఆర్. లక్ష్మి**
**0884-2351683**


***ప్రపంచంలో తమకు అర్థం అయ్యే భాషలో, తాము చదవగలిగే భాషలో విద్యాబోధన లభించని వారు 40 శాతం వరకు ఉంటారని యునెస్కో అంచనా. విద్యాబోధనలో మాధ్యమంగా ఉపయోగపడని భాష నాలుగు లేక ఐదు దశాబ్దాలలోగా అంతరించిపోతుందని యునెస్కో అధ్యయనాలు శాస్త్రీయంగా చెప్తున్నాయి. అంతటి పెను విషాదాన్ని నివారించడానికి మనవంతు కర్తవ్యాన్ని నిర్వహించడం మన బాధ్యత.***

**యు**నెస్కోకు సంబంధించిన గణాంకాల సంస్థతో కలసి ప్రపంచ బ్యాంకు రూపొందించిన నివేదిక ప్రకారం - విద్యార్థుల అభ్యసనా సామర్థ్యానికి, దేశాల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు విడదీయలేని సంబంధం ఉంది. వివిధ కారణాల వలన పెరిగిపోతున్న విద్యార్థుల అభ్యసన లేమి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ఆటంకం అవుతోంది. మాతృభాషలో ప్రాథమికాభ్యాసం ఉన్న చోట్ల మంచి ఫలితాలు ఉంటున్నాయి. కేరళలో విద్యామాధ్యమం మళయాళం. ఆ రాష్ట్రం సాధించిన అభివృద్ధిని గురించి కొత్తగా చెప్పుకోనవసరం లేదు. కర్ణాటకలో కన్నడ భాషే మాధ్యమం. తమిళనాడు సంగతి తెలియనిది ఏముంది? అక్కడ ఉన్నత న్యాయస్థానం తీర్పులు సైతం తమిళంలోనే వెలువరించబడాలని ప్రజలు నినదిస్తున్నారు.

దేశంలో మొట్టమొదటిసారిగా భారతీయ భాషగా ఉర్దూ-మాధ్యమంగా 1918 నుండీ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్, మెడిసన్, లా- వంటి అన్ని కోర్సులను ఉర్దూలోనే అందిస్తోంది. నాణ్యమైన విద్యార్థులను తయారుచేస్తున్న కీర్తి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఉంది. ప్రపంచంలో తమకు అర్థం అయ్యే భాషలో, తాము చదవగలిగే భాషలో విద్యాబోధన లభించని వారు 40 శాతం వరకు ఉంటారని యునెస్కో అంచనా. విద్యాబోధనలో మాధ్యమంగా ఉపయోగపడని భాష నాలుగు లేక ఐదు దశాబ్దాలలోగా అంతరించిపోతుందని యునెస్కో అధ్యయనాలు శాస్త్రీయంగా చెప్తున్నాయి. అంతటి పెను విషాదాన్ని నివారించడానికి మనవంతు కర్తవ్యాన్ని నిర్వహించడం మన బాధ్యత.

ప్రపంచం మొత్తంగా 6000కు పైగా ఉన్న భాషలలో తెలుగు 20వ స్థానంలో ఉంది. తెలుగుకు అపరిమితమైన గౌరవం ఉంది. వినసొంపుగా ఉంటుందన్న కారణంగా తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' గా పేర్కొనడం జరిగిందనీ చరిత్ర చెప్తోంది. "దేశ భాషలందు తెలుగు లెస్స' అనీ కీర్తించబడింది.

ఇటలీ, రష్యా, స్పెయిన్, ఇంగ్లండ్ వంటి అనేక దేశాలలో విద్యాబోధన మాతృభాషలోనే జరుగుతోంది. మాతృభాషలో విద్యాబోధన పిల్లలలో మానసిక వికాసానికి ఎంతగానో దోహదం చేస్తోందన్న సంగతి శాస్త్రీయంగా ఋజువు కాబడిన సత్యం. సాంస్కృతికంగా, సాంకేతికంగా, ఆర్థికంగా ఇలా పలురంగాలలో ఎంతో అభివృద్ధి చెందిన అనేక దేశాలలో ప్రాథమిక స్థాయి నుండి విద్యాబోధన మాతృభాషలోనే సాగుతోందని అధ్యయనాలు చెప్తున్నాయి.

టర్కీ, డెన్మార్క్, ఇరాన్, బ్రెజిల్ వంటి దేశాలలో మాతృభాషే మాధ్యమంగా చదివిన పిల్లలు వివిధ వృత్తులకు సంబంధించిన విద్యలను అభ్యసించి ఆయా రంగాలలో

రాణించడమే కాకుండా క్రొత్త ఆవిష్కరణలకూ కేంద్రబిందువులౌతున్నారు. వారి పరిశోధనలు, రచనలు సైతం మాతృభాషలోనే జరుగుతున్నాయి.

ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్ రంగాల పరికరాల తయారీలో ముందువరసలో ఉన్న దక్షిణకొరియాలో విద్యాబోధన మాతృభాషలోనే సాగుతోంది. అన్ని రంగాలలో అమెరికాతో 'ఢీ' అంటున్న చైనాలోనూ మాతృభాషే మాధ్యమం. బ్రిటన్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి కొన్ని దేశాలలో మాత్రమే ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన జరుగుతోంది.

మాతృభాష, విద్యామాధ్యమం భాష వేరుగా ఉన్న చోట్ల గణితం, సామాన్యశాస్త్రం వంటి వాటిని నేర్చుకోవడంలోనూ ఫలితాలు దెబ్బతింటున్నాయి. ఏ భాషనైనా చదవడం, వ్రాయడం విద్యార్జన క్రమంలో కీలకాంశం. సాధారణంగా ఆ రెండు ప్రక్రియలు సునాయాసంగా వంటబట్టేది మాతృభాషలోనే. అరుదుగా ఇతర భాషలలో సైతం చదవటం, వ్రాయటం తెలిసినప్పటికీ మాతృభాషపై ఉన్నంత సాధికారికత అలవడడం అంత తేలిక కాదు.

కస్తూరి రంగన్ కమిటీ - 5 వ క్లాసు వరకు మాతృభాషలోనే బోధన జరగాలని 6వ తరగతి నుండి ఆంగ్ల భాషను కూడా చేర్చవచ్చని సూచించింది. ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండాలనే విషయంపై ప్రపంచవ్యాప్తంగా భిన్నాభిప్రాయం లేదు. కారణం- ఐర్లాండ్, సింగపూర్ వంటి దేశాలలో విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యాలు కొరవడిన వారు 9 శాతంగా ఉండగా మాలే వంటి దేశాలూ ద్విభాషా విధానం అవలంభించి మంచి ఫలితాలను రాబట్టుకుంటున్నాయి. మాండరిన్ మీడియంగా ఉన్న చైనాలో 80 శాతం మించి విద్యార్థులు చక్కని సామర్థ్యాలను కలిగి ఉంటున్నారు. మనదేశంలో మాత్రం అటువంటి సామర్థ్యాలు ఉన్న విద్యార్థులు 50 శాతానికి లోపే.

చైనా వారికి, జపాన్ వారికి, కొరియా వారికి ఆంగ్ల భాష రాదు. ఆ దేశాల నాయకులు అంతర్జాతీయ, ప్రపంచ వేదికలపై కూడా తమ తమ మాతృభాషలలోనే ప్రసంగిస్తారు. దుబాసీల ద్వారా వారి అభిప్రాయాలు, ఉపన్యాసాలు సభికులకు చేరతాయి. ఆంగ్లభాష ఏ మాత్రం వినియోగించని ఆ దేశాలు శాస్త్రసాంకేతిక రంగాలలో సైతం ప్రపంచాన్ని ఏలగలిగిన రీతిలో దూసుకుపోతున్నాయి.

జపాన్ వలసపాలనలో ఉన్న దేశం కాదు. బ్రిటిష్ పాలనతో గాని ఆంగ్లభాషతో గాని ఏ రకమైన సంబంధమూ లేదు. అయినప్పటికీ వారు ఐరాపా దేశాల విజ్ఞానాన్ని తమ భాషలోనికి ఆవిష్కరించుకోగలిగారు. సుదీర్ఘకాలంబాటు అనేక శ్రమదమాదులకు ఓర్చి జపాన్ అనుసరించిన ఆ విధానం కారణంగా ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సాంకేతిక శక్తిగా జపాన్ రూపుదిద్దుకోగలిగింది. నైపుణ్యాల పట్ల కుతూహలం, జిజ్ఞాస, అవగాహనాశక్తిల కారణంగానే అవన్నీ సాధ్యమయ్యాయి. ఆ విధంగానే విదేశీ భాషలలో ఉన్న విజ్ఞానాన్ని మాతృభాషలలోనికి అనువదింపజేసుకోవడం ద్వారా సమాజాలను ఆధునిక విజ్ఞానంతో సుసంపన్నం చేసుకున్న దేశాలు ఎన్నో ఉన్నాయి.

బర్మాలో 'బర్మీస్', మారిషస్‌లో 'క్రియోల్', సౌత్‌ఆఫ్రికాలో ఇంగ్లీష్ మాధ్యమాలుగా ఉన్నా వాటి అభివృద్ధికి ఏ ఆటంకమూ రాలేదు. ఘనా, టాంజానియా, జాంబియా వంటి పేద దేశాలూ ఫ్రెంచి, ఇంగ్లీషు వంటి భాషలను వదలి మాతృభాష మాధ్యమంగా విద్యాబోధన మొదలుపెట్టాయి.

ఖతార్‌లో - సుసంపన్నమైన దేశం అయిన కారణంగా ఉన్నతస్థాయి ప్రమాణాలతో, విద్యాధికులైన ఉపాధ్యాయులతో ఎక్కడా రాజీపడకుండా విద్యనందించినప్పటికీ ఫలితాలలో మార్పులేకపోవటం మాట ప్రక్కనపెడితే విద్యార్థుల ప్రమాణాలూ క్షీణించడంతో సుమారు దశాబ్దంపాటు సైన్సు, గణితం వంటి పాఠ్యాంశాలను ఇంగ్లీషులో బోధింపచేసిన ఖతార్ 2013 సంవత్సరంలో తిరిగి మాతృభాషా మాధ్యమానికే పెద్దపీట వేసింది.

గణాంకాల విషయానికి వస్తే- గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 2013-18 నడుమ కాలానికి చోటు సంపాదించిన 58 దేశాలు మొదటి 50 స్థానాలలో రాగా వాటిలో 55 దేశాలు మాతృభాషలోనే విద్యాబోధన సాగిస్తున్నాయి. గ్లోబలైజేషన్ ఇండెక్స్‌లో మొదటి 25 దేశాలలో 24 మాతృభాషా మాధ్యమంలోనే బోధిస్తున్నాయి. ఇటీవలి కాలంలో బ్లూమ్‌బర్గ్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో మొదటిగా ఉన్న 40 స్థానాలు 43 దేశాలు దక్కించుకోగా వాటిలో 3 తప్ప మిగిలిన 40 దేశాలూ మాతృభాషా మాధ్యమంతోనే కొనసాగుతున్నాయి.

స్వతంత్ర భారతదేశపు తొలిదశలలో, వివిధ దేశాలలో అవకాశాలు వచ్చి తరలిపోయిన 'మేధోవలస'కు చెందిన

## కవిత

# మోకరిల్లిన వేళ

- పసుమర్తి పద్మజవాణి
9381949772




వైద్యం నీ ముందు మోకరిల్లిన వేళ...
చిరంజీవీ! లియాంగ్ యోయీ!!
మొత్తం మానవజాతికే
స్ఫూర్తి ప్రదాతవయినావోయీ!
సలాం నీకు... లియాంగ్ యోయీ!
మెదడు కణాల్ని నిర్వీర్యం చేస్తూ
కేన్సర్ ట్యూమర్... భరింపరాని బాధ
మరణ శయ్య...
మరి తిరిగి రాని లోకాల చెంత నిలిపినా...
నీ దయార్ద్ర హృదయ ద్వారాలు
తెరిచి మరీ-
స్వచ్ఛంద అవయవ దానపత్రంపై
ఎప్పటికీ చెరిగిపోని సంతకమయ్యావు
లియాంగ్! బంగారు తండ్రీ-
షెంజన్ భూమిలో మోసులెత్తిన
వజ్ర సంకల్పమా!
నీ మరణం - నీ దేహ హరణం
కాకూడదని...
నువ్ దానం చేసిన కాలేయం,
రెండు కళ్ళూ... కిడ్నీలూ... గుండె
యెందరెందరి జీవితాల్లో
వెలుగులు నింపాయో కదా...
మస్తిష్కం మొద్దుబారి
అచేతనమయిపోతూ కూడా
చివరి కోరికగా
నీ అవయవ దానానికి అంగీకరించమని
మీ అమ్మని అర్థించావు చూడు...
పదకొండేళ్ళ పసిప్రాయంలో నువ్
చూపిన అమృతత్వం ముందు
ప్రపంచమే సాగిలపడి
నీ పార్థివ దేహం ముందు శిరస్సు వంచింది.
గుండెలు రెండుగా చీలిపోతుంటే
చివరిసారిగా నిన్ను హత్తుకుని
నీ ప్రాణాన్నీ... చలనాన్నీ
కరకు కత్తుల కప్పగించిన నీ తల్లి
క్షోభ నీహాళ లోకంలో ప్రతి మహిళా
ఆర్తిగా పంచుకుంటోంది.
అనంతంగా సాగే జన్మ మృత్యు
తరంగాల మధ్య ఓడి గెలిచిన
పసిమానవత్వ సంజీవనీ-
ప్రతి అస్తిత్వ కణం లోంచీ... నీ ఆత్మికాండం
దయామేఘమై మా చుట్టూ పరుచుకుంటోంది.
లియాంగ్ యోయీ... విశ్వమానవ సౌభ్రాతృత్వమూ
దాతృత్వమా.... ఈ నేల నిలిచి వున్నదాక
నిన్నెప్పటికీ మరువమోయీ... లియాంగ్ యోయీ! ♦


విద్యాధికులందరూ మాతృభాషలో చదువుకోవడం వారి పురోగతికి ఏ మాత్రం అడ్డంకి కాలేదన్నది గుర్తుచేసుకోవలసిన విషయం.

మలేసియాలో – 1971 నుంచి మలేసియాలో ఆంగ్లాన్ని అంచెలంచెలుగా తీసివేసి 'మలాయి' ని పూర్తిగా ప్రవేశపెట్టారు. ప్రాథమిక విద్యనుండి విశ్వవిద్యాలయాల వరకు మలాయిలోనే బోధన సాగుతుంది. 'మలాయి' పై పట్టులేకపోవడాన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికలో అనర్హతగా పరిగణిస్తారు. ఆ కారణంగా అక్కడి వారందరికీ మలాయి వ్రాయడం, చదవడం వచ్చి ఉంటుంది. ఇంగ్లీషు మాధ్యమ పాఠశాలల్లో కూడా మలాయి తప్పనిసరి సబ్జెక్టుగా ఉంటుంది. అలా అని స్వభాష పట్ల అహంకారం అనుకోవడానికి వీలులేదు. మిగిలిన మాతృభాషలనూ మలేషియా ప్రభుత్వం గౌరవిస్తుంది. చైనా, మలాయి, తమిళ మాధ్యమాలతో నడిచే ప్రాథమిక పాఠశాలలూ ఉన్నాయి. గతంలో తెలుగు మాధ్యమం పాఠశాలలూ ఉండేవి. విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిన కారణంగా రమారమి 50 దాకా ఉండే ఆ ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. అయినప్పటికీ 15 మందికి తక్కువ కాకుండా విద్యార్థులు ఉంటే తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు వారంలో ఒకరోజు నిర్ణీత సమయంబాటు తెలుగును బోధించే వెసులును ప్రభుత్వమే కల్గిస్తోంది. ఈ మొత్తం ప్రక్రియ నిర్వహణకు అయ్యే వ్యయాన్ని అక్కడి ప్రభుత్వమే భరిస్తోంది. 'మాతృభాష'లను ఉదాత్తమైన అటువంటి చర్యల ద్వారా మలేసియన్ ప్రభుత్వం గౌరవిస్తోంది.

♦




సడ్లపల్లి చిదంబర రెడ్డి



# అనంత కరువు సంతకం

- డా. బి. నాగశేషు
9985509053

స్వతహాగా రైతు నేపథ్యంతో ముడిపడిన జీవితం కాబట్టి చిదంబర రెడ్డి హృదయం రగిలిపోయింది. రగిలిన హృదయ రవ్వలే కవితాజ్వాలలై ఎగిసి పడుతున్నాయి. కనపడని రైతు కనుపాప చెమ్మే ఈ కవితాసంపుటి.

ఊరి చెరువును పట్టణం ఎలా ఊడ్చేసిందో, పక్షుల వరుసలు ఎలా వలసెల్లి పోయాయో, కాలుష్యం ఎలా మనల్ని కమ్మేసిందో, నదులు ఎడారిగా మారి పరిగెత్తలేని అవిటితనంతో ఎలా అంగలాస్తున్నాయో, ఎండిన నేల, నిండని చెరువు నీటి చుక్క ఆలింగనాలు జరగక ఎన్ని ఏళ్ళయిందో, అంటూ ఊరి చెరువు రోదనని లౌడ్ స్పీకర్స్ లో వినిపిస్తారు అన్వేషణల గవాక్షం అనే కవితలో. ***చేతులు కాళ్లు కాదు మనిషికి చేవ ఉండాలి బతకాలనే బలమైన ఆశ ఉండాలి అందుకు ఆశాభావం దోసిళ్లకొద్దీ తాగాలి. ఏ అవయం లేకున్నా తడిగుండెల తల ఉంటే చాలు విత్తి చూడు అందులో కొత్త బీజాలు*** అంటూ మనో అవిటితనాన్ని, మసకేసిన ధైర్యాన్ని తట్టిలేపుతారు.

రాయలసీమ కరువు గురించి "సగం కాలిన అనాథ శవం" అంటారు ఇంతకు మించి కరువు గురించి మాటలేముంటాయి చెప్పడానికి. బాల్యం ర్యాంకుల మంటలో ఎగిరెగిరి పడే మిడతల్లా దహనమైపోతున్న తీరును బాల్యం కవితలో తెలియజేశారు. రైతు జీవితాన్ని అత్యున్నతంగా తీర్చిన కవిత పుడమి సూర్యుడు. ***సూర్యున్ని మించి జ్వలించే ఆశయ దీపమై, ఆకాశమంత కలల మేఘాల్తో గగనమంతా విస్తరిస్తాడు.*** రైతు ఎంత తనలో తాను జ్వలిస్తుంటాడో తెలుపుతారు.

ప్రపంచమంతా కుగ్రామమవుతున్న నేటితరంలో దేశ దేశాల మధ్య ద్వేషాలెందుకని శాంతి సూత్రం కవిత ద్వారా తెలియజేస్తారు. అమ్మను ప్రాణవాహినిగా పోల్చడం కొత్తగా ఉంది. అమ్మ కేవలం జన్మనివ్వడమే కాదు తన భాష, యాస, పనితనం, మనిషితనపు తడి హృదయాన్ని బీజంగా నాటి అంతరించని జీవన విధానాన్ని మరో తరానికి బదిలీ చేసే ప్రాణవాహిని అమ్మ అంటారు. ఇక దోశలమ్మ అనే కవిత ఒక కథ రాయొచ్చు.

భారతదేశం కులాలకు పుట్టినిల్లు. భారతదేశం పెద్ద సంపన్నదేశం అవ్వచ్చు,కానీ కులంలేని దేశాన్నిమనం చూడలేము. ప్రస్తుతం దేశాన్ని ఏలుతున్నది కులాలే. ఒక వృత్తంలోనే మనం ఆలోచించేలా చేశారు. మానవత్వంగా ఆలోచిస్తే అది మహా తప్పిదమౌతుంది. అదే విషయాన్ని "ధరలట్యాగ్"అనే కవితలో ***ఇక్కడొక ప్రాంతంలోనో మతంలోనో పుట్టడం/ సరికొత్త లోకాన్ని కలగనడం/ మానవత్వపు మహాతప్పిదమై పోయింది'*** అంటాడు.

రైతు గురించి పుడమి సూర్యుడు కవితలో అతడు పొద్దును చూడడు. సూర్యున్ని కూడా రైతే మేల్కొలుపుతాడంట, చినుకులకన్నా ముందే దుక్కి ఎదలో మార్ధవమై..... పాపం రైతు ఆశ ఆపాటిది మరి. వర్షం వస్తుందో పోతుందో పంట వస్తుందో రాదో తెలీదు కానీ నేలతల్లిని రోజూ తనివితీరా తడమందే రైతుకు దినంసాగదు. భార్య, తల్లితోకంటే తనలో తాను పొలం గురించి చేసే ఆలోచనలే ఎక్కువగా ఉంటాయి. అలాంటి రైతుకు కరువులు, వరదలు గట్టిగా మోకులతో

కట్టేస్తున్నాయి ఊపిరాడకుండా. రైతు ఆత్మహత్యను కవి ఎంత కంటనీరు పెట్టించేలా రాశారో.. ***బిడ్డను పోగొట్టుకొన్న భూమితల్లి దుఃఖం సముద్రమై/ అలల చేతుల్తో తల బాదుకొంటూ నిరంతరం రోదిస్తూనే ఉంటుంది. రైతు పండించే పంటపై ఆధారపడి బతికే అందరూ బాగున్నారు కానీ రైతు మాత్రం ప్రతి ఒక్కరికీ ఫలహారంగా మిగిలిపోతున్నాడు.*** ఇలా ప్రతి కవితా ఓ గొప్ప అనుభవంగా కనపడుతుంది. ప్రతీ అక్షరం ఒక పరమార్థాన్ని మోసుకొస్తుంది.

మహాభినిష్క్రమణం కవితా సంపుటిలోని 43 కవితలు వేటికవి ప్రత్యేకం, తడిమితే తనువంతా గాయాలమయం. అమ్మ గురించి ప్రాణవాహిని కవితలో, ***మనం మనం కాదు వేలఆశయాల ఆణువుల అమృతనం నాటిన పరమాణు ధూళికణాలం....తనూ తన ప్రాణం చనుబాలుగా మారి నవ్వుల పూలు పెదాలపై పూయిస్తూనే రేకులు రాలి కాయకు ఆకరాన్నందించే మర్మంగా అంతర్ధాన మయ్యేది. తనకు తోడెవ్వరూ లేకున్నా తను ముళ్లబాటలో నడిచి బిడ్డకు మాత్రం తనే తివాసీగా*** మారుతుందంట. మననుండి మనల్ని భావితరాలకు బదిలీ చేసే ప్రాణవాహిని అమ్మ అంటారు.

'ఇక మిగిలింది' కవిత నేటి రైతు దీనావస్థకు నిలువెత్తు సాక్ష్యం. మనం దినపత్రికలో చదువుతున్నాం. కరువు రైతు వ్యవసాయం వదలి భూమి మీద ఆశ వదులుకొని తప్పనిసరి పరిస్తితుల్లో బతకాలి కాబట్టి పొట్ట పట్టుకొని పట్నం వాకిలి ముందు కాపలా దారుడిగా దిగాలుగా జీవితాన్ని గడుపుతున్న జీవితాల గురించి. అంతేకాకుండా ప్రపంచీకరణ పల్లెలను ఎలా కబళించేసిందో కూడా ఈ కవితలో వివరించారు.

***"మొదట్లో అనిపిస్తోందది/పల్లెను రక్షించే సరికొత్త గొడుగని/ఎకరాలకెకరాలు కబలించాక తెలుస్తుంది/గ్రామీణ మూలాల్ని తెంచే పాపిష్టి పిడుగని"***

మనిషికి తాగడానికి గుక్కెడు నీళ్ళు కూడా ఇవ్వలేని ప్రభుత్వాలు పాతాళంలోఉండే నీళ్లను కూడా తోడేస్తున్నారు. చిత్తశుద్ధితో పల్లెలను అభివృద్ధి చేస్తే పల్లెలు పచ్చగా ఉంటాయి. ***మీ ఉద్ధరింపుల ప్రాజెక్టుల్తో ముంచేయకుండా/స్వచ్ఛంద సంస్థల ప్రొక్లెయినర్లతో కూల్చేయకుండా/ప్రపంచం సంతలో వేలం పాటకు అమ్మేయకుండా/పల్లెల్నలా బతకనిస్తే చాలు అవే/ మనిషిపిల్లల్నికంటాయి తమ/ జీవన కుటీరాల్ని అనుభవాల తీగల్తో అల్లుకొంటాయి.***

జీవరాశుల్ని కబళించడానికి కారకులైన మాయా నక్కలే ఎన్నో జీవరాసులు అదృశ్యమై పోతున్నాయని గట్టి ఉపన్యాసాలిస్తున్నారు. జీవరాసుల్ని సంరక్షించడానికి కంకణం కట్టుకొన్నట్లుగా మాటలు చెబుతారు. నిజానికి ఇవి కాపాడే రైతన్నను కూడా కర్మాగారాల కోరలు ఎప్పుడో కనుమరుగు చేసేశాయి'.

ఇంత గందరగోళంలోనూ' అనే కవితలో దాదాపు నేటి సమాజంలో జరిగే అన్ని వింతలు కనపరిచారు. నేటి యువత సెల్ఫీల కోసం ప్రాణాలను తీసుకొంటున్నతీరు. సాధువుల్లా గెడ్డాలు పెంచుకొని ఎవరిలోకంలో వారు మునిగితేలటం మనం చూస్తూ ఉన్నాం. వికృత కామక్రీడలు, పూజారుల శఠగోపాల లీలలు, ఇసుక అక్రమాలు, కాడీ, మేడీ మూలన పడటం, విద్యార్థులు ఉత్త డిగ్రీలు చేత పట్టుకొని ఆఫీసుల వెంట ఉద్యోగాలకోసం పడిగాపులు, ప్రజాప్రతినిధులే దగ్గరుండి కోళ్ల పందేలను ఆడించడం, ఊరూరా బార్ల జాతరలను తెగ తాగేసి జరుపుకోవడం, మనిషికి లేని గుర్తింపు ఆధార్ కార్డులకు ఇచ్చి ప్రతి అవసరానికి ఆధార్తోను, పాన్ కార్డుతోను ఇంకా వగైరా కార్డులకు లింకు చేసి మనుషులతో మనుషులకు నమ్మకాలు లేకుండా, సంతానాన్నంతా కార్డుల్లోకి ఎక్కించడానికి అమ్మ కనడంకంటే పెద్ద విషయంగా మారిపోయింది. ఇంటర్నెట్ వలలో బంధాలు చిక్కుకొని విలవిల్లాడుతున్నాయి. ఇంటినిండా జనం ఉన్నా పట్టించుకోని మనిషి మరయంత్రాల్లా మారి ఫేస్ బుక్, వాట్సప్ లాంటి వలల్లో ఇరుక్కొని విలవిల్లాడుతున్నాడు. తీరా మనిషే మనిషిని వెదికే పనిలో నిమగ్నమయ్యాడు.

ఇలాంటి అనేక సమాజపు కొత్తవింతలను, వికృతపోకడలను తన కవితల్లో విశద పరిచారు. మహాభినిష్క్రమణం కవితా సంపుటినిండా, పట్టణీకరణ, నగరీకరణలు పల్లెలను మింగేస్తున్న బాధలు, రైతు కడగండ్లు, ప్రజలు పోగొట్టుకొంటున్న సామూహిక జీవితాలు, మసకబారిన మనిషితనం, సమాజంలో జరుగుతున్న సంకర మార్పులు, ఇలా ప్రతీ కవితలోనూ సాటి మనిషిగా చిదంబరరెడ్డి బాధ్యత మనకు అర్థమౌతుంది.

అనంత కరువుకు మాటలొస్తే చిదంబరరెడ్డి కవితల్లా ఉంటాయి. ఈ కవితలు కేవలం రైతును ఉద్దేశించి రాసినవే కాదు కనుమరుగవుతున్న మానవత్వపు మూలాలను వెతికే కవితలు, కరువును వర్ణిస్తూ రాసిన కవితల్లో వాడిన ఉపమానాలు గోడ కట్టినట్లున్నాయి. దీర్ఘ సమాసాలు, అక్షరాల ఆడంబరత్వం మినహాయిస్తే నేటి సమాజంలో నిష్క్రమిస్తున్న చాలా విషయాలను హెచ్చరించారు. ♦

## కవిత

# నేనిప్పుడు....

- రజిత కొండసాని
9652838920

నేనిప్పుడు
తేలిగ్గా పగిలిపోయే గాజుబొమ్మను కాను
కరిగిపోయే మట్టిబొమ్మను అస్సలు కాను

నేనిప్పుడు
ఆకాశాన్ని ముట్టాలని
ఎగిరెగిరి లేస్తున్న
అలను



నేనిప్పుడు
నీ అహంకారాన్ని
కాల్చి పడేయటానికి కమ్ముకొస్తున్న
నిప్పుల మబ్బును

నేనిప్పుడు పంజరాన్ని
నా రెక్కలతోనే ముక్కలు చేసి
పైకెగిరిపోయిన నీలి పిట్టను

నేనిప్పుడు
విజయం కోసం
తాపత్రయంలో రెప్పవేయని పోరాటాన్ని

నేనిప్పుడు
నా చీకటి బతుకులో
నన్ను నేనే
వెలిగించుకున్న కాగడాని

నేనిప్పుడు
పసిమొగ్గల్ని చిదిమేసే
ఎలుగ్గొడ్ల పాలిట
గొడ్డళ్ళ చేతుల ఎర్రెర్రని నాలుకల నల్ల కాళికను

నేనిప్పుడు
నాలాంటి జీవితాలకు
సరికొత్త దిశను.. ధ్యాసను... శ్వాసను.... ♦

# చెవికెక్కని మాట!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

నేల రాలినంక
ఏ పూవుదైనా గాలి వాటమే!

కొమ్మ మీద ఊరేగినంత సేపే
సొగసూ ఆ వైభవమూ!



భ్రమలేవీ వీడకుండా అలా ముందుకే పోతానంటే
వెనక దళాలు కమలాలై వికసిస్తాయి!

పేదల పేరెత్తి ధనవంతుల కొమ్ము కాస్తే
శ్రీమంతులు స్వ లాభాన్నే కాంక్షిస్తారు!

రాజకీయాలు వ్యాపార రంగాన్ని తలదంతుంటే
ఒడుదుడుకులను అనుభవించాల్సిందే!

కరకట్టల పక్కన కాపురమున్నాకా
నదీ ప్రవాహానికి ఎదురీదాల్సిందే!

హద్దులు దాటిన స్వ కుచ మర్దనం
చేదు ఫలాలిస్తుంటే దిగమింగాల్సిందే!

ఏదీ శాశ్వతం కాదని తెలిసీ
కుర్చీనే నమ్ముకున్నాకా కుదేలవ్వాల్సిందే!

ఇప్పటికీ ప్రజాస్వామ్యంలో రాచరికాన్ని కలగంటే
తమరికి చరిత్ర పాఠాలు చెవికెక్కనట్లే!! ♦



# కెరటం

- మీనాక్షి శ్రీనివాస్
9492837332

"ఓరి నా మావో, ఇట్టా నా కొంప ముంచీసినావేటి దేవుడో " పొద్దున్నే ప్రశాంతంగా ఉన్న ఆ వాతావరణంలో ఓ ఆడమనిషి గొంతు ప్రతిధ్వనించింది.

ఆ గొంతు సాలమ్మది. ఆ కేకలకు ఉలిక్కిపడి లేచిన ఆ వాడ వాడంతా పరుగు పరుగున అక్కడికి చేరారు. ఫేనుకు ఉరేసుకుని వేలాడుతున్న సోము కాళ్ళని పట్టుకు గుంజుతూ ఇంకా అలా వెర్రిగా కేకలు పెడుతూనే ఉంది సాలమ్మ.

పక్కింటి ఏసు సాలమ్మను పక్కకి జరిపి సోము మృతదేహాన్ని కిందకు దించాడు, ఒక్కడే పక్కనే ఉన్న కుర్చీ ఎక్కి తాడు కోస్తుండగానే ఇరుగుపొరుగు మగాళ్ళంతా సాయానికొచ్చారు. ఇప్పుడేం చెయ్యాలి పద్ధతి ప్రకారం అయితే పోలీసులకి తెలియచేయాలి, కానీ వాళ్ళొచ్చి ఇంకొంచెం బాధపెట్టడం, సొమ్ము గుంజడం తప్ప ఒరిగేదేముంటుందీ! .. ' ఇలా ఆలోసిత్తా ఆ శవాన్ని కింద పరసిన సాప మీద పడుకోబెట్టాడు. తల్లీ, తండ్రీ గుండెలు బాదుకుని ఏడుస్తున్నారు, పిల్లలిద్దరూ ఏం జరిగిందో అర్ధం కాక అయోమయంగా చూస్తున్నారు.

" ఏటైందీ? మళ్ళీ ఏదైనా తగూలాడుకున్నారా? " అడిగాడు అన్నారం, ఏడుస్తూనే లేదన్నట్లు తల అడ్డంగా తిప్పింది సాలమ్మ.

" మరేం కష్టమొచ్చిందని ఇంత పని సేసేసాడు? " ఇంకా షాక్ లోంచి తేరుకోలేదు ఏసు. ఇద్దరూ ఒకే వయసు వాళ్ళు, స్నేహంగా, సొంత అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉండేటోల్లు.

" నిన్నటేల తొరగా ఇంటికొచ్చేసిండు, యిచారంగా కనబడ్డాడు, ' ఏటి మావా' అంటే ఏటినేదే కూతంత తలనొస్తందీ అన్నాడు .. ఆడికి ఇట్టం అని సేపల పులుసూ, బొమ్మిడాయిల ఇగురూ సేసా, అయి తిని కూతంత సేపు పిల్లలతో ముచ్చటలాడిండు, బాగా సదువుకోవాలా, మీ అమ్మని బాగా సూసుకోలా అంటూ సెప్పిండు .. అక్కడికీ అడిగా ' ఏటి ఇయ్యాల సిత్రంగా ఉన్నావు, సుక్కేయలేదు, తొరగా వచ్చినవ్, పిల్లలని దగ్గర కూకోపెట్టుకున్నవ్ .. ఏటి కతా ' అనడిగినా, ఏటి నేదంటూ నవ్వేసినాడు. మనసులో ఇట్టాటి ఆలోచన ఉందని నాకేటెరుక, రోజూ ఇట్టా రా అయ్యా, ఆ పాపిష్టి తాగుడు మానేయ్ ' అన్న నన్ను ' అట్టాగేనే' అంటూ తలమీద మొట్టినాడు. కానీ ఏం కట్టమొచ్చిందో, ఇట్టా ఎందుకు సేసాడో ఏం అర్ధమవడంలా " మళ్ళీ భోరుమంది సాలమ్మ.

అక్కడ సేరిన అంతా కూడబలుక్కున్నారు, సాలమ్మనీ, ఆళ్ళ అత్తనీ కూసోబెట్టి నెమ్మదిగ సెప్పారు.

" సూడండి అయిందేదో అయింది, ఇట్టా ఉరేసుకున్నడని పైకి పొక్కిందా పోలీస్ కేసవుతది .. ఆళ్ళ సతాయింపూ, ఆళ్ళనాపనీకి అయ్యే కర్సూ తట్టుకోలేరు, అయినోళ్ళకి అందరికీ

కబురెట్టండి, ఏదో అట్టా నిద్దట్లోనే పోనాడని సెప్పండి .. తొరగా జరగాల్సిన తతంగం జరిపించేయండి. " పక్కింటి అయిలయ్య ఓదార్పుగా చెబుతూ, జరగాల్సినది సూచించాడు.

" అసలు ఇంతపని సెయ్యాల్సిన అవసరమేటిరా దేవుడా! " కనిపించని ఆ దేవుడిని ఉండీ ఉండీ అడుగుతూ ఏడుస్తోంది సాలమ్మ, అడుగుతూ, ఏడుస్తూ అట్టానే సొమ్మసిల్లిపోయింది.

తల్లీ, తండ్రీ ముసలివాళ్ళవడం, భార్య ఏడుస్తూ ఉండిపోడం, పిల్లలు చూస్తే చిన్నపిల్లలవడంతో ఏసే చొరవ తీసుకుని సోము తమ్ముడికీ, చెల్లెలికి ఫోన్లు చెయ్యడం, మిగతా ఏర్పాట్లు అన్నీ చూడడం మొదలుపెట్టాడు.

ఇంతలో అక్కడికి నలుగురు వచ్చారు, సోము మరణ వార్త వింటూనే నిశ్చేష్టులైపోయారు, కొంతసేపటికి తేరుకుని తమ నలుగురి దగ్గరా ఒకళ్ళకు తెలియకుండా ఒకళ్ళ దగ్గర రెండేసి లక్షలు చొప్పున చీటీ పాడి వాయిదాలు ఎగొట్టాడనీ, ఇప్పుడు గట్టిగా నిలదీసి అడిగేసరికి ఇంతపని చేసాడనీ, తమ బాకీ కొంతైనా తీర్చకుండా శవాన్ని తీసికెళ్ళనియ్యమనీ గొడవకి దిగారు .. ఆ విషయం వింటూనే సాలమ్మ కొయ్యబారిపోయింది, వద్దయ్యా అంటుంటే వినకుండా ఖరీదైన టీ.వీ, బైకూ .. అవన్నీ ఎలా వచ్చాయో అప్పుడు అర్ధమైంది. ఆరునెలల క్రితం పిల్ల పెద్దదైతే లక్ష పైనే కర్చు చేసి అంగరంగ వైభవంగా ఫంక్షన్ చేసాడు .. ఎక్కడిదయ్యా ఇంత డబ్బు అంటే ' డబ్బుదేముందే కుక్కని కొడితే రాలుద్ది ' అని నవ్వేవాడు. ఇదన్న మాట సంగతి .. గొప్పలకి పోయి తలకు మించిన అప్పులు చేసి, అవి తీర్చలేక ఉసురు తీసుకున్నాడన్న మాట. గొప్పలకి తోడు తాగుడు మహమ్మారి ఉండనే ఉంది, కోడి పందాలు, బెట్టింగ్ లూ పక్క వోయిద్దాలా ఉండనే ఉన్నాయి. ఆడు బానే సల్లంగ తప్పుకున్నాడు, ఇప్పుడీ అప్పులు తన పీకకు సుట్టుకుంటే ఏటి సెయ్యాలా, ఓ పక్క సూత్తే ముసలాళ్ళు, ఇంకో పక్క ఇద్దరు ఆడకూతుళ్ళు .. ' అంతవరకూ మొగుడు అర్ధాంతంగా పోయాడన్న ఏడుపులోంచి ఇప్పుడు కొత్త ఏడుపు బయలెల్లింది.

తమ్ముడూ, సెల్లి వచ్చినట్లున్నారు ఆటో సప్పుడుతో బాటు గొల్లున ఏడుపులు యినబడ్డాయి.

సోము తల దగ్గర సొమ్మసిల్లి కూసున్న సాలమ్మ కు వాళ్ళను చూస్తూనే మళ్ళీ దుఖం ముంచుకొచ్చింది.

'' ఎంత గోరం జరిగిపోనాది అప్పా అంటూ తోడికోడలూ, వదినమ్మా అంటూ ఆడబిడ్డ ఒక్కసారిగా సాలమ్మ మీద వాలి గొల్లుమన్నారు.

రెండు మూడు గంటల్లో ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి .. ఇక శవాన్ని లేవనెత్తుతారనగా అప్పిచ్చిన ఆసాములు నలుగురూ ' ససేమిరా ' అన్నారు. తమ బాకీల మాట తేల్చకుండా శవాన్ని కదలనిచ్చేదే లేదని మొండికేసారు.

చుట్టూ ఉన్నవాళ్ళంతా ఎంత బ్రతిమాలినా వల్లకాదు పొమ్మన్నారు. చేసేదిలేక సోము తమ్ముడు, వదినగారితో సంప్రదించి ఒకడికి బైక్, ఒకడికి టీ.వీ, మరోడికి వదిన వంటిమీదున్న పుస్తే, పూసా ముట్టచెప్పారు, నాలుగో వాడికి ఇవ్వడానికింకేం మిగల్లా ... నెల రోజులు గడువిస్తే ఏదో విధాన మీ అప్పులు తీరుస్తానని చచ్చిన మొగుడు మీద ప్రమాణం చేసి కాళ్ళావేళ్ళా బడితే మొత్తానికి అందరూ కలిసి బ్రతిమిలాడితే ఆ కార్యం చెయ్యనిచ్చేరు.

పదిరోజులూ గడచిపోయాకా మరిది ' అమ్మా, నాన్నల్ని నే తీసుకెడతా వదినా, నే చేయగలిగిన సాయం అంత వరకే, నీకు తెలియనిదేముందీ నాకూ రెక్కాడితే గాని డొక్కాడదు, పట్నంలో ఇద్దరు పిల్లలతో నాకూ రోజు గడవడమే కష్టంగుంది ' అన్నాడు.

ఏం చెప్పాలో తెలియక వెర్రిదానిలా చూసింది సాలమ్మ.

" లేదులే అయ్యా! ఇసుంటప్పుడు ఒక్కదాన్నీ వదిలేసి మేమెట్ట వస్తం, కొంచెం కుదుటపడే దాక ఈడనే కలో, గంజో తాగి కలిసే ఉంటం, దానికి మాత్రం వోరున్నారు, అమ్మా, అయ్యా .. ఉన్న ఒక్క తమ్ముడూ దేశం కాని దేశం లో ఉండే. దానికి తోడుగ మేమీడనే ఉంటం ' అన్న అత్తమ్మ మాటలకి సాలమ్మా ' అత్తమ్మా' అంటూ గొల్లుమంటూ ఆమెను అల్లుకుపోయింది.

అన్ని కార్యక్రమాలు పూర్తయి అంతా ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. ఇప్పుడు దినం గడుచుటెట్టా అన్నది సమస్య కాదు, సోము ఉన్నప్పుడైనా ఇంటిల్లిపాది కష్టం సేసేటోళ్ళు, అది అట్టనే చేస్తే తిండికి లోటుండదు .. కానీ నెల తరువాత వచ్చే అప్పులోల్లకు ఏం సమాధానమీయాల? ఎట్ట తీర్చాల .. దుఖాన్ని దిగమింగి సాలమ్మ ఆ కష్టం తీరడానికి నడుం కట్టింది. చేతులో ఉన్న విద్దె గుడ్డలుతకడం, ఇస్త్రీ సెయ్యడం ఒకటే .. దానితో లక్షల లక్షల అప్పు ఎట్టా తీర్చాల, ఎప్పటికి తీరాలా, గుండె రాయి చేసుకుని ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టా కాయితాలు బ్యాంకులో తనఖా పెట్టబోతే, అది ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు తనఖా పెట్టుకోరాదన్నారు, అయితే ఆ కాగితాలు కూడా వేరే వోళ్ళ దగ్గర కుదువబెట్టి మూడు లచ్చలు అప్పు చేసాడని తెలిసి నిలువునా నీరైపోయింది సాలమ్మ.

అందినకాడల్లా అప్పులు చేసి పైలాపచ్చీసుగా గడిపిన మొగుడు ఎదురుగా ఉంటే చంపేయాలన్నంత కోపంతో రగిలిపోయింది. రగిలిపోయినా, కుమిలిపోయినా చేసేదేంలేదని గుర్తొచ్చి ఆలోచించింది .. ఆ అప్పులనీ, వడ్డీలని మురగపెట్టి బాధపడే కంటే ఆ యింటిని కుదువపెట్టుకున్న కాడే బేరం పెట్టేసి ఆ సొమ్ముతో అప్పులన్నీ తీర్చడమే మంచిదన్న నిర్ణయానికొచ్చింది. అత్తా, మామకి చెప్పి ఒప్పించింది .. అది ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు, తాకట్టు పెట్టడానికీ, అమ్మడానికి తమకు హక్కులు లేవు, అందుకే కుదువపెట్టుకున్న ఆసామి అయినకాడకి పడేసుకుందామని చూసాడు. బ్రతిమలాటలూ, వేడుకోళ్ళూ అయ్యాకా, కిందా మీదా పడి మొత్తానికి తన అప్పు పోనూ తొమ్మిది లక్షలు చేతిలో పెట్టాడు. ఏసు సాయంతో వాళ్ళు పట్టికెళ్ళిపోయిన వస్తువుల విలువ కట్టించి, అవి పోను మిగతా సొమ్ము వాళ్ళకి చెల్లించి చేతిలో లక్ష పైచిలుకుతో రోడ్డున పడింది సాలమ్మ.

ఆలోచించింది, గుండె రాయి చేసుకుంది .. వచ్చిన కష్టాన్నీ, జరిగిన నష్టాన్నే తలుచుకుంటూ కూర్చోక తను నిలబడి, తన పిల్లలను ప్రయోజకులని చెయ్యాలని నడుం కట్టింది.

ఆ ఇల్లు ఖాళీ చేసి ఆ కాలనీలోనే ఉన్న పూరి గుడిస ఒకటి అద్దెకు తీసుకుంది, ఎప్పుడూ చేసే పనులెలాగూ ఉన్నాయి, అది కాకుండా నికరంగా ఉండే పనేదైనా చెయ్యాలనుకుంది.

ఆలోచించింది. తను వాడుకగా చేసే ఓ బ్యాంకమ్మ గారి సాయంతో ముద్రా లోను తీసుకుంది, ముందుగా ఓ లక్ష రూపాయల లోనుతో, తన దగ్గర ఉన్న లక్ష లో కొంత సొమ్ము డిపాజిట్ గా పెట్టి సెంటర్ లో ఓ చిన్న షాప్ అద్దెకు తీసుకుంది, తెలుసున్న నలుగురూ మాట సాయం చేసారు, ఆ షాప్ ఓనర్ ని ఒప్పించి అది కొంచెం తక్కువ అద్దెతో ఆమెకు ఇప్పించారు. తన కష్టాన్ని నమ్ముకుని, పదిమందితో మంచిగా ఉంటూ కొత్త జీవితం మొదలు పెట్టింది. ఆ ఏడాది చదువు అయినాకా పిల్లలిద్దరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించింది, అత్త, మామల సాయంతో కష్టాల కెదురీత మొదలు పెట్టింది, తిన్నా తినకపోయినా నెల తిరిగేసరికల్లా బ్యాంక్ వాయిదా కట్టేసే సాలమ్మ అంటే ఇప్పుడు నమ్మకానికి ప్రతిరూపం.

ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న ఎన్నో పథకాలనూ, అవకాశాలను తెలునుకోకుండా, వాటి కోసం ప్రయత్నించకుండా వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాలలో చిక్కుకోవడం, లేదా అందుకున్న అవకాశాలను దుర్వినియోగం చేసుకుని, బ్యాంకులను మోసగించి లోనులు తిరిగి చెల్లించక నమ్మకాన్నీ , అవకాశాలనూ కోల్పోయి చేజేతులా జీవితాలనూ, బ్రతుకు తెరువునూ పాడుచేసుకునే బుద్ధి హీనులు చరిత్ర హీనులుగాక తప్పదు. అడ్డతోవలో ఈజీ మనీకి అలవాటుపడీ, ఆశపడీ జీవితాలను దుర్భరం చేసుకుంటున్న వాళ్ళెందరో.

కాస్తంత నిబద్ధతా, ముందుచూపూ, చక్కటి ప్రణాలికా ఉంటే ఇప్పుడు బ్రతకడానికి ఎన్ని అవకాశాలున్నాయి, వెనక బడిన వర్గాల మీద ప్రేమతో కాకున్నా, కనీసం వారి వోట్ల కోసమన్నా ఎన్నో కొన్ని పథకాలు పెట్టి వాళ్ళ ఉన్నతికి ఎంతో కొంత సాయం చేస్తున్న ప్రభుత్వ సాయాన్ని సరిగా ఉపయోగించుకోక, సగం తెలియనితనంతో, సగం బాధ్యతారాహిత్యంతో, పెట్టలేని పరుగులుపెట్టి ఇలా అర్ధాంతంగా జీవితాలను ముగించుకుని తన కుటుంబాలను నడి సముద్రంలో నావలా వదిలేస్తున్న సోము లెంతమందో ఉన్నా, కష్టాన్ని దిగమింగుకుని ఇలా అస్థవ్యస్థమైన జీవితాన్ని చక్కదిద్దుకునే సాలమ్మలు మాత్రం అరుదుగా ఉంటారు

♦♦♦

రెండేళ్ళు గడిచాయి .. పెద్దపిల్ల కాలేజ్ చదువుకొచ్చింది, రెండోది పదో తరగతికి వచ్చింది, పిల్లలిద్దరూ తల్లి కష్టాన్ని అర్థం చేసుకుని చేదోడు, వాదోడుగా ఉండడమే కాక చదువుల్లో కూడా రాణిస్తున్నారు. అత్త లచ్చుమమ్మ అనారోగ్యంతో మంచం పట్టింది, మామ ఇంక రేపో మాపో అన్నట్టే ఉన్నాడు. కొడుకు తెలివితక్కువగా పెద్ద పరుగులకు పోయి అప్పులు చేసి, అవి తీర్చలేక పిరికితనంతో జీవితం చాలించుకున్నా, కోడలు మనో నిబ్బరంతో .. సమస్యలతోనూ, కాలంతోనూ సవాలు చేసి ఎదురీది నిలబడడం వాళ్ళకెంతైనా ఆనందాన్నిచ్చింది. ఎప్పుడూ అనుకునేవారు, అలా చెప్పా పెట్టకుండా పిరికిగా ఆత్మహత్య చేసుకునే బదులు ఇదీ సమస్య అని ఇంట్లో వాళ్ళతో చర్చించి .. ఏదో రకంగా ఆ సమస్యని అధిగమిస్తే, ఈనాడు కోడలు ఒంటరి పోరాటం చేసే అగత్యం ఉండకపోను. అదే ఆడదానికీ, మగవాడికీ ఉన్న తేడా .. చిన్నపాటి కష్టం వస్తే కుటుంబాన్ని గాలికొదిలేసి తను మాత్రం చచ్చి బ్రతికిపోతాడు మగాడు, అదే ఆడది మాత్రం తన పిల్లలకోసం అన్ని కష్టాలకూ ఎదురీది, దుఖా:న్ని దిగమింగి వాళ్ళను పెంచి పెద్ద చేస్తుంది. కాలం ఎవరి కోసం ఆగదు, ఎవరి కష్ట నష్టాలతో దానికి పనిలేదు, అవిరామంగా కాలచక్రం తిరుగుతూనే ఉంటుంది. మరో రెండేళ్ళు గడిచాయి, ఒకరి

## నివాళి

# రేడియో వెంకట్రామయ్య మృతి



సుప్రసిద్ధ రచయిత, సీనియర్ పాత్రికేయులు డి.వెంకట్రామయ్య జనవరి 13న హైదరాబాద్‌లో గుండెపోటుతో మరణించారు. ఆయన సుదీర్ఘకాలం ఆలిండియా రేడియోలో పనిచేశారు. వార్తలు చదువుతున్నది డి.వెంకట్రామయ్య... అనగానే చెవులు రేడియోకి అప్పగించి వినేవారు శ్రోతలు.. అప్పట్లో ఆయన వ్యాఖ్యానం పట్ల అంత అనురక్తి కలిగి ఉండేవారు. ప్రయోజనకరమైన ఇతివృత్తం, పదునైన భాష, అరుదైన శిల్పం – ఈ మూడూ సమపాళ్లలో కలగలిపితే డి.వెంక ట్రామయ్య కథలౌతాయి. ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో ఆయన పేరున్న రచయిత. తప్పనిసరిగా పేర్కొనవలసిన రచయిత. కథ రాసినా, నవల రాసినా, రేడియో నాటకం రాసినా ఆయన శైలి ప్రత్యేకం. ఆయన శిల్పం ఆకర్షణీయం. ఆయన లక్ష్యం సామాన్యుల సంక్షేమం, సామాజిక పురోగమనం. దాదాపు మూడు దశాబ్దాల సాహితీ వ్యాసంగంలో సుమారు 70 కథలు, రెండు నవలలు, 200 పైగా రేడియో నాటికలు రచించారు. 'పంతులమ్మ' సినిమా కథ ఆయనదే, చాలా వ్యాసాలు, కొన్ని సమీక్షలు, మరికొన్ని పీఠికలు, హిందీ నుంచి అనువదించిన మూడు నవలలు, పాతిక కథలు, ఇవన్నీ రచయితగా వెంకట్రామయ్య బహుముఖ ప్రతిభకి ప్రబల నిదర్శనాలు. 1941లో కృష్ణాజిల్లా దొండపాడు గ్రామంలో రైతు కుటుంబంలో పుట్టిన డి. వెంకట్రామయ్య ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో 33 ఏళ్లకు పైగా అనౌన్సర్‌గా, న్యూస్ రీడర్‌గా పనిచేశారు. ♦

వెంట ఒకరుగా సాలమ్మ అత్తా, మామా కాలగర్భంలో కలిసిపోయారు.

సాలమ్మ మంచితనం, నిబద్ధతా, కష్టించే తత్వం చూసిన బ్యాంక్ అమ్మగారు సాలమ్మకు మరో మంచి సలహా ఇచ్చింది, దాదాపుగా ఆ లోను అయిపోవచ్చింది కనుక ఎటువంటి హామీలు, తనఖాలు అక్కర లేకుండా స్త్రీలకు స్వయం ప్రతిపత్తిని కలిగించే 'స్టాండప్ ఇండియా ' లోను పదిలక్షలకు తను బ్యాంకులో చెప్పి ఇప్పిస్తాననీ, చిన్నపాటి రెడీమేడ్ బట్టల వ్యాపారమో, చీరల వ్యాపారమో చేసి ఒక మెట్టు పైకి ఎక్కమన్న ఆమె మాటలు సాలమ్మలో నూతనోత్సాహన్ని నింపాయి.

" మామూలు చీరల వ్యాపారం ఇప్పుడు సానామందే సేత్తన్నారమ్మా, నాకు సరదా ఉండి మగ్గం వర్క్ సెయ్యడం నేర్చా, అదయితే మంచిదేమో అన్న సాలమ్మ లో మంచి వ్యాపార దక్షత కనబడింది ఆ బ్యాంక్ అమ్మగారికి.

" అవును, అదే మంచిది .. నీ డ్రై క్లీనింగ్ షాప్ పక్క షాప్ ఖాళీ చేస్తున్నారట, మొన్ననే ఎవరో అంటుంటే విన్నా, అది తీసుకో, ఎటూ నీ షాప్ ఈ ఏరియాలో అందరికీ బాగా తెలిసింది కనుక .. ఆ వ్యాపారం కూడా త్వరగానే పుంజుకుంటుంది ' అంటూ ఉత్సాహపరచడమే కాదు, బ్యాంక్ వాళ్ళతో మాట్లాడి త్వరగా ఆ లోను మంజూరు చేయించింది.

ఇప్పుడు సాలమ్మ తను ఎదగడమే కాదు రెండు షాపుల్లో చెరో ఇద్దరికీ జీవనోపాధి కల్పించింది. పిల్లలిద్దరూ బాగా చదువుకుని, ప్రభుత్వం అందించిన చేయూతను సక్రమంగా సద్వినియోగపరచుకుని నిజమైన చదువులు చదివిన ఎవరైనా వాళ్ళకూ వాళ్ళు మాత్రమే కాక సమాజానికి కూడా మార్గదర్శకమౌతారన్న మాట నిజం చేస్తూ ఇద్దరూ సివిల్స్ కి సెలెక్ట్ అయ్యారు. తమ చదువులు తమకు మాత్రమే కాకుండా సమాజానికి కూడా ఉపయోగపడాలంటే తప్పకుండా బాధ్యతగల ప్రభుత్వ అధికారులు కావాలన్నది వారికి చిన్ననాటే నూరిపోసింది మాత్రం ఆ అమ్మ గారే.

సాలమ్మ కష్టంలో, సుఖంలో తోడూ, నీడగా ఉండి దిశానిర్దేశం చేసిన ఆమె సాలమ్మకు మాత్రం దేవతే.

" నే చేసినదేముందీ కేవలం మాట సాయం, కష్టం నువ్వు పడ్డావు, దాని ఫలితం అందుకున్నావు "

అంటూ గలగలా నవ్వేస్తుంది ఆవిడ.

తప్పటడుగులు వేసినా, తప్పుటడుగులు వేసినా పడిన చోటే పడి ఉండకుండా లేచి నిలబడే ప్రయత్నం, సరిదిద్దుకునే ప్రయత్నవే ఏ మనిషైనా చెయ్యాల్సినది, ఫలితం అందుకోవడంలో కాస్త సమయం అటూ ఇటూ అవ్వచ్చు, కానీ సత్ఫలితం మాత్రం పక్కా. అదే జీవిత సాఫల్యం. ♦

# అనుబంధాలు ఆత్మీయతలు

- దారల విజయ కుమారి
9177192275

వస్తు వ్యామోహాలు పురోగమిస్తుంటే
నిర్వీర్యమైపోతూన్న.. ఆ నిగూఢమైన ప్రేమలు
చర్చలకు పెట్టేందుకవి సిద్దాంతాలు కావు
తరచితరచి చూసేందుకో
అమలు పరిచేందుకో.. అవి ప్రణాళికలు కావు
హద్దులు.. పద్దుల.. లాభనష్టాలు.. లావాదేవీల
వ్యాపారాలు కావు.. అనుబంధాలవి!
అనుబంధాల అరుదైన ముఖాలను
గుర్తుంచుకోకుండా..
గుర్తుచిక్కకుండా అలసిపోతున్నా రెందుకో
పగలు రాత్రి.. పొద్దుల అవగాహనలో
పరిణతి కోల్పోతూ బతికేస్తూ..
జీవన సంక్షోభాలలో
దగ్గరితనాలన్నీ.. ధ్వంసం కాబడుతూ..
ఎంతకాలమని ఈ పెనుగులాటలూ..
తప్పుకుని తిరగడాలు
మనసులుంటే..
గువ్వల్లా గుసగుసలాడాలి కద
మనుషులైతే
అనుబంధాల తేనె చుట్టూ గుమికూడాలి కద
తల భారమంటే చాలు
తత్తరబిత్తరై.. తండోపతండాలుగా తరలి వచ్చే
తరాజుకు చిక్కని ఆత్మీయతలు కదా అవి
కాలమెలాగూ కదలి పోతునే ఉంది



ఇపుడు... తాను మనిషో యంత్రమో
తేల్చుకోవాలి
మూసిన మమకారాల పిడికిలి వైపు
కూసింత కుతూహలాన్ని కూడేసుకుంటూ
పసిహృదయాలై చప్పట్లుకొట్టేలా
సతమతమౌతూన్న సమయాలను
అనుబంధాల ఆత్మీయ ఒడిలో వేసి
విశ్రమింపచేయాలి
బుల్లి బుల్లి సంతోషాల పక్షులకు
నిజాయితీల నూకలేసుకుని పెంచుకోవాలి
పడాలి.. వెతకాలి.. వీలుచూసుకోవాలి
ఒప్పించాలి.. మెప్పించాలి.. మోకరిల్లాలి
జానెడు బంధం నిలుపుకుందుకు
సోలిపోతున్నా.. అడుగులు తేలిపోతున్నా..
చితిదాకా కలసే నడవాలి ♦

---

# ప్రశ్న

- డా.యస్.సత్యప్రసాద్
9440544675

నా లోనికి నేను..
ఓసారి తొంగిచూశా
నన్ను నేను తెలుసుకోవాలని
ఓ ప్రయత్నం చేశా


మాటల్ని నమ్ముకునే కంటే
మాటల్ని అమ్ముకుంటే గానీ
గెలవలేని ఈ లోకంలో
యంత్రంలా బ్రతుకుతున్నా

పోగొట్టుకున్నదేదో తెలియక
కావల్సిందేదో అర్థంకాక
విచిత్రంగా వెతుక్కుంటున్నా

పండు వెన్నెలచూసినా
పిల్లతెమ్మెర సోకినా
స్పందించడం మానేసి
చాలా కాలమయ్యింది



అసలునాకు..
హృదయముందనే విషయమే
మర్చిపోయా
నాకునేనే..
అంతుపట్టని ప్రశ్నగా మిగిలిపోయా ♦




# రెక్కల సృష్టికర్త సుగంబాబుతో....

- టేకుమళ్ళ వెంకటప్పయ్య
9490400858

■ ***సుగంబాబుగారు నమస్కారం. లఘు కవితా ప్రక్రియల గురించి ముచ్చటించబోయే ముందుగా మీ సాహిత్య ప్రస్థానం ఎలా ఆరంభమైంది. అప్పట్లో సాహిత్య వాతావరణం ఎలా ఉండేది ఆ వివరాలు చెప్పండి.***

■ నా బాల్యం గుంటూరుజిల్లా తాడికొండ గ్రామంలో జరిగింది. గ్రామాల్లో సాహిత్య వాతావరణం ఏముంటుంది? మా నాన్న సాహిత్య ప్రియుడు కావడంవల్ల 14 సంవత్సరాల వయసులో నన్ను అక్కడి గ్రామ గ్రంథాలయంలో సభ్యుడిగా చేర్పించాడు. ఆ రోజుల్లో ఎక్కువ రష్యన్ సాహిత్యం చదివేవాడిని. ఆ రోజుల్లోనే నా ఊహలు మొదలయ్యాయి. ఆ రోజుల్లో ప్రజానాట్యమండలి కళాకారులు ఊళ్ళలో పర్యటిస్తూ అభ్యుదయ గీతాలు, బుర్రకథలు, పాటలు గానం చేస్తూ డప్పుపై వినిపించేవారు. అవన్నీ వింటూ ఉండడం వలన నాకు కూడా శ్రీశ్రీలా గేయాలు, కృష్ణశాస్త్రిలా గీతాలు, నండూరిలా ఎంకిపాటలు రాయాలన్న తలంపు కలిగింది. మాకు హైస్కూల్లో సీనియర్ ధనేకుల వెంకటేశ్వరరావు. ఆయనకు కొంత సాహిత్యం పరిచయముంది. అలాంటి సాహిత్య వాతావరణంలో చిన్న వయసులోనే కవిత్వంపై మోజు పెంచుకున్నాను.

■ ***సరే! ఇక పైగంబరకవిత్వం విషయానికొద్దాం. "పైగంబర" అంటే ముస్లిం యతి అని కదా అర్థం. ఈ పేరు ఎందుకు పెట్టాల్సి వచ్చింది?***

■ పైగంబర అనే పదం ఎన్నుకోవడానికి కారణం దిగంబర కవులు. పైగంబర అంటే ప్రవక్త అని అర్థం చెబుతారు. ప్రవక్త అంటే ప్రబోధించేవాడు అనే అర్థం. కవి చేసేది కూడా అదే కదా! అందుకే అలా పేరు పెట్టడం జరిగింది.

■ ***పైగంబరకవులు ఆకాలంలో వచ్చిన దిగంబర కవిత్వం ఆసక్తిగా చదివేవారని విన్నాను. పైగంబర కవులు తెచ్చిన యుగసంగీతం, యుగచైతన్యం సంకలనాల గురించి చెప్పండి.***

■ దిగంబరకవులు తమ మూడవ సంకలనం విశాఖపట్టణంలో ఆవిష్కరించారన్న వార్త నన్ను ఆలోచనల్లో పడేసింది. ఇదేదో బాగుందనిపించింది. ఒక సమాన దృక్పథం, దృష్టి కలిగిన రచయితలు కలిసి పనిచేయడం నన్ను ఉత్తేజితుణ్ణి చేసింది. అంతకు మునుపు "రాత్రి" సంకలనం చూసి ఉన్నాను. వెంటనే లోకల్గా ఉన్న కవులను సంప్రదించడం మొదలెట్టాను. నేను అప్పటికే "శిలలో సెలయేరు", "విప్లవం" అనే రెండు సంపుటాలు తెచ్చినప్పటికి అక్కడి వాళ్ళలో నేను జూనియర్ను కావడంతో మొదట

ఒప్పుకున్నా తరువాత ఏవో కారణాలు చెప్పి తప్పుకున్నారు. మళ్ళీ మొదలు. ఎలా పరిచయం అయ్యాడో కాని మా "కమలాకాంత్" నాతో చేయి కలిపాడు. అతను అప్పటికే పేరుపొందిన కథా రచయిత. అప్పటి కవులకు కూడా ఏమీ తీసిపోని కవి కూడా! యిద్దరు కాకుండా కనీసం ఐదుగురు అయితే బాగుంటుందని అభిప్రాయ పడ్డాను. ఓల్గా( లలిత కుమారి), కిరణ్బాబు, దేవీప్రియ అప్పటి కాలేజీ స్టూడెంట్స్. కిరణ్బాబు పుణ్యమా అని దేవిప్రియ, దేవిప్రియ వల్ల ఓల్గా కలిశారు. ఐదుగురం జట్టు. పైగంబర కవుల తొలి సంకలనం యుగసంగీతం, రెండోది యుగచైతన్యం అనే సంకలనాలొచ్చాయి. తెలుగుసాహిత్యంలో సరిక్రొత్త ఆలోచనలు రావడానికి దోహదపడ్డాయి.

■ ***విరసం ఏర్పడడం వలన మీ పైగంబర కవిత్వం ప్రక్కకు వెళ్ళిందని ఓల్గా ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. నిజమేనా?***

■ అవును మా రెండు సంకలనాలు ఒక సంవత్సరంలో వచ్చాయి. అంతలో విరసం ఆవిర్భావం జరిగింది. ఖమ్మంలో జరిగిన తొలి విరసం మహాసభలకు ఓల్గా, నేను, కిరణ్ ముగ్గురం వెళ్ళాం.

ప్ర. లఘు కవితా ప్రక్రియల్ని "మిని" కవిత్వం అనడం ఎంతవరకు సబబు? మిని అనే ఆంగ్ల పదాన్ని కవిత్వం అనే తెలుగు పదంతో జోడించడాన్ని సమర్థిస్తారా?

జ.ఆదినుండి మిని అనే పదానికి నేను వ్యతిరేకిని. ఆ తరువాతి కాలంలో మిని కవితా పితామహుడిగా పేరుగాంచిన రావి రంగారావుతో కూడా మిని అనే పదం బాగోలేదని చెప్పాను. అది నా అభిప్రాయంగా తీసుకున్నాడంతే! మిని అనే పదాన్ని నేను విన్నంతవరకు దాశరథి ఉచ్చరించాడు. ఏదైనా ఆ క్షణంలోనే తేల్చేసే కవి దాశరథి. చిన్న రూపం కాబట్టి మిని అని ఉంటారు.

■ ***పైగంబర కవిత్వం తరువాత మీ రెక్కలు ప్రక్రియ గురించి మాట్లాడుకుందాం. రెక్కలు ఆవిర్భావ విశేషాలు చెప్పండి. ఆ ఆలోచన మీకు ఎప్పుడు వచ్చింది? ఆ పేరెందుకు ఎంచుకున్నారు?***

■ ఆనాడు అంటే 2000 సం. ప్రాంతాల్లో ఉధృతంగా సాగుతున్న వచన కవితా ప్రవాహంలో కొట్టుకుపోవడం ఇష్టపడని నేను, నన్ను నేను పునరుజ్జీవింప జేసుకోవడానికి అంతటి వ్యతిరేక వాతావరణంలో "రెక్కలు" అనే ప్రక్రియకు శ్రీకారం చుట్టాను. క్రొత్తగా రాయాలనుకున్నాను. మొదటగా చెప్పాలంటే మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంగారి "వింగ్స్ ఆఫ్ ఫైర్" పుస్తకం నన్ను విశేషంగా ఆకర్షించింది. ముఖ్యంగా వింగ్స్ అనే పదం. నా వింగ్స్ ఆలోచనలకు రెక్కలు. ఇది తత్త్వజ్ఞానికి సంబంధించినది. అలాగే నా ప్రక్రియకు మంచి గుర్తింపు వచ్చింది. అప్పట్లో దూరదర్శన్ వారు ప్రముఖ కవి, విమర్శకుడు అయిన డా. అద్దేపల్లి రామమోహనరావుతో నా ఇంటర్వ్యూ చేయించారు. ఆనాటి నుండి అద్దేపల్లి నేను సన్నిహితులమయ్యాం. ఏమాటకామాట చెప్పుకోవాలంటే నేను రెక్కలు రాసే వాణ్ణి. ఆయన సంచార కవిగా రెక్కల్ని మోశారు. రెక్కలను ఒక ప్రక్రియగా బ్రతికించినవాడు అద్దేపల్లి. దానికి ప్రపంచ ప్రాచుర్యం తెచ్చిన వాడు డేవిడ్ షుల్మాన్.

■ ***రెక్కలు ప్రక్రియ ఛందస్సు గురించి చెప్పండి.***

■ రెక్కలు ఒక నిర్మాణాత్మకం (స్ట్రక్చర్) సత్యం దీని పునాది. ఇది చాలా చిన్న నిర్మాణం. ఎలాంటి నియమ నిబంధనలు లేవు. దీని రూపం 4, 2 కలిసి 6 వాక్యాల సముదాయం. మొదటి 4 పంక్తుల్లో కవి ఏ విషయమైనా చెప్పవచ్చు. చివరి రెండు పంక్తుల్లో ఒక తాత్త్విక చింతన కలుస్తుంది. వస్తువును బట్టి ఆ విధంగ ఉంటుంది. అదే కొసమెరుపు (పంచ్) గా మెరుస్తుంది. ఒక చింతననిస్తుంది. ఒక సత్యాన్ని బహిర్గతం చేస్తుంది. ఉదాహరణగా ఒక రెక్క చెప్తాను. "వాళ్ళంతా ఎక్కడ/ అమ్మా, నాన్నా/ నా గురువులు/ ఆప్త మిత్రులు – ఇవి 4 పంక్తులు. అందులో చెప్పిన వారెవరూ ఇవాళ లేరు అది గతం. తర్వాతి రెండు పంక్తులు – "కొనసాగిన శ్వాస/ వర్తమానం" ఇది తాత్త్వికమైన ముగింపు. కాలం ఆగదని చెప్పడం.

■ ***ఆచార్య కొలకలూరి ఇనాక్ "తెలుగు సాహిత్యంలో నిబద్ధతతో బాటు, నిమగ్నత, నిబిడత కూడా ఉండాలి" అని అనేకమార్లు అనడం విన్నాను. అవన్నీ మీ రెక్కలు లో ప్రతిబింబిస్తున్నాయా?***

■ ఉన్నాయి కాబట్టే రెక్కలు ఇన్ని సంవత్సరాలు నిలిచాయి. అవి లేనివి ఎగిరిపోయాయి.

■ ***"వాక్యం రసాత్మకం కావ్యం" అన్నారు. మంచి సాహిత్యానికి ప్రధానంగా వస్తువు, ప్రక్రియ, అభివ్యక్తి, అనుభూతిరమ్యత అనే నాలుగు మూల స్థంభాలంటారు. ఈ గుణాలన్నీ రెక్కలు సాధించిందంటారా?***

■ భిన్నమైన నిర్మాణం కలదే ప్రక్రియ. మీరు ఏ ఆధునిక

## మట్టినైపోతాను

- దీప నాదెండ్ల



**తు**మ్మ ముల్లుల కొనలకి
వేలాడుతున్న మీ ముఖాల్లో
నవ్వుల చిందులు చూసి
మరణాన్ని శాసించటం నేర్చుకున్నాను
వేపాకు దోసిళ్ళ నుండి
జారుతున్నప్పటికీ
తియ్యని జీవితాన్ని ఎలా నెమరేసుకోవాలో
మీ నుండే గ్రహించాను
పొట్టు పొట్టుగా పగిలిపోతూ
సంగీతమై ప్రవహిస్తున్న
మీ శరీర భాగాలను భద్రపరుచుకునేందుకు

ఈ నగరంలో జాగా లేదు
దృశ్యాలను చూడటానికి
సహజ సంగీతాన్ని వినడానికి
ఈ నగరానికి సమయం ఎక్కడిది?
పరుగే ప్రధానమైన చోట
కాళ్లు మాత్రమే పనిచేస్తాయి
ఇక్కడున్నది జన జీవనం కాదు
యంత్రాల కారాగారాలు...

నీలో కరిగిపోవడానికి
నీలో ఇమిడిపోవడానికి
మట్టిగా మారుతున్నాను

నాలో ఇంకిపో
ఓ ముత్యపు చినుకా... ♦

ప్రక్రియనైనా చూడండి. డా.అద్దేపల్లి అభిప్రాయం ప్రకారం ఈ శతాబ్ది లో వచ్చిన తొలి సాహిత్య ప్రక్రియ రెక్కలు. ఆయన ఉద్దేశంలో నానీలు కూడా ఒక రూపమే! రెక్కలు ప్రక్రియలో సర్వ ప్రపంచం ఇమిడి ఉందన్నా విషయం విడుదలైన సంపుటాలు ఋజువు చేశాయి.

■ ***హైకూ అనే ప్రక్రియ కూడా జపాన్ జన్ తాత్త్వికతనుండి వచ్చినదే! హైకూకు రెక్కలకు ప్రధానంగా ఉన్న తేడా ఏమిటి? తాత్త్వికతను బహిర్గతం చేసే విషయంలో ఏది మెరుగైన ప్రక్రియ?***

■ హైకూకు, రెక్కలకు చాలా తేడా ఉంది. ప్రకృతిలో మమేకమై చెబుతాడు హైకు కవి. వర్తమానంలో వివిధ కోణాలను విపులీకరించడానికి, ఒక లోతైన ఆలోచన జోడించడానికి కృషి చేస్తాడు రెక్కల కవి. ఆ ఆలోచనలకు ఆధారంగా ఒక సార్వజనీన సత్యముంటుంది.

■ ***నేడు అనేక లఘురూపకవిత్వా ప్రక్రియలు పుంఖాను పుంఖాలుగా పుట్టుకొస్తున్నాయి. ఏ సాంఘిక మాధ్యమం చూసినా కవిత్వం తాండవిస్తోంది. వాటి గురించి చెప్పండి.***

■ నేను ఫేస్బుక్ సభ్యుడినయ్యాక అందులో వస్తున్న కవిత్వం పెద్దగా నన్ను ఆకట్టుకోలేదు. కవి సంగమం ఇత్యాది సంస్థల్లో ఈ తరానికి చెందిన అనేక మంది కవులున్నా, బాగా పరిశీలించి చూస్తే, వారు శ్రద్ధగా రాయడం లేదనిపించింది. ఇక లఘురూప కవిత్వ ప్రక్రియల పరిస్థితి అసలు బాగోలేదు. రాయడానికి చాలామందే రాస్తున్నా ఒక లక్ష్యం లేని కవిత్వం లా అనిపించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రజా ప్రభుత్వాలొచ్చాక నేను వచన కవిత్వాన్ని దాదాపు విస్మరించాను. కారణం ప్రజా సమస్యలపై కవులు రాయగలిగేది ఏమీ ఉండదని నా నమ్మకం. అందుచేత లఘురూప కవిత్వం రాసే కవులకు ఒక వేదిక ఏర్పాటు చేయడం వలన అందరూ ఒక మాట పైకి వచ్చే అవకాశం ఉందని, అందువల్ల కవిత్వ స్థాయి పెరుగుతుందని, లఘు కవిత్వానికి ఒక గుర్తింపు లభిస్తుందని, లభించాలని ఆశపడ్డాను. లఘురూప కవితావేదికలు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్లలో విడి విడిగా విభాగాలు ఏర్పాటు చేశాను.

■ ***లఘురూప కవితావేదిక భవిష్యత్తు చెప్పండి.***


■ ఏర్పాటు చేసి ఇంకా సంవత్సరం కూడా కాలేదు. పురోగతి బాగానే ఉంది. ఏ.పి.వేదిక అధ్యక్షుడు బి.ఎ.వి. వర్మ "రవ్వలు" అనే ప్రక్రియ, తెలంగాణా వేదిక అధ్యక్షులు నూతక్కి రాఘవేంద్ర రావు "ఉల్కలు" అనే ప్రక్రియ రూపొందించారు. ఉత్తమ లఘురూప కవిత్వం రాసిన ఆరుగురికి ఇటీవల నగదు బహుమతులిచ్చి ప్రోత్సహించాం.

■ ***చివరిగా ఒక్క ప్రశ్న. ఈ లఘురూప కవిత్వం నాలుగు కాలాలపాటు నిలుస్తుందంటారా?***

■ నాలుగు కాలాలేమిటి? నిలిచేదే అది. త్వరలోనే మా వేదిక ప్రచురించే కవుల సంకలనం రాబోతున్నది. కచ్చితంగా ఈ సంకలనం భవిష్యత్తులో కలంపట్టే కవులకు దిశానిర్దేశం చేస్తుందని ప్రగాఢంగా నమ్ముతున్నాను. ముఖ్యవిషయం ఏమిటంటే.....లఘు కవిత్వంలో ప్రయోగాలు రాబోతున్నాయి. ఇది కవిత్వ విస్తృతికి తోడ్పడుతుందని సాహిత్యంలో ఒక క్రొత్తదనాన్ని ప్రవేశపెడతాయని భావిస్తున్నాను. ♦

నివాళి

## ప్రముఖ రచయిత హనుమారెడ్డి కన్నుమూత



ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖ రచయిత బి. హనుమారెడ్డి జనవరి 19న తుదిశ్వాస విడిచారు. పల్లెకు దండం పెడతా, గుజ్జనగూళ్ళు, పావని తదితర వచన కవిత్వ సంపుటాలు, మహిళ, విద్యార్థి భారత రాజ్యాంగం, రెడ్డి రాజుల వైభవం తదితర పుస్తకాలు రాశారు. 'అంతర్వాహిని' పేరిట జీవిత చరిత్ర రాసుకున్నారు. తెలుగు భాషా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలుగును ప్రాథమిక విద్య నుండి రద్దుచేయడాన్ని తీవ్రంగా నిరసించారు. ఇటీవల మాతృభాషా మాధ్యమ వేదిక ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్నారు. న్యాయవాది వృత్తి నుండి తెలుగు సాహిత్యంవైపు దృష్టి మళ్ళించిన బి. హనుమారెడ్డి ప్రకాశం జిల్లా రచయితల సంఘానికి సారథ్యం వహించి నిరంతరం సభలు నిర్వహించారు. జనవరి 17,18, 19 తేదీలలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం మహాసభల నిర్వహణ సమయంలోనే తీవ్రమైన గుండెపోటుకు గురై హఠాత్తుగా కన్నుమూశారు. ♦

## బాల"కష్టమ్మ"

- పుట్టి గిరిధర్
9491493170



*ఎక్కడ చెత్త కనబడినా ఊడ్చిపారేస్తుంది*
*తన పేదరికాన్ని మాత్రం*
*ఊడ్చేయలేకపోతుంది,*
*కనుచూపుమేరలో శుభ్రతను పాటిస్తుంది*
*తన ఇంట్లో మాత్రం చిందరవందర,*
*ఇంట్లో శుభ్రత పాటిస్తే*
*ఇల్లంతా ఖాళీ ఔతుందేమో!*

*రోజంతా వెన్నును విల్లులా ఒంపుతూ*
*ఇంద్రధనుస్సు వెలుగును పరిసరాలకు పంచి*
*తన కర్తవ్యాన్ని నిటారుగా నిలబెడుతుంది!*
*అరవై దాటినా విరమణ ఎరుగదు*
*అలసిపోయినా చిగురించడం మానదు*
*పేదరికమే తన బలానికి మూలం!*

*ఆమె ఇంటి ముఖచిత్రం అంతా*
*ఆమె ముఖంలో కనబడుతుంది!*
*లోపల అదే ఖాళీతనపు అమావాస్య,*
*పైకిమాత్రం వెన్నెలలాంటి పలువరస!*

*కూలడానికి సిద్ధమైనా*
*చెమటతో మొలకెత్తుతుంది,*
*కుమిలిపోయినా కమ్మని నీడనిస్తుంది!*
*గుండెనిండా నవ్వుతూ*
*కడుపునిండా పలకరిస్తుంది!*
*ఆమె ఒక పనియంత్రమైనా*
*చెట్టంత ఉపకారగుణం!*

*భూచరిత్రలో శ్రమచిత్రాలు*
*రంగులచిత్రాలుగా మారిందిలేదు,*
*బాలకిష్టమ్మ చివరిదాకా*
*బాలకష్టమ్మలానే మిగిలిపోతుంది!* ♦




# వ్యవస్థను ప్రశ్నించే టీచర్ చెప్పిన కథలు

డా॥ ఎం. హరికిషన్



- జంధ్యాల రఘుబాబు
9849753298

**బా**ల సాహిత్యం పేరు వినగానే గుర్తొచ్చే వారిలో డా.హరికిషన్ ఒకరు. అవే కాక కథకుడిగా కూడా ఆయన అందరికీ పరిచయం. ముఖ పుస్తకంలో, వాట్సయాప్ లో ఆయన నిత్యం కనిపిస్తారు. టీచర్ చెప్పిన కథలు అన్న కథా సంపుటి ప్రజాశక్తి ముద్రణ. ఇందులో టీచర్‌కు విద్యార్థితో, వాళ్ళ తలిదండ్రులతో, సమాజంతో ఉన్న సంబంధాన్ని మనం చూస్తాం. ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారంతా ఈ కథలు చదవవలసిన అవసరముంది. ఇందులోని ఎక్కువ కథలు ఓ పదేళ్ళ ముందు రాసినవే.

ఇందులో మొదటి కథ “ఒక చల్లని మేఘం”. చదువుల కోసం పిల్లల్ని బందీల్ని చేసే తలిదండ్రులు, పెద్దవారు, సమాజం గురించి ఒక పిల్లోడు వ్యక్తం చేసే అసహ్యాన్ని కథలా మార్చారు హరికిషన్. ఉద్యోగులైన తలిదండ్రులు హరి అన్న తమ కుమారుడిని బలవంతంగా తాము మంచిదనుకున్న స్కూల్ హాస్టల్ లో వేస్తారు. ఉపాధ్యాయులను, హాస్టల్ వార్డెన్‌ను చూసిన “ఆ కళ్ళలో కోపం, అసహ్యం, కసి, నిర్లక్ష్యం ఉట్టిపడేవి” అంటారు రచయిత. తానెప్పుడూ కలలు కనే ఓ కొత్తలోకం చూసొచ్చానని, అక్కడికి రెక్కలతో ఎగిరిపోవాలని, ఇంతకుముందు తయారుచేసిన రెక్కల్ని అమ్మ, నాన్న కాల్చేశారని హరి తన ఏకైక మిత్రుడు మురళితో చెబుతాడు. హాస్టల్‌లో కూడా రకరకాల పక్షుల ఈకలతో రెక్కలు తయారు చేసి ఉంచాడు, వాటిని మురళికి చూపిస్తాడు కూడా. ఆ రెక్కలు కట్టుకొని హాస్టల్ డాబా పైనుండి ఎగిరిన హరి మిత్రుడి ముందే చీకటిలో కలిసిపోతాడు. అది కథ. ఈ కథ మనల్ని వెంటాడుతుంది. ఆ కొత్తలోకం గురించి హరి చెబుతూ “అక్కడ నాన్నల్లేరు,అమ్మల్లేరు. టీచర్లు లేరు. భోజనం గంటల్లేవు. ప్రార్థన పిలుపుల్లేవు. బలవంతపు చదువుల్లేవు... బూట్లు లేవు. టక్కుల్లేవు. టైలు లేవు. అరుపులు, తిట్లు, తన్నులు అస్సల్లేవు. మనకోసం మనలాంటి బాలలకోసం దేవుడెంతో శ్రమించీ, శ్రమించీ సృష్టించిన లోకమది” అని పిల్లాడి మాటల్ని రచయిత హృద్యంగా చెబుతారు.

ఈ సంపుటిలోని చివరి కథ బంగారం. ఇందులో జ్యోతి అనే విధ్యార్థిని, సారు మధ్య ఉన్న తండ్రి కూతుర్ల ప్రేమని చక్కగా చెప్పారు హరికిషన్. బాలికల చదువులు, పంటలు బాగా పండిన కాలంలో కోతలకు వెళ్ళే అమ్మాయిలు, బాల్య వివాహాలకు బలైపోయే జ్యోతి లాంటి వారి గురించిన ఈ కథ కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో నిత్యం కనిపించే ఒక గాథ. చిన్న వయసులోనే రెండు సార్లు అబార్షన్ జరిగి మూడవసారి కాంపులో ప్రాణాలు కోల్పోయిన జ్యోతి కథ కన్నీరు పెట్టిస్తుంది. ఆ అమ్మాయికి పుట్టిన కూతురు అచ్చం జ్యోతిలాగే ఉందని సారు అనుకోవడం కథకు ఓ కన్నీటి ముగింపు. ఇది సంపుటిలో మొదట ఉండాల్సిన కథ

అనిపిస్తుంది. ఇందులో ఉన్న పద్నాలుగు కథలు అలానే తోస్తాయి.

"ఫారం కోళ్ళు" కథ ప్రయివేటు స్కూళ్ళ బండారం బయట పెడుతుంది. ఇది కథలా కాకుండా, వాస్తవాల్ని బయటపెట్టినట్టుగా ఉంటుంది. ఐనా రచయిత కథావరణాన్ని సృష్టించి నడిపిస్తాడు. పిల్లాడు కాన్వెంటు బడికి పోకుండ సంబంధంలేని కారణాలు చెబుతున్నాడని తండ్రి అంటుంటే నోటుపుస్తకాలు నీవు బయట తెచ్చినప్పటినుండి స్కూల్లో నాకు కష్టాలు మొదలైనాయని, ఒక టీచరమ్మ వేధిస్తోందని చెబితే కరెస్పాండెంటు దగ్గరికి పోతాడు తండ్రి. సరిగ్గా అప్పుడె కరెస్పాండెంటు దగ్గరికి ఆయన చిన్ననాటి మిత్రుడు కోళ్ళ ఫారం వ్యాపారం చేస్తూ అందులో నష్టాలొస్తున్నాయని, స్కూలు పెడితే ఎలా ఉంటుంది, నీవు ఈ వ్యాపారంలో చాలా రోజులనుండి ఉన్నావు కదా అన్న ప్రశ్నలకు ఈ స్కూలు వ్యాపారం కూడా కోళ్ళ ఫారం లాంటిదేనని అందులో ఉన్న వ్యాపారపరమైన అంశాల్ని మొత్తంగా చెబుతాడు కరెస్పాండెంటు. కార్పోరేటు ఆసుపత్రులను, కార్పోరేటు బడులను పోలుస్తూ చెబుతాడు రచయిత. "కాన్సెప్టా...మన్నా...ఇప్పుడది లేటెస్ట్ స్టైల్ ... అంతే కాన్సెప్ట్ లేకపోవడం కూడా ఒక కాన్సెప్టే" అంటాడు. స్కూలుకి వచ్చిన కుర్రాడి తండ్రితో వాడిపై లేనిపోనివి చెప్పి కావలిస్తే స్కూలు మారమంటాడు. అతను పోయాక ఎందుకిలా చెప్పావంటే "కోళ్ళ ఫారంలో ఒక కోడికి తెగులొచ్చిందనుకో... అది మిగతాదాండ్లని అంటుకోకముందే నువ్వేం చేస్తావు... ఇదీ అంతే...అర్థమైందా" అనడంతో కథ ముగుస్తుంది.

"ఒక్క కథ"లో పిల్లలకు కథలు చెబుతున్న టీచరమ్మను "ఏమ్మా... క్లాసులో పాఠాలు చెప్పమంటే కథలూ, కాకరకాయలూ చెబుతూ పిల్లలని గబ్బులేపుతున్నావంట, నీకు జీతమిస్తున్నది అందుక్కాదు" అనే ప్రయివేటు స్కూలు యాజమాన్యం మాటలు వింటాం. మంచి కథలకోసం మంజు అనే ఓ విద్యార్థిని అడగడం, టీచర్లు, పెద్దలు ఎవరిని అడిగినా నెట్లో చూస్కో గ్రంథాలయానికి వెళ్ళి చదువుకో అనే మాటలే సమాధానాలుగా వస్తాయి. గ్రంథాలయంలోని పుస్తకాలు "శ్మశానంలొ వరుసగా పేర్చబడ్డ శవాల్లా కనిపించాయి" అని మంజు అనుకోవడం కథల్ని పిల్లలకు దూరం చేస్తున్న వ్యవస్థని రచయిత ప్రశ్నించినట్టుగా ఉంటుంది. పిల్లలకు కథలు చెప్పే అమ్మమ్మను నోరుమూయించే నేటి స్పీడు ప్రపంచంలో ఎక్కడో నల్లమల్ల అడవుల్లోని చెంచుగూడెంలో ఒక అవ్వ కథలు చెబుతుందని బస్సులో పోతుంటే ప్రమాదం జరిగి దయ్యంగా మారిన విద్యార్థి"ఒక్క కథ, మా అమ్మమ్మ ఊరించి ఊరించి చెబుతానన్న ఒక్క కథ... కమ్మని పూర్ణం కుడుములాంటి, కర్జికాయలాంటి ఒక్క కథ, ప్లీజ్.... మీకెవరికయినా తెలుస్తే చెప్పండి, మీ కూతురిలాంటి నాకోసం" అని కథలకోసమని చేసే అభ్యర్థన కళ్ళలో నీళ్ళు తెప్పిస్తాయి.

"తెగిన గులాబి" కథలో పనివాడైన ఓ గాసగాడి కొడుకు చదువులేక పడే బాధ, తన కులం వల్ల తమతో ఆడుకోనివ్వని, బంతిని కూడా ముట్టుకోనివ్వని వైనం చూస్తాము. ఓ పంద్రాగష్టు ముందురోజు బాగా అలంకరించిన బడిని చిందరవందర చేసి, గోడలపై బొగ్గుతో గీతలు గీసి, గులాబీ చెట్లను నాశనం చేసే పిల్లాడి కసిని చూపిస్తాడు రచయిత. అవసరాలు తీరని పిల్లలు సమాజానికి ఉపయోగపడకుండా చేసే వ్యవస్థను చూపిస్తాడు రచయిత. "యుద్ధం" కథ కార్పోరేటు కాలేజీల్లో అడ్మిషన్ల కోసం వేసే ఎత్తులు, ఉద్యోగం చేసే అధ్యాపకులను కొనడం, అవసరమనుకుంటే చంపడం చూస్తాము. "ముండ్లపొదల్లో పూలమొగ్గలు" కథలో టీవీల్లో, సినిమాల్లో చూసే హీరోయిన్లను, హీరోలను అనుకరించే పిల్లలను, ఐదో తరగతికే ప్రేమలేఖ రాసే స్థాయికి తెచ్చిన వ్యవస్థలోని లోపాల్ని చూడొచ్చు. "ఒక జ్ఞాపకం" కథలో ఇంట్లో చివరివాడుగా పుట్టి తోబుట్టువులచేతిలో, అమ్మా, నాన్న చేతిలో దెబ్బలుతినే పిల్లాడు ఇల్లువిడిచి, వేరే ఊర్లో హొటల్లో పనిచేసి, కష్టాలుపడి చివరికి ఇంటికొస్తే ఇంట్లో అందరూ మారిపోయి వాడిని బాగా చూసుకునేలా తీసుకొస్తారు కథని.

"సదవకురా చెడేవు" కథలో పల్లెలు, పట్టణాల మధ్య చదువులో తారతమ్యాలు, పరీక్షలు అనగానే ఒక యుద్ధ వాతావరణం మొదలవుతుందని చెబుతాడు రచయిత. మొదటి గంట కొట్టగానే సమరానికి సిద్ధం కమ్మన భేరీ నాదంలా ఉంటుందంటాడు. పల్లెటూరు విద్యార్థులు పడ్డ స్కూళ్ళలో చూసి చూడనట్టు పోవాలని, చింపిరి జుట్టుతో సరైన బట్టలు కూడా లేని వాళ్ళపై కొద్దిగా కరుణ చూపాలంటాడు ఒక టీచరు. కాన్వెంటు స్కూల్లో చదివినందుకే నీకు ప్రభుత్వ ఉద్యోగం దొరికిందని, కాని ఈ కంప్యూటర్ యుగంలో తెలుగు మీడియంలో చదువుకుంటే ప్యూను ఉద్యోగం కూడా దొరకదని చెబుతాడు. పరీక్ష బాగా రాస్తున్న ఒక విద్యార్థిని చూసి వీడు పరీక్ష పాసై నాశనమయ్యేటట్టున్నాడు అని ఇంకో అడిషనల్

కవిత

# మనిషి తప్పిపోయాడు

- బి. కళాగోపాల్
9441631029



*ఒక మార్మిక*
*అంతరంగ మౌన సంభాషణలో*
*కొన్ని కలల తీరాల వెనుక*
*కరుగుతున్న కన్నీటి చెలిమెలో*
*ఆశలన్నీ ఆడియాసలయ్యాక*
*మనిషి తప్పిపోయాడు..!*

*ఋతువు మారినప్పుడల్లా*
*తడిమి చూసుకునే జీవన సందర్భాలు గల్లంతై*
*తీరం చేరని ఏకాకి నౌకా గమనంలో*
*కలల బేహారిగా... ఎండమావుల తిమిరంతో సమరం*
*చేస్తూ...*
*మనిషి తప్పిపోయాడు...!*

*4-జి ఉద్యోగాల వ్యూహకేళిలో*
*నిచ్చెన దొరకని నిస్సహాయ బతుకు పందేరంలో*
*తప్పొప్పుల సుడిజడిని వీడని చక్రభ్రమణంలో*
*"మళ్ళీ కలుద్దాం" అంటూ మనిషి మాయమైపోయాడు*

*కరగని రాతివెన్నెల కౌగిలిలో*
*ఏదో ఒక ఊరట కొరకై*
*రాత్రింబవళ్ళను తిప్పుతూ మనిషి*
*నేడొక యంత్రమై పోయాడు...!*

*ఏ చిగురు స్పర్శా అంటనీయని...*
*నవ్వే దూదిపింజె మబ్బునీడ పట్టుకోలేని...*
*కమ్మని మట్టి చినుకు మాధుర్యమూ ఆస్వాదించలేని...*
*ఈ - తరం మానవుడొక రోబో...!*

*లోలోపల తొలుస్తున్న డొల్లతనాన్ని*
*ప్రశ్నించలేని మనిషీ...!*
*నిజంగానే నీవు తప్పిపోయావు!!* ♦

---

పేపరివ్వడం చూస్తాము. ఈ కథలోనే రిజర్వేషన్లు, వాటిని వాడుకొని క్రీమీ లేయర్లుగా మారిన పట్నం వాళ్ళు, పల్లెల్లో ఉన్న తమ వారినే పట్టించుకోరని రచయిత చెబుతాడు. పరీక్ష స్ట్రిక్టుగా పెట్టిన ఉపాధ్యాయుడిని గుర్రుగా చూస్తున్న విద్యార్థుల్ని చూపిస్తూ, నీవల్ల పరీక్ష తప్పిన విద్యార్థుల్ని నాశనం కాకుండా కాపాడావని మిత్రుడితో అనటంతో కథ ముగుస్తుంది.

"జొహరాపురం మొనగాడు" కథలో కబడ్డీ క్రీడాకారుడైన తండ్రి తన కొడుక్కి కూడా అదే క్రీడ నేర్పించాలన్న పట్టుదల. పిల్లోడు వినడు. ఎవరు చూసినా క్రికెట్ ఆటపైనే మోజు చూపిస్తున్నారు. ఏమీచెయలేని స్థితిలో ఆ మూడు వికెట్లు తన గుండెలో దింపినట్లున్నాయనుకుంటాడు దీనంగా. "ఒక మైనార్టీ కాలేజి కథ"లో మత మార్పిడి ద్వారా బి.ఇ.డి సీటు సంపాదించుకునేవారి గురించి, సీట్లు అమ్మేవారి గురించి చెబుతాడు రచయిత. ''మాయల మరాఠీ'' కథలో ప్రకటనలద్వారా పిల్లల చేత ఖరీదైన చాక్లెట్లు కొనిపించడం కోసం తలిదండ్రులు పడె యాతన చూడొచ్చు. మాయాజాలం కథలో కంప్యూటర్లపై మోజున్న పిల్లలు, వాటి గురించి ఎక్కువగా తెలియని తలిదండ్రులగురించి ఉంది. ఇప్పుడు సెల్లులు వచ్చి కంప్యూటర్ అవసరమే లేని పరిస్థితి. కథ కొంత పాతగా కనిపిస్తుంది. "పాలైన కారవే బంగారుకండ్ల" కథలో కర్రెన్న అనే ఓ టీచరు తాను నల్లనివాడుగా మనసులో, మనుషుల్లో చిన్నప్పుడు పడ్డ బాధలవల్ల పేరు మార్చుకునే అంశంతో నడుస్తుంది. అందరికీ విశేషణమే పేరైతే, తన పేరే విశేషణమైందన్న మాటలు బాగున్నాయి.

కథలంటే ఇష్టపడే కథకుడైన ఉపాధ్యాయుడు రాసిన ఈ కథల్లో వాస్తవాలతో పాటు కథ కనుమరుగై పోతుందన్న బాధ, పిల్లలకు కథలు చెప్పాలన్న ఆశ కనిపిస్తాయి. ఈమధ్య పిల్లల చేతనే కథలు రాయించి ముద్రిస్తున్న కొందరు ఉపాధ్యాయులు ఇలాంటివారి బాధని అర్థం చేసుకున్నట్టు కనిపిస్తుంది. అందరూ ఆ వైపు అడుగులేసేలా "టీచర్ చెప్పిన కథలు" ఉపయోగపడతాయి. కథకు మంచి కాలం వస్తుందన్న నమ్మకం కూడా కలుగుతుంది. "టీచర్ చెప్పిన కథలు" ప్రజాశక్తి బుక్ హౌస్. వెల రూ. 70/- ♦

కథ

# వరదానం



ఎ. అన్నపూర్ణ
9490295170

'ఆంటీ ఇంద్రాణీ ఫోన్ చేశారు. పెళ్ళి విషయంలో మీరు ఏం నిర్ణయం తీసుకున్నారని! ఏం చెప్పమంటావ్.... సిద్దూ నువ్వూ ఒక నిశ్చయానికి వచ్చినట్టేనా....మీరు రెండు సంవత్సరాలు టైమ్ తీసుకున్నారు. ఇక ఆలస్యం అయితే బాగుండదు... అని కూడా అన్నారు. కూతురు సుమని అడిగింది విశాల.

"మాట్లాడుకోవటానికి ఏం వుంది మమ్మీ. సిద్దూ మొదటినుంచీ ఇంట్రస్ట్ చూపిస్తున్నాడు. నాకేమో అంతా ఒకేలా వుంటారనిపిస్తోంది. వాళ్ళు మన మాట కోసం ఎదురు చూస్తూంటారని నాకూ తెల్సు. సిద్దూ నా చుట్టూ తిరుగుతూనే వున్నాడని నీకు తెలుసు." నిర్లక్ష్యంగా చెప్పింది సుమ.

"అందుకే ఓకే చెప్పేద్దాం. ముహూర్తాలు లాంఛనాలూ మాట్లాడుకుందాం అని చెబుతాను." అంది విశాల.

"అదంతా నీ ఇష్టం. నాకైతే ఇలా వుంటే నష్టం ఏమిటీ... పెళ్ళీ ఖర్చూ అంటూ మనీ ఖర్చు చేయడం అవసరమా అనిపిస్తోంది."

"అదెలా... భరద్వాజంకుల్‌కి బోలెడు ఆస్తి వుంది. అదంతా సిద్దూకే. నువ్వు వారసురాలివి కావాలంటే లీగల్‌గా పెళ్ళి రిజిస్టర్ చేయడం తప్పనిసరి... అని మామయ్య కూడా చెప్పాడు" అంది విశాల.

"అందుకే నీ ఇష్టం అంటున్నాను.' అంది సుమ.

"మీ డాడీ భరద్వాజ్ అంకుల్ చాలా కాలంగా ఫ్రెండ్స్. వాళ్ళంత వాళ్ళు నిన్ను కోడల్ని చేసుకోవాలని అడిగారు. మనం ఎలా చేసినా నోరు మెదపరు. కానీ ఈ మధ్య సిద్దూ బాబాయ్ కూతుర్ని తీసుకువచ్చి చదివిస్తున్నారు. పెళ్ళి కూడా వీళ్ళే చేస్తారని విన్నాను. దాని గురించే ఆలోచిస్తున్నా" అంది విశాల.

"అయితే ఏమైందీ. భరద్వాజకి ఆడపిల్లలు లేరు. తమ్ముణ్ణి ఆర్థికంగా ఆదుకోవడం కావచ్చు. లేదా మరోటి కావచ్చు. మనకేంటి నష్టం? అన్నాడు. మహేంద్ర అందులో ఆలోచించాల్సింది ఏముందీ అన్నట్టు స్వచ్ఛమైన మనసుతో.

"మీ మగాళ్ళకి తెలియదు వూరుకోండి. ఈవేళ చదివిస్తారు. తర్వాత భారీగా ఖర్చుచేసి పెళ్ళి చేస్తారు. ఆ తర్వాత ఆస్తిలో వాటా ఇస్తారు. ఇక మన అమ్మాయికి ఏం మిగులుతుంది? మొన్న చిత్ర పుట్టిన రోజుకి కారు గిఫ్ట్ ఇచ్చారని సిద్దూ చెప్పాడు.

"భరద్వాజది స్వంత సంపాదన. తాతల నుంచి రాలేదు. అతనిష్టం. నువ్వు మరోలా ఆలోచిస్తావెందుకు? సిద్దూ బుద్ధిమంతుడు. మంచి ఉద్యోగం అదొక్కటే చాలు ఆస్తికంటే

విలువైనది" అన్నాడు మహేంద్ర.

"చాలదు. సిద్దూ ఒట్టి అమాయకుడు. వాళ్ళూ మనలాంటి మిడిల్‌క్లాస్ ఫ్యామ్లీ అయితే నేనసలు ఇంద్రాణితో పరిచయం పెంచుకొనేదాన్ని కాదు.'' అంది విశాల తన నైజాన్ని బయటపెట్టుకుంటూ.

"మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి. 'నాకు తోబుట్టువులు లేరనే మీ నాన్న నాతో నీ పెళ్ళి జరిపించాడు. కానీ ప్రతీ మనిషికి తల్లీ తండ్రీ వుంటారని మర్చిపోయాడు కాబోలు...' అని మనసులో విసుక్కుని అక్కణ్ణించి లేచివెళ్ళిపోయాడు. మహేంద్రకి ఆ ఇంట్లో స్థానం అంతే! భార్య కూతుళ్ళదే ఇష్టం. అతను మంచిగా చెబితే వాళ్ళకి నచ్చదు.

అదే సమయంలో భరద్వాజ ఇంద్రాణి కూడా సిద్దూ పెళ్ళి గురించి మాట్లాడుకున్నారు.

"మన సిద్దూ నాలుగేళ్ళుగా పెళ్ళిమాట మాట్లాడితే వద్దంటూ తప్పించుకునేవాడు. అలాంటిది సుమతో పరిచయం అయ్యాక ఆ అమ్మాయిపట్ల శ్రద్ధ చూపిస్తున్నాడు. వాళ్ళిద్దరూ సఖ్యతగా వుంటే పెళ్ళి ప్రతిపాదన తీసుకురావచ్చు అనుకున్నాం. ఈ కాలం పిల్లల ఇష్టాలకు విలువ ఇవ్వాలి తప్ప పెద్దల ప్రమేయం వుండటం లేదు. ఒకరో ఇద్దరో పిల్లలు వాళ్ళు మంచి ఉద్యోగాల్లో స్థిరపడటంతో పెద్దల అనుభవం గౌరవం గురించి అస్సలు ఆలోచించడంలేదు. అలా చేయవద్దంటే ఆ ఒక్కరూ దూరమైపోతారన్న భయంతో తల్లితండ్రులు అంగీకరించి సర్దుకుపోవడం చూస్తున్నాం.

అంతేకాదు అబ్బాయి అమ్మాయి ఉద్యోగరీత్యా వేరేగా ఉంటున్నారు. ప్రత్యేకించి ఫ్లాటో విల్లాయో కొంటున్నారు. స్వేచ్ఛ స్వాతంత్ర్యం అంటూ సహజీవనం చేస్తూ విదేశీ సంస్కృతికి దాసులైపోతున్నారు.

హైటెక్ యుగం అంటూ సాంప్రదాయాలకు స్వస్తి చెప్పారు. పెద్దలు కుదిర్చే వివాహాలు అరుదైపోయాయి. పెద్దలు నిస్సహాయులై నోరు మెదపలేని స్థితి. నాకు అనుమానంగా వుంది. ఒకప్పుడు సిద్దూ పెళ్ళి వద్దంటున్నాడని బాధపడ్డాను. ఇప్పుడు సిద్దూ రాత్రి కూడా ఇంటికి రావడంలేదు..... అంటే అర్థం అవుతోందిగా! ఇక పెళ్ళి విషయంలో సుమ విశాల ఇద్దరిదే నిర్ణయం. ఆ మూడు ముళ్ళూ వేయించేస్తే అదీ ఆవిడ ఒప్పుకుంటే కుదుటపడతాం'' అంటూ భర్తతో వేదన పంచుకుంది.

"అవును ఇంద్రాణీ ! నాకూ అర్థమైంది. కానీ ఏం చేయగలం చెప్పు. మనమే తొందరపెడదాం. వాళ్ళు అడిగిన రెండేళ్ళు దాటి మూడు నెలలు అయింది" అన్నాడు భరద్వాజ

ఇంద్రాణి ఫోన్ చేసేసరికి విశాల కొండెక్కి కూర్చుంది. నేను అమ్మాయి తల్లిని. దిగి రావల్సింది అబ్బాయి తల్లితండ్రులే అనే అహంతో.

"సరే మీరు తొందరపడుతున్నారు. సహజమేలెండి తర్వాత చిత్రకి కూడా పెళ్ళి చేయాల్సింది కూడా మీరేను. శనివారం డిన్నర్‌కి రండి. అన్ని విషయాలూ మాట్లాడదాం!" అంటూ చిత్ర గురించిన తన సందేహాన్ని బయటపెట్టింది.

ఈ విషయం ఇంద్రాణి గమనించకపోలేదు. అయితే తమ స్వంత విషయాలు విశాలకి చెప్పాల్సిన అవసరం లేదు. ఈలోగా తీసుకోవల్సిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిదనుకుంది. అమాయకుడైన సిద్దూ వాళ్ళతో ఇంటి విషయాలన్నీ చెప్పి వుంటాడు.... అని కూడా గ్రహించింది.

"మనం అడిగేది లేదు. వాళ్ళు ఇచ్చేదీ లేదు. మనం ఏమీ మాట్లాడొద్దు" అన్నాడు భరద్వాజ.

"అదెలా కుదురుతుంది పెదనాన్నగారూ నాకు ఆడపడుచు లాంఛనాలు ఇవ్వాలని నేను చెబుతాను. మీరు వదులుకున్నా సరే...." అంది చిత్ర గారాలుపోతూ.

"అలాగే తల్లీ. నీకు చెల్లాయ్ సుచిత్రకీ కూడా ఏం కావల్సినా ఇస్తాను" అన్నాడు భరద్వాజ నవ్వుతూ.

భరద్వాజ తమ్ముడు శాండిల్యది చిన్న ఉద్యోగం. ఇద్దరు అమ్మాయిలున్నారు. కనుక చిత్రని తన దగ్గరకు పంపమని అమ్మాయి పెళ్ళి చేసిన ఆనందం దక్కించమనీ చదివిస్తాననీ ఇంద్రాణి మరిది రమేష్ తోడికోడలు వసంతలను అడిగింది. వాళ్ళు సంతోషంగా తీసుకువచ్చారు. ఆదుకుంటున్న ఇంద్రాణి పెద్దమనసుకి కృతజ్ఞతలు చెప్పారు. ఇంద్రాణికి డబ్బుతో ఎలాంటి అహంకారం లేదు. చేతనైనంత సహాయం చేయాలన్న మంచి మనసు ఆమెది. నడమంత్రపు సిరి డబ్బు సంపాదనే ధ్యేయంగల విశాలతో చుట్టరికం తప్పలేదు పరిస్థితుల వలన. అయినా స్థయిర్యంతో చెరగని చిరుదరహాసంతో ఎదుర్కోగలదు ఇంద్రాణి.

ఈ విషయంలో భరద్వాజ అదృష్టవంతుడే... అనుకుంటాడు మహేంద్ర. అతడితో స్నేహబంధం గర్వంగానూ భావిస్తాడు. స్నేహానికి చదువు అంతస్థు కొలమానం కావు. అభిప్రాయాలు ఆశయాలు ఆలోచన్లు ఒక్కటి కావడమే కారణం. అందుకే వారిమధ్య అరమరికలు లేవు. కాని కుటుంబ

సభ్యుల దృక్పథం వేరు కనుక మహేంద్ర భార్యను కూతుర్ని వారి మానాన వార్ని విడిచి పెట్టి భరద్వాజతో బంధాన్ని కొనసాగిస్తున్నాడు. సిద్ధూని అల్లుడిగా ఆదరిస్తాడు. అతని తండ్రిగా భరద్వాజను గౌరవిస్తాడు. ఇందులో ఎప్పటికీ మార్పురాదు.

ఆ రోజు భరద్వాజ కుటుంబం మహేంద్ర ఇంటికి వెళ్ళారు. అప్పటివరకూ చిత్ర వాళ్ళిల్లు చూడలేదు. చనువుగా ఇల్లంతా తిరిగి చూసింది. మా వదిన ఇల్లేగా అని స్వతంత్రంగా... ఆ టైమ్‌లో సిద్ధూ సుమ లేరు. వారం రోజుల వర్క్‌ట్రిప్‌కి లండన్ వెళ్ళారు.

"మా పురోహితులు వశిష్ఠగారిని కూడా పిలిపించాను. మనం చేయాల్సిన ఏర్పాట్లు లిస్ట్ రాసి ఇస్తారు" అంది విశాల.

"అలాగే కానివ్వండి. మీ ఇష్టప్రకారమే జరిపించండి. మీ మా తేడా లేదు" అంది ఇంద్రాణి.

''ఆంటీ.. మా పెద్దమ్మ మర్చిపోయింది. నాకు ఆడపడుచుగా ఏమిస్తారో అని అడగటం. ఆ విషయం చెప్పండి'' అంది స్టయిల్‌గా కాలుమీద కాలు వేసుకుని మహేంద్ర పక్కన కూర్చున్నప్పుడు.

మహేంద్ర కూడా చిత్రను అభిమానంగా ముద్దు చేస్తాడు. అందుకే ఆయన పక్కన చేరింది చిత్ర.

విశాలకి అది నచ్చదు. అయినా చేసేది లేక మొహాన నవ్వు తెచ్చుకుని ''అబ్బో మా చిత్రగారు అడగటం కాదనటమూనా! సిద్దూకి నువ్వెంత దగ్గిరో మా సుమకీ అంతే! ఆడపడుచంటే తక్కువా మరి అల్లుడి కంటే ఎక్కువ" అంది.

మా చిత్ర ఒట్టి చిలిపి పిల్ల. ఏదో సరదాగా అంటోంది విశాలా. మీరు సీరియస్‌గా తీసుకోకండి" అంది ఇంద్రాణి.

"ఆ సరదాలన్నీ ఇప్పుడేలెండి. ఆ తర్వాత ఏముంటాయ్. ఫర్వాలేదు.

అడగనీయండి ఏం అడుగుతుందో...." అంటూ విశాల కూడా ప్రోత్సహించింది.

"ఆంటీ... నాకో బంగారు నెక్లెస్, పట్టుచీర, వెండి బిందె మా పెద్దమ్మతో బాటు ఇవ్వాలి." అంది చిత్ర.

"ఓస్. ఇంతే కద. మీ పెదనాన్న గారి స్టేటస్‌కి డైమండ్ నెక్లెస్ అడుగుతావని అనుకున్నాను".

"ఆ ఛాన్స్ మీకే వదిలి పెడుతున్నాను. అదే ఇవ్వండి".

"గడుసుదానివే. నా నోటితోనే చెప్పించావ్" అంటూ ఇంద్రాణీ మీరు కూడా అడగండి. మీ ముచ్చటా తీరుస్తాం" అంది ఇంద్రాణిని కూడా అడిగి.

"మీ ఇష్టం విశాలా. ముందే మీ అన్నగారు చెప్పారు కద!"

"సరే.... మీరు సుమకి గోల్డ్ కొనద్దు. అన్ని రకాలూ నేనే కొన్నవి వున్నాయి. దాని బదులు విల్లా కొనండి. వాళ్ళుండటానికి పనికి వస్తుంది." చెప్పింది విశాల.

"అది మీ అమ్మాయికి మీరు కొనుక్కోండి." మేం ఏం కొనాలో మీరు సలహా ఇవ్వడం ఏమిటని భరద్వాజ మనసులో అనుకుని, "వాళ్ళు ఎప్పుడు ఏ క్షణంలో ఊరు ఉద్యోగాలు మారుతారో మనకి తెలియదు. వాళ్ళే కొనుక్కుంటారు. మేం ఇచ్చేది ఎలాగూ ఇస్తాం" అన్నాడు.

"బాగా చెప్పారు భరద్వాజా. పిల్లలు ఈ దేశంలో వుంటారో లేదో కూడా తెలీదు" అన్నాడు మహేంద్ర.

భరద్వాజ ఎదుట విశాల భర్తని ఏమీ అన్లేక ఉరిమి చూసింది.

పురోహితుడు వశిష్ఠ కూడా వచ్చారు.

ఆయన తెచ్చిన లిస్ట్ విశాలకిచ్చాడు.

అందులో కాళ్ళు కడిగే పళ్ళెం, తాంబూలం పళ్ళెం. వెండి, పానకం బిందెలు, వెండి వాటర్ జగ్గు, నాలుగు గ్లాసులు వగైరా వున్నాయ్.

విశాలకి కళ్ళు తిరిగాయ్.

అప్పటికే సూట్లు పట్టుపంచలు పెళ్ళిభోజనాలు ఫంక్షన్ హాల్‌కి తడిసి మోపెడు అయింది. ఇవి కూడా కొంటే లక్షలు దాటి కోట్లు అవుతాయి అనుకుని పైకి తేలకుండా ఆ లిస్ట్‌ని నాలుగు మడతలు పెట్టి ఫ్లవర్‌వాజ్ కింద పెట్టింది. ఎలాంటి శ్రద్ధా చూపించకుండా.

అయితే ఇంద్రాణి వూరుకోలేదు.

"మాకేం లిస్ట్ రాసివ్వరేం వసిష్ఠులవారూ మర్చిపోయారా? లేక విశాలకిచ్చిన పేపర్‌లోనే వుందా..." అనడిగింది.

"అమ్మా ! విశాలమ్మగారు వాళ్ళు ఇవ్వాల్సినవి మాత్రమే అడిగారు" అన్నాడు ఆయన.

"అదేదో మాక్కూడా ఓ కాపీ ఇవ్వండి. మా చిత్ర పెళ్ళికి పనికి వస్తుంది అంది ఇంద్రాణి గడుసుగా.

ఆయన వెంటనే ఆయన దగ్గిరున్న మరో కాపీ ఇచ్చాడు. "ఇందులో నా ఫోన్ నం. అడ్రస్ అన్నీ వున్నాయ్. మీరు ఎప్పుడైనా ఫోన్ చెయ్యండి వచ్చేస్తాను. చిత్ర పెళ్ళి కూడా నేను చేసే అవకాశం ఇవ్వండి" అన్నాడు ముందు జాగ్రత్తగా.

"ఈ సంవత్సరంతో చదువు పూర్తవుతుంది. మా బంధువులబ్బాయ్ గురించి వాళ్ళు అడుగుతున్నారు. తప్పకుండా మిమ్మల్ని దృష్టిలో వుంచుకుంటాం. అయితే వాళ్ళు సింపుల్‌గా రిజిస్టర్ మారేజ్ చేసి పార్టీ ఇద్దాం, అదీ ముఖ్యమైన బంధువులకి అంటున్నారు. సత్యన్నారాయణవ్రతం చేద్దామని నేను అనుకుంటున్నాను" చెప్పింది ఇంద్రాణి చిత్ర పెళ్ళి విషయాలు. ముఖ్యంగా విశాలకి తెలియచేస్తూ "శుభస్యశీఘ్రుం" అంటూ దీవించాడు వసిష్ఠ.

" ఆదర్శవంతమైన నిర్ణయం ఇంద్రాణీ..." అంది విశాల తప్పనిసరిగా మెచ్చుకుంటూ.

"మా పెద్దమ్మ మనసు అలాంటిది. ఇంకా చాలా విశేషాలున్నాయ్ వినండి ఆంటీ... నన్ను కోడల్ని చేసుకోబోయే వారికి ఇద్దరు అమ్మాయిలున్నారు. వాళ్ళు చాలా పూర్ ఫ్యామ్లీ. మా అత్తమామలు ఇద్దరూ స్కూల్ టీచర్స్‌గా పనిచేస్తున్నారు. వారి ఇంటి పేరు "సరస్వతీ నిలయం". లక్ష్మీనిలయం కాదు... అబ్బో చెప్పాలంటే ఇంకా చాలా వున్నాయ్.

"చిత్రా ఇప్పుడు అవన్నీ ఎందుకమ్మా. విశాల ఆంటీకి ఇంట్రస్ట్ వుందా వినడానికి అని కూడా ఆలోచించాలి. ఆవిడ ఏ రోజైనా అడిగారా... ఆవిడ గొప్పతనం అది !" అంటూ చురక వేశాడు భరద్వాజ అటు పొగడ్తా కాకుండా ద్వేషం కాకుండా అన్నట్టు.

"విశాలా 'పెళ్ళికూతురు పెళ్ళికొడుకు చేయడం మనింట్లోనే ఇద్దరికీ ఒకేసారి! అన్నావ్. ఈ విషయం కూడా చెప్పు" అంటూ గుర్తు చేశాడు మహేంద్ర.

"అవునండీ... మర్చిపోయాను. ఇద్దర్నీ కూర్చోబెట్టి ఒకేసారి చేద్దామని నా ఆలోచన. ఏమంటారు?"

"అలాగే. మీ మాటకి తిరుగులేదు. ఆ రోజు నుంచీ సిద్ధూ మీ ఇంట్లోనే వుంటాడు. ఇకనుంచీ అన్నీ మీకు వాడే." అన్నాడు భరద్వాజ.

"ఇక నుంచీ ఏమిటీ.... రెండు సంవత్సరాలుగా సిద్ధూ వీరిలో కలిసిపోయి వాళ్ళకి సంతోషం పంచుతున్నాడు. అందరికీ తెలిసిందే" అంది ఇంద్రాణి.

వాళ్ళ సంభాషణల్లో అంతరార్థం అంతుబట్టని వసిష్ఠ..."అమ్మా మరి నేను వెళ్ళివస్తాను. మీకింకా సందేహాలుంటే మెయిల్ పంపండి. రేపటి నుంచీ నాకు ఊపిరి తీసుకోడానికి కూడా టైమ్ లేదు. రావడం కుదరదు." అన్నాడు లేచి నిలబడి.

"అవును... మీరు వీడియో పెళ్ళిళ్ళు, స్కైప్ పెళ్ళిళ్లు ఇన్‌స్ట్రాగ్రామ్ పెళ్ళిళ్ళు కూడా చేస్తారు నాకు తెల్సు. ఇంటికి వచ్చి పెళ్ళిచేయడం మా అదృష్టం. మమ్మల్ని ఒకసారి కలవాలని ఇలా వచ్చారు కానీ మీరు చాలా ఖరీదైన పురోహితులని ట్విట్టర్‌లో చూశాను" అన్నాడు భరద్వాజ.

"కాలాన్నిబట్టి మేమూను. లేకుంటే మా బిజినెస్ పడిపోతుంది" యధాప్రజ తధా బిజినెస్" కదండీ అంటూ ఆయన సెలవుతీసుకున్నాడు.

"మరి మేము కూడా వెడతాం విశాలగారూ ఉదయం నుంచీ శ్రమపడ్డారు. మీరు కూడా రెస్ట్ తీసుకోండి. మరో ముఖ్యవిషయం మొదటే చెబుతున్నా వసిష్టగారు ఇచ్చిన లిస్ట్‌లో కాళ్ళు కడుగు పళ్ళెం తాంబూలపళ్ళెం వగైరాలు ఏవీవద్దు. ఎందుకంటే.. అది సాంప్రదాయం కదా అది మాకు సంబంధించింది కదా అని మీరనద్దు. ఇద్దరికీ సంబంధించిన కార్యక్రమం కాబట్టి అసలు ఆ పద్ధతినే నేను వ్యతిరేకిస్తున్నాను. మీరు మీ అమ్మాయిని ప్రేమతో పెంచుతారు. మేమూ అంతే. ఇలా పరాయి వారికి ధారాదత్తం చేయడం అనే కాన్సెప్ట్ నాకు నచ్చలేదు. పెళ్ళయినంత మాత్రాన వేరు కారు. మీ అమ్మాయి మీ స్వంతం. మా అబ్బాయి మాత్రం మా స్వంతం కాదు. నేను చాలా కుటుంబాల్లో చూస్తున్నాను. అమ్మాయి తల్లితండ్రులదే అగ్రస్థానంగా గుర్తించాను. అందుకే చిత్రని తీసుకువచ్చి నాదగ్గిర వుంచుకోవాలనే ఆలోచన వచ్చింది. సిద్ధూ ఏనాటినుంచి మీ ఇంట్లో స్థిరపడ్డాడో అందువలన మీరెంత ఆనందపడుతున్నారో అర్థమైంది. అందువలన ఇష్టం వున్నవారు కన్యాదాన సాంప్రదాయాన్ని పాటించవచ్చు. లేదా మానుకోవచ్చు. వసిష్టులవారు చెప్పినట్టు మనకి అనుకూలంగా దేన్ని అయినా మార్చుకోవచ్చు. కాదనే హక్కు ఎవరికీ లేదు.

నేను "కన్యాదానాన్ని" స్వీకరించదల్చుకోలేదు. రిజక్ట్ చేస్తున్నాను. అయితే "వరదానం" ప్రవేశపెడుతున్నాను వ్యక్తిగతంగా! అంటూ తన నిర్ణయాన్ని స్పష్టంగా చెప్పింది ఇంద్రాణి.

భరద్వాజ చప్పట్లుకొట్టి ఇంద్రాణిని అభినందించి – ఇంద్రాణీ నా భార్యగా నిన్ను మరీ మరీ మెచ్చుకుంటున్నాను. అందుకే సహేతుకమైన నీ నిర్ణయాన్ని మనసారా అభినందిస్తున్నాను." అన్నాడు.

మహేంద్ర–విశాల కాస్సేపు అర్థం కాక మాటడలేదు
ఆ తర్వాత మాట్లాడలేక తలదించుకున్నారు. ♦

## ఆ పౌరసత్వం నాకొద్దు..

- మామిండ్ల రమేష్ రాజా
7893230218

ఇప్పుడు ఈ దేశం నాది కాదన్న
స్వప్నమొకటి బయల్దేరింది
నాది అనుకుని గుండెలపై చర్చుకున్న నా దేహం
బిత్తరచూపులను ఆహ్వానిస్తోంది
దేశభక్తిని చాటిన వీరత్వానికి శీల పరీక్ష ఎదురైంది
లౌకిక దేశాన్ని మతపరం చేసి విష బీజాలను
వ్యాప్తి చేస్తుంది రాజ్యం
నా దేశం
నా దేహం
నాది కాదన్నా స్వప్నం నిజమవుతుందా?
ఆ ఆలోచన వస్తేనే వెన్నును సుత్తెతో విరిచినట్లుంది
దేశాన్ని మతాధారంగా చీల్చినట్లుంది



నేనెవరిని..
నా మూలాలేంటీ!?
మా మానాప్రాణాలను
దేశ సంపదను దోచుకొని
మా మూలాలను ప్రశ్నిస్తోన్న రాజ్యమా!
రాజ్యాంగాన్ని చెరపట్టిన కాషాయమా!
పౌరసత్వం పేరిట
నా భారతీయతను
మానభంగం చేస్తున్న ఆ ద్రోహి యెవడు?

నాది అనుకున్న నాది కానీ రాజ్యమా
నన్ను పరదేశివి అంటున్నా ఆ పౌరసత్వం నాకొద్దు
మానవత్వాన్ని చాటే లౌకిక దేశం నాక్కావాలి
సాటి మనిషిని

రాజ్యాంగాన్ని ప్రేమించే మతం నాది
దేశభక్తికి ప్రాణం పోసే జీవం నాది
నాకు ఏ పేరు పెడతావో పెట్టుకో
నాకభ్యంతరం లేదు
కానీ,
నేను మనిషిగానే బతుకుతా
భారతీయతను చాటుతా
ఎందరో నియంతలు
కాలగర్భంలో కలిశారు
నువ్వు కూడా నియంత వైతే
నీకక్కడే సమాధి కడతాం
ఈ దేశం నాది కాదన్న స్వప్నమా!
మా దరిదాపులకు రాకుండా
నీవు కలగానే మిగిలిపో..
పో.. పో..

నన్ను "పరదేశి" అంటున్నా ఆ
పౌరసత్వాన్ని
కాషాయ కుట్రల మొసలికన్నీరును
అగ్ని జ్వాలకు ఆహుతి చేసి
చలి మంటలు కాగుతాం
ఊరూరా భోగిమంటలు పెడతాం
( అసోంలో పౌరసత్వ నిరాకరణకు గురైన
భారతీయుల పక్షాన..)

♦

## అందత్వం

- లక్ష్మీ కందిమళ్ళ
9849368808

కొన్ని కుళ్ళు మనస్తత్వాల మధ్య
తప్పని మౌనం..
♦
ఆశ ఎగురుతూ ఉంటుంది స్వేచ్ఛగా
కానీ స్వచ్ఛతే కరువవుతూ ఉంటుంది
కొన్ని కొన్ని సార్లు..
♦
వాదనల వేదనలు
ఉద్యమ కసరత్తు చేస్తుంటాయి

భవిష్యత్తును భంగపరుస్తూ..
♦
మానవత్వం చూపలేని శ్మశానాలు
వింత వినోదాల వికృత
సమాజంలో
మనిషిని మనిషిగా చూడలేని
అందత్వం..
♦



అందలమెక్కిన అధర్మం
నిస్సహాయంగా నిరాహార దీక్ష
చేస్తున్న నిజాయితీ.
♦



విజయవాడలో **2019** డిసెంబర్ **27,28,29** తేదీలలో సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో సాహిత్య ప్రస్థానం మాసపత్రిక మాతృభాషా మాధ్యమంపై వెలువరించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న దృశ్యం.

# విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల సభలు

**- యు. రామకృష్ణ**
**9490099200**

'అంతర్జాతీయ మాతృభాషల పరిరక్షణ సంవత్సరం - 2019'ని యునిసెఫ్ ప్రకటించినా.. ఆ ఏడాదే ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు ప్రాథమిక విద్య నుంచే మాతృభాషకు పాడె కట్టే రాజకీయ నిర్ణయం తీసుకున్నారు. ఇది తెలుగు భాషాభిమానుల్లో కలకలం రేపింది. ఈ నేపథ్యంలో గత డిసెంబరు 27 నుంచి మూడు రోజులపాటు విజయవాడలో జరిగిన నాలుగవ ప్రపంచ రచయితల మహాసభలు తీవ్ర ఆందోళననూ, ఆగ్రహాన్నీ వ్యక్తం చేశాయి. గత మూడు మహాసభలకన్నా ఈసారి సభలు రాశిలోనూ, వాసిలోనూ మెరుగ్గా జరిగాయని నిర్వాహకులు ప్రకటించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలూ, రాష్ట్రేతర ప్రదేశాలూ, పలు దేశాల నుంచి పాల్గొన్న వారి సంఖ్య గతంకన్నా బాగా పెరిగిందని, 1600 మంది ప్రతినిధులు వచ్చారని మహాసభల నిర్వాహకులు ప్రకటించారు. మహాసభలో వివిధ వేదికల ద్వారా రచయితలను పెద్దఎత్తున భాగస్వాములను చేశారు. మహాసభలు జరిగే ప్రాంగణానికి కొమర్రాజు లక్ష్మణరావు పేరు పెట్టారు. “గిడుగు రామమూర్తి సాహితీ సాంస్కృతిక వేదిక”, “సురవరం ప్రతాపరెడ్డి భాషా పరిశోధనా వేదిక”పై మహాసభలు జరిగాయి. వాస్తవంగా.. ఈ సభలు జరపాలని నిర్ణయించేనాటికి రాష్ట్రంలో ప్రాథమిక విద్య నుంచే మాతృభాషను ఎత్తివేస్తూ ప్రభుత్వం నిర్ణయించలేదు. బదుల్లో తెలుగును మృతభాషగా మార్చేందుకు సాక్షాత్తూ ప్రభుత్వమే సిద్ధపడిన నేపథ్యంలో ఈ మహాసభలు తమ లక్ష్య దిశనూ దశనూ మార్చుకోవాల్సి వచ్చింది.

ఈ మహాసభల్లో వివిధ స్రవంతులకు చెందిన రచయితలు తమ రాజకీయ సిద్ధాంతాలను, తమ సాహిత్య విధానాలను పక్కనబెట్టి ఒకే గొంతుతో 'మాతృభాషను పరిరక్షించుకుందాం' అని పొలికేక పెట్టడం అసాధారణ సన్నివేశం. రచయితలు ఏకోన్ముఖంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని అభిశంసించారని పేర్కొనవచ్చు.

మహాసభలను కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు చంద్రశేఖర్ కంబార ప్రారంభించగా, ప్రసిద్ధ రచయిత బుచ్చిబాబు సతీమణి, ప్రముఖ రచయిత్రి శివరాజు సుబ్బలక్ష్మి జ్యోతి ప్రకాశనం చేశారు. అమెరికా నుంచి వచ్చిన శారద ఆకునూరి 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' ప్రార్థనా గీతాన్ని కమనీయంగా ఆలపించారు. అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన ప్రారంభ సభ జరిగింది. సభను ప్రారంభిస్తూ చంద్రశేఖర్ కంబార ఆంగ్ల ప్రసంగం చేశారు. దీనికి తెలుగు అనువాదం కూడా లేదు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఒక వ్యక్తి ఎన్ని భాషలు నేర్చుకున్నా హృదయ స్పందన కలిగించేది మాతృభాషేనని అన్నారు. సినీ గేయరచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి మాట్లాడుతూ.. తెలుగువారి మనుగడ భాషా, సంస్కృతి, సంప్రదాయం, సాహిత్యంలోనే దాగి ఉందని అన్నారు. తెలుగు భాషా సంస్కృతులపై విశేష పరిశోధనలు చేస్తున్న ఫ్రెంచి ఆచార్యుడు డేనియల్ నెగర్స్ సమ్మోహన ప్రసంగం చేశారు. పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, ఆచార్య వేల్చేరు నారాయణరావు, రైతు నేస్తం సంపాదకుడు పద్మశ్రీ యడవల్లి వెంకటేశ్వరరావు, శాంతా

బయోటెక్స్ అధినేత డాక్టర్ కె.ఐ. వరప్రసాదరెడ్డి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు విజయవంతం కావాలని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి నూతలపాటి వెంకట రమణ పంపిన సందేశాలను కేంద్ర నాటక అకాడమీ అవార్డు గ్రహీత దీర్ఘాసి విజయభాస్కర్ చదివి వినిపించారు.

**'ఏ దేశంలో ఉన్నా మేం తెలుగును మరవలేదు'**

అదే రోజు తెలుగు విదేశీ ప్రతినిధుల సదస్సు అమెరికా తానా పూర్వాధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. తెలుగు మాధ్యమంలో చదివితేనే విద్యార్థుల్లో మానసిక వికాసం, సృజన సాధ్యమౌతాయని తోటకూర ప్రసాద్ అన్నారు. మారిషస్‌లోనే జన్మించిన సంజీవ నరసింహ మాట్లాడుతూ.. మారిషస్ మాతృభాష క్రియెల్ అయినా, అధికార భాష ఫ్రెంచి అయినా, తెలుగు ప్రాథమిక పాఠశాల నుంచి విశ్వవిద్యాలయం వరకూ అన్ని కోర్సుల్లోనూ ఉంటుందని, ఇక్కడి తెలుగు రాష్ట్రంలో తెలుగును విద్య నుంచి ఎత్తివేయడం విచారకరమని అన్నారు. దక్షిణాఫ్రికా ప్రతినిధి యడవల్లి శేషాచల శర్మ మాట్లాడుతూ.. తమ దేశంలో పిల్లలకు భాషా, సంస్కృతులు నేర్పేందుకు రెండు సంఘాలను ఏర్పాటు చేసి కృషి చేస్తున్నామన్నారు. ఇంకా దక్షిణ కొరియా, ఇంగ్లండ్, సింగపూర్, మలేసియా తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు తెలుగుభాష పట్ల అపార మక్కువను కనబరిచారు.

**'రాజకీయ సంకల్పం లేకపోతే భాషాభివృద్ధి జరగదు'**

రెండో రోజు ప్రారంభంగా రాజకీయ సదస్సు జరిగింది. మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ.. రాజకీయ వ్యవస్థ లేకుండా సమాజం ముందుకు పోనట్లే, రాజకీయ సంకల్పం లేకుండా భాష అభివృద్ధి జరగదన్నారు. తెలుగు భాషకూ కమ్యూనిస్టు పార్టీకీ అవినాభావ సంబంధం ఉందని అన్నారు. పాఠశాలల్లో మాతృభాషలో విద్యాబోధన అమలయ్యే వరకూ పోరాటం చేయడంతోపాటు భాష ఆధునికీకరణ, సులభతరం చేయడానికి కృషి చేయాలని రచయితలకు నారాయణ పిలుపునిచ్చారు. శాసనమండలి సభ్యులు అశోక్‌బాబు మాట్లాడుతూ.. మాతృభాషలో విద్యాబోధనను ఎత్తివేయడం సిగ్గు, భయం లేకుండా పెట్టిన బిల్లు అని, దాన్ని శాసనమండలిలో పిడిఎఫ్ సభ్యులతో కలసి అనేక సవరణలు ప్రతిపాదించి నెగ్గించామని వివరించారు.

సమతాపార్టీ పూర్వాధ్యక్షుడు వి.వి.కృష్ణారావు మాట్లాడుతూ.. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం కృషి చేసింది కమ్యూనిస్టులేనని గుర్తు చేశారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. రచయితలు ఎన్నికకాని శాసనకర్తలని, మేం ఎన్నికైనా, మీరు (రచయితలు) ఎన్నిక కాకపోయినా సమాజంలో మీకే గౌరవం ఉందని అన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. గురజాడ, కందుకూరి, గిడుగు సాహిత్యాలను వెలుగులోకి తెచ్చిన ఘనత కమ్యూనిస్టులదేనని అన్నారు. వారి సాహిత్య సంఘాలు, ప్రజానాట్యమండలి వంటి సాంస్కృతిక సంఘాలు తెలుగుకు సొబగులు అద్దాయని తెలిపారు. కమ్యూనిస్టులు సాహిత్య పాఠశాలలు నిర్వహించి కవులను తయారు చేశారన్నారు. వ్యవహారిక భాషా ఉద్యమం ముందుకు తీసుకుపోయిందీ వారేనన్నారు. బిజెపి శాసనమండలి సభ్యులు మాధవ్ మాట్లాడుతూ.. రచయితల వల్ల తెలుగుభాష నిలుస్తుందని భావిస్తున్నానని తెలిపారు. ఈ సదస్సులో శాసనమండలి సభ్యులు ఎ.ఎస్.రామకృష్ణ, బిజెపి రాష్ట్ర కార్యదర్శి వి.సత్యమూర్తి పాల్గొన్నారు.

అనంతరం పాలనారంగ ప్రతినిధుల సదస్సు జరిగింది. విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి మేడిశెట్టి తిరుమల కుమార్ అధ్యక్షతన పలువురు విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారులు, విశ్రాంత జిల్లా జడ్జిలు, వివిధ శాఖలకు చెందిన విశ్రాంత అధికారులు పాల్గొన్నారు. ఈ సదస్సులో డిప్యూటీ కలెక్టర్ నూర్‌బాషాతోపాటు వివిధ శాఖలకు చెందిన విశ్రాంత అధికారులు, గిడుగు రామమూర్తి మనువడు తదితరులు మాట్లాడారు.

**మీడియా, మీడియం మీద దాడుల వేళ తెలుగు ప్రస్తావన సహజమే**

మూడో రోజు పత్రికా, ప్రసార రంగ ప్రతినిధులు సదస్సు జరిగింది. ఆకాశవాణి విజయవాడ కేంద్ర మాజీ సంచాలకులు ఆర్.అనంతపద్మనాభరావు అధ్యక్షత వహించారు. మీడియాలో ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు తెలకపల్లి రవి మాట్లాడుతూ.. భాష ఘోష వినిపిస్తున్న అందరికీ వందనాలు పలికారు. ఏడు కొండల వాడిని దర్శించడానికి వెళ్లి 'గోవిందా' అని, శివుణ్ని దర్శించడానికి వెళ్లి 'ఓం నమశ్శివాయ' అని అనకుండా ఎలా ఉండలేరో, మాతృభాషకు ప్రమాదం ముంచుకొచ్చిన ఈ సందర్భంలో జరుగుతున్న తెలుగు రచయితల మహాసభల్లో తెలుగు మాధ్యమంపై ప్రభుత్వ తీరు గురించి ప్రస్తావించకుండా అలా ఉండలేరని స్పష్టం చేశారు. మీడియా మీద, మీడియం

మీద దాడి జరుగుతున్న వేళ ఆ అంశాలు చర్చకు రావడం సహజమన్నారు. మీడియా మీద దాడి భావ స్వేచ్ఛపై దాడి అయితే, మీడియం మీద దాడి భాషపై దాడి అని అన్నారు. తాము ఆంగ్ల భాషను విస్తరించొద్దని అనడంలేదని, తెలుగును తీసివేయొద్దని మాత్రమే కోరుతున్నామని అన్నారు. మాతృభాష ఎందుకీ స్థితికి వచ్చిందో ఆలోచించాలన్నారు. పాలకులు మీడియం గొంతు నులుముతుంటే మీడియాయే దాన్ని బతికిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా రవి.. 'చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా/ సొంత భాషలో తెలుగు లేనోడా/ ఇంగ్లీషు నేర్పితే ఎవరొద్దన్నారు/ తెలుగు వద్దంటేనే దిగులు పడుతున్నారు" అని పాటను పాడి వినిపించడంతో రచయితలు హర్షధ్వానాలు చేశారు. ఆకాశవాణి విశ్రాంత అధికారి నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ.. తెలుగు భాషతోపాటు కొన్ని ఇతర భాషలు మరుగున పడ్డాయని, వాటి పరిరక్షణకు కృషి జరుగుతోందని, అదే స్థాయిలో తెలుగు భాషాభివృద్ధికి కూడా కృషి జరగాలని కోరారు.

**'తెలుగులో ఓట్లడిగితే తిరగబడదాం'**

సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు, సాహిత్య ప్రస్థానం కార్యనిర్వాహక సంపాదకులు వొరప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నేడు భాషా సంక్షోభం నెలకొందని, భాష చదువుకోవడానికి లేనప్పుడు, రేపు మాట్లాడుకోవడానికి కూడా ఉండదని హెచ్చరించారు. జాతీయోద్యమంలో మన తెలుగు పత్రికలు ఘనమైన పాత్ర నిర్వహించాయని, పాలకులు మాతృభాషను మృతభాషగా మార్చుతున్నప్పుడు ఇక తెలుగు పత్రికలే ఉండవని స్పష్టం చేశారు. ప్రాథమిక విద్యా బోధనలో మాతృభాషను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్న శాసనకర్తలు రేపు తెలుగులో ఓట్లడిగే హక్కు కోల్పోయారని, వారు ఆంగ్లంలోనే ప్రజలను ఓట్లు అడగాలని సూచించారు. శాసనకర్తలు తెలుగులో ఓట్లడిగితే తిరగబడాలని పిలుపునిచ్చారు. దీంతో సభికులు హర్షధ్వానాలు చేశారు. శంకరనారాయణ మాట్లాడుతూ భాషకు నేడు కష్టకాలం దాపురించందన్నారు. ప్రతి ఒక్కరూ నేడు తెలుగు పత్రికలు చదవాల్సిన, చదివించాల్సిన అవసరం ఉందన్నారు. రచయిత రెంటాల జయదేవ మాట్లాడుతూ.. "తెలుగు లెస్స" అన్న దగ్గరనుంచి "తెలుగు లెస్సా?" అనే స్థితి వచ్చిందన్నారు. ఇది మనకోసం, మన గురించి జరుపుతున్న సమావేశమని అన్నారు.

తెలుగు భాషా పరిశోధనలపై జరిగిన సదస్సులో ఆచార్య వేల్చేరు నారాయణరావు మాట్లాడుతూ.. పరిశోధనలు భాషా వైభవాన్ని చాటాలని, పరిశోధనలలోని మూలాలను సమగ్రంగా చర్చించాలని అన్నారు. ఆచార్య టి.గౌరీశంకర్ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, ఆచార్య ఎన్ భక్తవత్సల రెడ్డి, తెలుగు భాషా పరిశోధనాంశాలపై చర్చించారు. సాహితీ రంగ సమస్యలపై జరిగిన సదస్సుకు విహారి అధ్యక్షత వహించారు. కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్, ఆచార్య మన్నవ సత్యనారాయణ, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, సీనియర్ జర్నలిస్టు శర్మ తదితరులు సాహితీవేత్తలు పాల్గొన్నారు. తెలుగు బోధనారంగ ప్రతినిధుల సదస్సుకు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ గౌరవ డాక్టరేట్లు కావడం విశేషం. "చరిత్ర పరిశోధక రంగ ప్రతినిధుల సదస్సుకు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా "తెలుగు శిల్పుల వైభవం" అనే పుస్తకాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ రాము సూర్యారావు ఆవిష్కరించారు. "సాంకేతిక తెలుగు రంగ ప్రతినిధుల సదస్సు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఇంటర్నెట్‌లో తెలుగును అధికంగా ఉపయోగించుకోవడం వల్ల గూగుల్ వారు ఇంటర్నెట్‌ను తెలుగులో సులభంగా వినియోగించుకునేలా అందుబాటులోకి తెస్తారని అన్నారు. "తెలుగు భాషోద్యమ ప్రతినిధుల సదస్సు'కు డాక్టర్ సామల రమేష్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో తెలుగులేశం అయ్యిందన్నారు.

**కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాల గుభాళింపు**

మహాసభల మూడు రోజులూ కవి సమ్మేళనాలు విశేషంగా అలరిస్తే, సాంస్కృతిక కార్యక్రమాలు గుభాళించాయి. సినీ గేయ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు నిర్వహించిన "చమత్కార చతుర్ముఖ పారాయణం" పద్య వైభవాన్ని చాటింది. ఆ తరువాత జరిగిన ఎనుకుదురాట (అచ్చతెలుగు అష్టావధానం) కార్యక్రమాన్ని ద్విశతావధాని డాక్టర్ పాపపర్తి శ్యామలానంద ప్రసాదు నిర్వహించారు. అవధానం సాహితీ విలువలను చాటింది. పృచ్ఛకులు సంధించిన అనేక చిక్కు సమస్యలను పాలపర్తి చక్కగా పరిష్కరించారు. వర్తమాన సమస్యలే అంశంగా ప్రత్యేక కవి సమ్మేళనం కూడా నిర్వహించారు. దీన్ని సినీ గేయరచయిత వెన్నెలకంటి నిర్వహించారు. సినీ గేయ రచయితలు రసరాజు, వడ్డేపల్లి శ్రీకష్ణ, సంగీత దర్శకుడు వీణాపాణి పాల్గొన్నారు. వీరితోపాటు

పలువురు రచయితలు పాల్గొన్నారు. డాక్టర్ మీగడ రామలింగస్వామి నిర్వహించిన "సంగీత నవావధానం" కూడా ఎంతో ఆకట్టుకుంది. డాక్టర్ గుమ్మా సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు. "తెలుగువారి ఆలయ నృత్యరీతులు" అంశంపై నృత్య దర్శకుడు సప్పా దుర్గాప్రసాద్ మాట్లాడారు. కూచిపూడి, ఆంధ్రనాట్యం, దేవదాసీ నృత్యరీతులపై ఆయన నృత్యం చేస్తూ ప్రసంగించారు. "తెలుగు భాషోద్యమ గీతాలు" కార్యక్రమాన్ని రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాజేష్ బృందం నిర్వహించారు. భాషోద్యమ గీతాలు ఎంతో ప్రభోదాత్మకంగా సాగాయి. "ప్రపంచ తెలుగు" పేరుతో మిమిక్రీ మాంత్రికుడు 'సిల్వర్ స్టార్' సిల్వెస్టర్ ధన్యనుకరణ, టాకింగ్ డాల్ ప్రదర్శన ఇచ్చారు. "పలకరిస్తే పద్యం" కార్యక్రమం కూడా సాహితీ విలువలను చాటింది. ప్రముఖ పద్యకవి డాక్టర్ రాధశ్రీ ప్రేక్షకులు అడిగిన అనేక అంశాలను పద్య రూపంలో వివరించారు. మహిళా సాహితీ వేత్తలు నిర్వహించిన "తెలుగు వైభవం" అనే కదంబ కార్యక్రమం ఎంతో ఆలోచింపచేసింది. మహిళా కవయిత్రులు పలువురు అభినందనలు పొందారు. "యువత తెలుగు భవిత" అనే అంశంపై సినీ గేయ కవి అనంత శ్రీరామ్ ప్రసంగించారు.

మహాసభల మూడో రోజు సాయంత్రం ముగింపు సభ జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ.. విద్యాబోధన మాతృభాషలోనే ఉండాలని, ఆంగ్ల మాధ్యమం అమలు సమాజాభివృద్ధికి తీవ్ర ఆటకం కలిగిస్తుందని అన్నారు. కనుక ఆంగ్ల భాష అమలు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని హితవు పలికారు.

డాక్టర్ పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలుగు భాష, బోధన, తరగతి అంటే పిల్లలకు ఆసక్తి కాకుండా భయం కలిగే విధంగా సిలబస్‌లు ఉన్నాయని, ఈ విధానం మార్చాలని సూచించారు. శాసనమండలి మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. మూడు రోజులపాటు ఘనంగా మహాసభలు నిర్వహించుకోవడానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రభూమి సంపాదకులు ఎంవిఆర్ శాస్త్రి, సినీ గేయ రచయిత అనంతశ్రీరామ్, ఇంకా పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు, ప్రముఖ కవి బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, డాక్టర్ జివి పూర్ణచంద్, గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ గుమ్మా సాంబశివకావు పాల్గొన్నారు.

**మహాసభల తీరుపై పదుగురాడిన మాటలు**

మూడు రోజులపాటు జరిగిన తెలుగు రచయితల మహాసభలు ముఖ్యంగా యువ, వర్ధమాన కవుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించేటప్పుడు కొన్ని నిర్వహణా లోపాలు సహజంగా ఉంటాయి. మహాసభల్లో ఒక్క "మహిళా ప్రతినిధుల సదస్సు", "తెలుగుతల్లి వైభవం" సదస్సుల్లో మినహా మిగిలిన సదస్సులన్నీ మహిళలు లేక దాదాపు వెలవెలబోయాయి. ప్రారంభ సభలో మాత్రం గోపిచంద్ సతీమణి ప్రముఖ రచయిత్రి శివరాజు సుబ్బలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆమెరికా నుంచి వచ్చిన డాక్టర్ ఆకునూరి శారద ప్రార్థనాగీతం ఆలపించారు. ఇంతకుమినహా ఒక్క మహిళా ప్రాతినిధ్యం లేదు.

ముగింపు రోజున పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. సహజంగా ఏ మహాసభను తీసుకున్నా ఏదో ఒక నిర్ణయం తీసుకొనే ముగుస్తుంది. ఈ మహాసభలు కూడా తీర్మానాలు పెట్టి హడావుడిగా ఆమోదింపచేశాయి. ఇక్కడ సమస్యేమిటంటే తీర్మానాలు ఆవోదించడం మినహా మాతృభాషను రక్షించుకోవడానికి తగిన కార్యాచరణ ప్రణాళికేమీ ప్రకటించలేదు. ప్రపంచ స్థాయి రచయితల మహాసభలు ఒక్కుమ్మడిగా ఒకే గొంతై మాతృభాషను రక్షించుకోవాలని పొలికేక పెట్టినా ప్రభుత్వం ఏ మాత్రం స్పందించలేదు. పైగా అవి రచయితల సభలుగా కాక రాజకీయ సభలుగా జరిగాయని ప్రభుత్వంలోని కొంతమంది వ్యాఖ్యలు చేశారు. కాబట్టి తీర్మానాలు చేయాలి దానికనుగుణమైన కార్యాచరణా ఉండాలి అనేదే ఎక్కువమంది ప్రతినిధుల భావనగా ఉంది.

మహాసభల్లో తీర్మానాలు విని, ఆమోదించి వెళ్లిన రచయితలు ఇక వ్యక్తిగతంగానే పని చేయాలి. ఒక సమష్టి కృషికి లేదా పోరాటానికి అవసరమైన ప్రణాళిక నెలల తరువాతయినా ప్రకటిస్తే బాగుంటుందనేది రచయితల భావన. "భాష జాతిగా తెలుగువారంతా తమ జాతీయతను నిలబెట్టుకునేందుకు స్వభాషాభిమానం, స్వాభిమానం కాపాడుకునేందుకు మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు బలపరిచేందుకు దోహదపడే విద్యను ప్రాథమిక స్థాయి నుంచే అందించాలి" అనేది మహాసభల్లో అతి ముఖ్యమైన తీర్మానం. ప్రపంచ రచయితల మహాసభల పేరుతో అన్ని స్రవంతులకు చెందిన రచయితలను ఒక్కచోటకు చేర్చిన ప్ర.తె.ర.సం. ఈ ముఖ్య తీర్మానంపై కార్యాచరణ కచ్చితంగా ప్రకటించాలి. లేకుంటే యథాతథ పరిస్థితి కొనసాగుతుంది. ఇంత మహాసభ నిర్వహించుకొని ఏం లాభం?. ఏతావాతా మహాసభల నిర్వహణను ప్రపంచ రచయితల సంఘం భుజానికి ఎత్తుకున్నందుకు యువ, వర్ధమాన రచయితలను విశేషంగా ఆకర్షించగలిగింది. ♦

## స్వేచ్ఛా భారతానికి!



నూనెల శ్రీనివాసరావు
9492970231

నా దేశమంటే వెనకటికి
కల్మషమెరుగని సహపంక్తి భోజనం
ఒకే ఆకాశాన కొలువైన
తారాతోరణం
కోట్ల భావాల స్వరాలతో
ప్రకాశించే ప్రభాతకిరణం !

నా దేశమంటే నిన్నటికి
అభం శుభం ఎరుగని
బడి పిల్లల ఆటా పాటా
ఒకే వరుసలో  నిలబడి
ముక్త కంఠంతో ఆలపించిన
జనగణమన గీతం
నీలి గగనాన ఎగరేసిన
ముసిముసి నగవుల
మువ్వన్నెల పతాకం !

మరి నా దేశం నేడు
తన విశాల బాహువులను
బంధించిన మతోన్మాద సంకెళ్ళతో
పెనుగులాడుతోంది
ప్రశ్నలా విచ్చుకొనే తన గొంతుకపై
విరుచుకపడ్డ లాఠీతో
విలవిలలాడి పోతోంది
సర్వేజనాః సుఖినోభవంతన్న
తన మూలాలు పెకిలించె
మనువాద దుష్కృత్యాలతో
అతలాకుతల మౌతోంది
తనగోడు తాను చెప్పుకున్నా
దేశద్రోహిగా  ముద్రపడి
వెలికి గురవుతోంది
నా దేశమిప్పుడు క్రమక్రమంగా
చీకటి ద్వీపంలోకి నెట్టబడుతోంది !

ఇకనైనా బంధ విముక్త కావాలి
ఉపేక్షించక చేతనతో
వేల అడుగుల చేతులు కలవాలి
లక్షల గుండెగొంతుకలు ఒక్కటవ్వాలి
మరో స్వతంత్ర పోరుతో
దేశమంతా పోటెత్తాలి
వేవేల పడగల ఉన్మాద విషనాగుపై
వజ్రాయుధంలా విరుచుకుపడాలి
అప్పుడే మరలా
దేశం దేశంలా దృగ్గోచరమౌతుంది
కోటి భావాల సరాగమై
ప్రగతిబాటలో పల్లవిస్తుంది ! ♦

## మరో రోజు

- పద్మావతి రాంభక్త
9966307777



మరో రోజు
కాలం కొమ్మనుండి
పండుటాకులా రాలిపోతుంది
గడిచిన అవశేషాల నుండి
తప్పొప్పుల పట్టికల బేరీజులోనే
సమయం మంచుముక్కలా కరిగిపోతుంది
పేర్చుకుంటూ పోతున్న అలుపు లేని ఆలోచనలు
కొండలా పోగుపడుతుంటాయి
వాయిదా వేసిన మంచిపనులు
గుండెను కత్తిరంచిన ఆత్మీయులకు
రాసిన క్షమాపణల పత్రాలు
అలమర తలుపుల వెనుక
భద్రంగా మూలుగుతుంటే
క్షణాలు పాదరసంలా దొర్లుతూ
గోడపై రెక్కలను టపటపలాడిస్తున్న
కాలెండరు పక్షి నుండి
ఒక నెల నిర్దాక్షిణ్యంగా ఎగిరిపోతుంది
ప్రతీ సంవత్సరాన్ని
విరుచుకు తింటూ పోతుంటే
వయసు చీకట్లోకి నెమ్మదిగా అదృశ్యమవుతూ
మునుపు రివ్వున పరుగులు తీసే బ్రతుకుబండి
నెమ్మదిగా ఉత్సాహం కోల్పోతూ చతికిల పడుతుంది
కలల రంగులన్నీ వెలిసి
నలుపు తెలుపులలో జీవితం చప్పగా వెక్కిరిస్తుంది
అందంగా ఊరించిన ఇంద్రధనుస్సు విరిగిపోతుంది
ముచ్చటగా విరిసి
పరిమళాలు వెదజల్లిన పువ్వు
సాయంసంధ్యలో వాడిపోతుంది
ఇక్కడ శాశ్వతం కాదని
ఉన్నట్టుండి జ్ఞప్తికొచ్చినప్పటి నుండి
మిగిలిన కాస్త అవకాశాన్ని దొరకబుచ్చుకుని
కాస్తైనా సార్థకత సాధించమని
మెత్తగా మనసు హెచ్చరిస్తూనే ఉంటుంది ♦

# స్వీకారం


స్త్రీవాద పత్రిక భూమిక

## అబ్బూరి ఛాయాదేవి

**ప్రత్యేక సంచిక**

**వెల : 15/- పేజీలు: 74**

**ప్రతులకు : 040-27660173**




ప్రముఖ రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి 2019 జూన్ 28న కన్నుమూశారు. భూమిక మాసపత్రిక సెప్టెంబర్-అక్టోబర్ 2019 సంచికను 'అబ్బూరి ఛాయాదేవి ప్రత్యేక సంచిక' గా వెలువరించింది. అబ్బూరి ఛాయాదేవి జీవితం, సాహిత్యకృషిపై ప్రసిద్ధులైన వారి వ్యాసాల సమాహారం ఈ సంచిక. లోతైన విశ్లేషణలు, ఆత్మీయ స్పందనలతో సంచిక దాచుకోదగ్గది.

## సి. రాఘవాచారి పై

**జాతీయస్ఫూర్తి మాసపత్రిక ప్రత్యేక సంచిక**

**వెల : 30/- పేజీలు: 70**

**ప్రతులకు: 9866074023**




విశాలాంధ్ర సంపాదకులు, ప్రసిద్ధ పాత్రికేయులు చక్రవర్తుల రాఘవాచారి 2019 అక్టోబర్ 28న కన్నుమూశారు. జాతీయస్ఫూర్తి మాసపత్రిక ఆయనపై నవంబర్ సంచికను ప్రత్యేక సంచికగా వెలువరించింది. రాఘవాచారి జీవితం, పాత్రికేయుడిగా వారి కృషికి అద్దం పట్టే విధంగా ఈ ప్రత్యేక సంచికను తీర్చిదిద్దారు. రాఘవాచారి స్ఫూర్తిదాయక జీవితం పాఠకులకు ఉత్తేజం కలిగిస్తుంది.

## తీగలచింత కవిత్వం

**యాకూబ్**

**వెల : 100/- పేజీలు: 167**

**ప్రతులకు: 9849156588**



సమకాలీన వాస్తవికతను తీగలు తీగలుగా అల్లుకొని సాగిపోతున్న చింత ఉంది ఈ పుస్తకం నిండా. ఇది కేవలం చింత మాత్రమే కాదు. చింతన కూడా. నేటి మన దుస్థితి తాలూకూ చింతనాత్మక స్పందనలీ కవితలు. నూతన ఉగ్ర జాతీయవాద సినేరియాలో ఒక లిబరల్ ప్రజాస్వామికవాది గుండెకోత ఈ కవితాసంపుటి.


**- జి. లక్ష్మీనరసయ్య**

## మనిషి లోపలి మహాసముద్రాలు

**కిల్లాడ సత్యనారాయణ**

**వెల :80/- పేజీలు: 108**

**ప్రతులకు: 0866-2430302**



మనిషిలోపల కూడా మహాసముద్రాలున్నాయని, కాబట్టి మనిషి తన సమస్యల పరిష్కారానికై బయటి ప్రపంచంలో కాకుండా, లోపలి ప్రపంచంలో అన్వేషణ కొనసాగించాలని- తద్వారా ఆ అగాధపు జలనిధిలోని అసలు సిసలు ఆణిముత్యాల్ని కనుగొనగలడని చెబుతున్న పుస్తకం ఇది. ఈ పుస్తక రచయిత కవి కూడా కావడం వల్ల ఇందులోని సముద్రాలపై వెన్నెల కూడా పడినట్లుంది.


**- భగవంతం**

## గ్రహణం వీడిన వేళ కథల సంపుటి

**బండి ఉష**

**వెల :100/- పేజీలు: 192**

**ప్రతులకు: 9676377462**



తెలుగువారి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక జీవితంలోని అంతర్మథనాలనూ, సంఘర్షణలనూ, సంప్రదాయ ఉల్లంఘనలనూ, కాలం కల్పించే మార్పులనూ, పరిష్కారాలనూ సోదరి ఉష అక్షరీకరించిన తీరు అమోఘం. ఈ సంపుటిలో కథలు చదువుతూ ఉన్నప్పుడు మస్తిష్కంలో వాటి తాలూకూ దృశ్యాలు ఆవిష్కృతం అయ్యేవి. సజీవ కథలకూ, ఉత్తమ రచనకూ గీటురాయి ఇదే.


**- యు. రామకృష్ణ**

## సమాహార సాహిత్య వ్యాసాలు

**డా॥ ఏనుగు నరసింహారెడ్డి**

**వెల :100/- పేజీలు: 143**


**ప్రతులకు: 040-27678430**



వస్తువుని మాత్రమే కాదు, వస్తువుని సౌందర్యాత్మకంగా అభివ్యక్తం చేసారో లేదో చెప్పగల శైలీశిల్పాల నిపుణతని పరిశీలించి చూపడం నరసింహారెడ్డి సాహిత్యవిమర్శలోని మేలిమి గుణం. ఇదే విమర్శకుడిగా అతని ప్రయాణం పదునెక్కడానికి దోహదకారి. వస్తురూపాల సంవిధానం గురించి సంయమనంతో విశ్లేషించే దృష్టి వైశాల్యం విమర్శకునిగా ఏనుగు నరసింహారెడ్డి ప్రత్యేకతని నిలబెడుతుంది.

**- గుడిపాటి**

# స్వీకారం



## మూడో కన్నీటి చుక్క కవిత్వం


**బొల్లోజు బాబా**

**వెల : 100/- పేజీలు: 120**

**ప్రతులకు : 9849320443**

**బా**బాలో కవీ, విమర్శకుడూ ఇద్దరూ పుష్కలంగా వున్నారు. వాళ్ళ ప్రపంచాలు అంత భిన్నమైనవేమీ కాదు. అయితే, వాళ్ళిద్దరి మధ్యా సరిగా వంతెన కట్టే విశ్లేషణ ఏదో జరగాల్సిన సందర్భం దగ్గిర పడిందని ఈ కొత్త కవిత్వ సంపుటి చదువుతున్నప్పుడు అర్థమైంది. కవిగా తన దారి ఏమిటో వెతుక్కోవడానికి బాబా కవిత్వ విమర్శలోకి వచ్చాడనీ నాకు గట్టిగానే అనిపిస్తుంది.

**- అఫ్సర్**



## అశోక నివాళి

**మూడు, నాలుగు భాగాలు**

**శ్రీశ్రీ సింగంపల్లి అశోక్ కుమార్**


**3వ భాగం వెల : 100/- పేజీలు: 120**

**4వ భాగం వెల : 100/- పేజీలు: 120**

**ప్రతులకు: 9440243433**

**ఇ**ప్పుడు మరో రెండు పుస్తకాలు 'అశోక నివాళి' మూడు, నాలుగు భాగాలు. ఇవి నూరుగురు అంతర్జాతీయ అమరయోధులకు నివాళి. ఒక్కో భాగంలో యాభై మంది అమర యోధులు చొప్పున రెండు భాగాలు, రెండు పుస్తకాలు.

**- సింగంపల్లి అశోక్ కుమార్**



## తెలుగు రాష్ట్రాల రెవెన్యూ వ్యవస్థ నిన్న నేడు రేపు


**ఏనుగు నరసింహా రెడ్డి**

**వెల :130/- పేజీలు: 125**

**ప్రతులకు: 8978869183**

**ఈ** రచయిత శాఖను లోపలి నుండీ బయట నుండీ తరచి చూసిన అధికారి. రచయితగా జనసామాన్యం సమస్యల పట్ల ఆర్తి గలవాడు. అందుకే రెవెన్యూశాఖమీద లోతైన అవగాహనతో, విశ్లేషణతో ఈ పుస్తకం రాశాడు. రెవెన్యూశాఖను సామాన్య ప్రజలకు ప్రియమైన శాఖగా ఎలా మార్చవచ్చో వాస్తవికంగా చెప్పాడు. ఆచరణ యోగ్యమైన సంస్కరణలు ప్రతిపాదించాడు.

**- జూలూరు గౌరీశంకర్**



## కొత్తకోణం విమర్శా వ్యాసాలు


**బిక్కి కృష్ణ**

**వెల : 200/- పేజీలు: 148**

**ప్రతులకు: 9912738815**

**బి**క్కి కృష్ణ ప్రశ్నలలో, విమర్శలలో అర్థవంతమైనవి, అవసరమైనవి కొన్ని వున్నాయి. ఆత్మవిమర్శ మనుషులకు అవసరం. అట్లాగే కవులకూ అవసరం. మనం తప్పనుకున్న గుణాలను మనలో లేకుండా చూసుకోవడం ద్వారా మాత్రమే మనం మెరుగైన సాహిత్య వ్యక్తులం కాగలుగుతాం.

**- కె. శ్రీనివాస్**



## ముగ్గురాళ్ళ మిట్ట కథల సంపుటి

**ఆర్.సి. కృష్ణస్వామి రాజు**

**వెల :100/- పేజీలు: 112**

**ప్రతులకు: 9393662821**

**సా**ధారణంగా అందరూ 'బాల్యం ఎవరు రాసినా బావుంటుంది' అంటారు. కానీ అది అబద్ధమని అర్థమవుతుంది. ఎందుకంటే అది ఎంత బాల్యమైనా సరే రాయాల్సిన వాళ్లు రాసే పద్ధతిలో రాస్తేనే బావుంటుంది. లేకుంటే లేదు. ఇలా బాల్య కథలను, పల్లెటూరి కథలను తమదైన యాస, భాషలో రాసి మెప్పించిన తెలుగు రచయితల సరసన కృష్ణస్వామి రాజు కూడా ఈ కథలతో చేరబోతున్నాడు.

**- వేంపల్లె షరీఫ్**



## విరాళి కవిత్వం

**జన్ను లక్ష్మి**

**వెల :150/- పేజీలు: 200**

**ప్రతులకు: 9494480753**


**సూ**ర్యుడి మొహమే/ చూడని నేను../ నీ మొహమెలా చూస్తాను?!/ సూర్యుడు లేవకముందే.../ నేను ఇల్లొదిలి వెళ్తాను/ నేను పనిచేసే చోట.../ సూర్యచంద్రులతో పనిలేదు!/ పగలే దీపాలు.../ వెలుగుతూ వుంటాయి! / సూర్యుడు వెళ్లింతర్వాత / నేను ఇంటికి చేరుకుంటాను/ పున్నమి జాబిలే../అందంగా వుంటుందని/ తెలియని నాకు / నువ్వందంగా వున్నావని / ఎలా తెలుస్తుంది?

**- జన్ను లక్ష్మి**

# స్వీకారం

నూతలపాటి

## కళా సాహితీ విపంచిక



**నూతలపాటి సాంబయ్య**

వెల : అమూల్యం/- పేజీలు: 104


ప్రతులకు : 9848034930

ఎనిమిది పదుల జీవన ప్రస్థానంలో ఉన్నవాడిని. 65 వసంతాలు రంగస్థల సేవలో గడిపినవాడిని. జీవితంలో ఎన్నో మిట్టపల్లాలను చవిచూసిన వాడిని. కళాసాహితీ రంగాలలో ఇంకా ఏదో చేయాలని తపిస్తున్న వాడిని. నా భావాలను, అనుభవాలను అక్షర రూపంలో చూసుకోవాలని ఆశపడుతున్నవాడిని. ఆశే జీవితమని, నిరాశ మరణంతో సమానమని తెలుసుకొన్న వాడిని.

**- నూతలపాటి సాంబయ్య**

తెలుగు నేర్చుకుందాం

## తెలుగు అక్షర పరిచయం



**రాచకొండ మల్లికార్జున రావు**


వెల : అమూల్యం- పేజీలు: 62

ప్రతులకు: 9246273615

"పిల్లలు ఈ పుస్తకం పూర్తి చేసే సరికి మొత్తం తెలుగు అక్షరాలను ఒత్తులతో సహా వ్రాయడం, చదవడం నేర్చుకోగలుగుతారు. దానితో పాటు నిత్యం వాడుకలో ఉండే అనేక పదాలను కూడా తెలుసుకుంటారు. తెలుగులో మాట్లాడగలుగుతారు" అన్న మల్లికార్జునరావు గారి మాటలతో నేను సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాను.

**- మండలి బుద్ధప్రసాద్**

## పాల జున్ను కవిత్వం



**కొప్పోలు యాదయ్య**


వెల : 30/- పేజీలు: 85

ప్రతులకు: 9494273703

నిజానికి కవులు ప్రజల పక్షం. యాదయ్య కూడా అంతే. ఎందుకంటే 'పడిలేచిన తెలంగాణ' రాసిన ఈ కవే శ్రమ విలువను కీర్తిస్తూ 'స్వేదం ధారగా పారినప్పుడే' రాసాడు. మేడేను స్మరిస్తూ 'బిగిసిన పిడికిళ్ళు' రాసాడు. 'శ్రమయేవ జయతే' రాసాడు. 'అప్రజాస్వామికం' అని కన్నడ రాజకీయం గురించీ రాసాడు. ఏది రాసినా ఊహాలో, భావంలో అభివ్యక్తిలో స్పష్టత యాదయ్య లక్షణం.

**- డా॥ ఏనుగు నరసింహా రెడ్డి**

## బతుకమ్మ మొగ్గలు



**ఉప్పరి తిరుమలేష్**


వెల :30/- పేజీలు: 36

ప్రతులకు: 9618961384

బతుకమ్మ చుట్టూ అల్లిన మొగ్గలు సాహితీ పరిమళాలను వెదజల్లుతున్నాయి. ప్రతి మొగ్గలో బతుకమ్మ హరివిల్లె విలసిల్లుతున్నది. తిరుమలేష్ కలంలో బతుకమ్మ మొగ్గలు విరగబూని తెలంగాణ నేలన వికసిస్తున్నాయి. పాలమూరులో మొలకెత్తిన మొగ్గలు తెలంగాణ అంతటా వ్యాపిస్తున్నాయి. ఆ మొగ్గలకు ప్రాణం పోస్తున్న తిరుమలేష్ మొగ్గలలో రెండవ కవితా సంపుటి బతుకమ్మ మొగ్గలు.

**- డా॥ భీంపల్లి శ్రీకాంత్**

## పసిడి నానీలు



**డా॥ భీంపల్లి శ్రీకాంత్**

వెల :30/- పేజీలు: 113

ప్రతులకు: 9032844017

అతని కవితాశైలి అతని చేతిని మీరి ప్రవహించే సెలయేటి సదృశ్యంగా వుంటుంది. అతడు అక్షరాల గురించి రాసినా, పుస్తక పఠనం మహత్తును చాటినా, ఉపాధ్యాయుడు, గురువుకూ మధ్య సున్నితమైన రేఖా భేదాన్ని వ్యాఖ్యానించినా, పాలమూరు వలస జీవితాలను బాధతో తడిమినా, జీవితాన్ని గురించి నిట్టూర్పుల్లాంటి కూర్పులను వెలువరించినా అవి శ్రీకాంత్ ముద్రతో వుంటాయి.

**- డా॥ ఎన్. గోపి**

## తెలంగాణ మహిళ



**ప్రధాన సంపాదకులు: సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

వెల :200/- పేజీలు: 272

ప్రతులకు: 9032844017

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక మొట్టమొదటి సారిగా తెలంగాణ మహిళా కవితోత్సవం నిర్వహిస్తున్నాం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి 200ల మందికి పైగా మహిళా కవయిత్రులు తమ కవితలను ఉత్సాహంగా రాసి పంపడం తెలంగాణ మహిళా కవితోత్సవానికి నిండు ఉత్తేజాన్ని నింపడమే కాదు తొలి విజయంగా భావిస్తున్నాము. ఇందులోని మేలిమి కవితలను తెలంగాణ మహిళ పేరుతో వెలువరిస్తున్నాం.

**- డా॥ భీంపల్లి శ్రీకాంత్**

## సంస్మరణ

# గరిమెళ్ళ సత్యనారాయణ సంస్మరణోత్సవం




శ్రీకాకుళంలోని గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం డిసెంబర్ 22 ఆదివారం నాడు స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ కవి గరిమెళ్ళ సత్యనారాయణ సంస్మరణోత్సవం 2019 ఘనంగా నిర్వహించింది. ఉదయం పది గంటలకు గరిమెళ్ళ సాహిత్యంపై కేంద్ర సాహిత్య అకాడెమి తో సంయుక్తం గా ఒక లిటరరీ ఫోరమ్ నిర్వహించడం జరిగింది. ఈ సదస్సు లో ప్రధాన వక్త గా హైదరాబాద్ కి చెందిన సాహితీవేత్త డా.కె ముత్యం పాల్గొని ప్రధాన ప్రసంగం చేశారు. డా.సుంకిరెడ్డి నారాయణరెడ్డి (నల్గొండ), అకాడెమి తెలుగు విభాగం సలహా సంఘ సభ్యులు అట్టాడ అప్పలనాయుడు (శ్రీకాకుళం), స్నేహకళాసాహితి (పార్వతీపురం) అధ్యక్షులు గంటేడ గౌరినాయుడు, ప్రముఖ జర్నలిస్ట్ నల్లి ధర్మారావు (శ్రీకాకుళం) తదితరులు గరిమెళ్ళ సాహిత్యం పై వివిధ కోణాల్లో విశ్లేషణాత్మక ప్రసంగాలు చేశారు. అధ్యక్షత వహించిన గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి జి కే మూర్తి మాట్లాడుతూ తమ సంస్థ లక్ష్యాలు కార్యక్రమాలను క్లుప్తంగా వివరించారు. స్వతంత్ర పోరాటం లో గరిమెళ్ళ నిర్వహించిన ధీరోదాత్తమైన పాత్ర నేటి తరానికి, ప్రత్యేకించి యువత కూ గుర్తు చేసేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

ముఖ్య వక్త గా పాల్గొన్న డా. కె ముత్యం కొత్త తరానికి గరిమెళ్ళ ని పరిచయం చేయడం ఎంతైనా అవసరం అని అన్నారు. కులాల పట్ల మతాల పట్ల వీరాభిమానం లేని ఈ ఉత్తరాంధ్రంటే తనకెంతో ఇష్టమని, ఈ ప్రాంతం నుండీ అనేక అభ్యుదయ ఉద్యమాలు పుట్టాయని అన్నారు. గరిమెళ్ళ అలభ్య రచనలను ఆయన సేకరించి సంకలనపర్చగా గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం ప్రచురించిన “స్వాతంత్రోద్యమం – గరిమెళ్ళ ” అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

డా. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక అభ్యుదయ ఉద్యమాలు, విప్లవ సాహిత్యోద్యమాలు ఉత్తరాంధ్ర నుండి ఆవిర్భవించాయని అన్నారు. నాడు గరిమెళ్ళ సామ్రాజ్యవాద బ్రిటిష్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాడని కానీ నేడు అమెరికా సామ్రాజ్యవాదానికి దాసోహమై భారత్ నడుస్తున్నదని అంటూ నేటి సాహితీ ప్రపంచం దీన్ని ధీటుగా ఎదుర్కోనాలని పిలుపునిచ్చారు.

ప్రముఖ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగ సలహా సంఘ సభ్యుడు అట్టాడ అప్పలనాయుడు తన ప్రసంగం లో ప్రజా సమస్యలను ప్రతిబింబించే రాజకీయాల నుండి కవులు కథావస్తువులను ఎంచుకోవాలని సూచించారు. ప్రభుత్వానికి శాశ్వత ప్రతిపక్షం గా కవి నిలుస్తాడని తన రచనల ద్వారా గరిమెళ్ళ నిరూపించారని అన్నారు. గరిమెళ్ళ రచనల్లో అత్యంత ప్రజాదరణ పొందిన ‘‘ మాకొద్దీ తెల్లదొర తనమూ ’’ గీతాన్ని సోదాహరణం గా విశ్లేషిస్తూ పార్వతీపురానికి చెందిన గంటేడ గౌరు నాయుడు ప్రసంగించారు. 46 పాదాలున్న ఆ గేయం 46 తూటాలున్న తుపాకీ లాగ గరిమెళ్ళ గళం ద్వారా బ్రిటిష్ పాలన పై సమరభేరి

## సాహితీస్రవంతి ఆధ్వర్యంలో అద్దేపల్లి 4వ వర్ధంతి



**కా**కినాడ సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జనవరి 11న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రజాకవి అద్దేపల్లి రామమోహనరావు 4వ వర్ధంతి సభ జరిగింది. అద్దేపల్లి జ్యోతి అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. సాహితీస్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా సభకు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ కాకినాడలో అద్దేపల్లి మానసపుత్రికగా ప్రారంభమైన సాహితీస్రవంతిని, ఆయన స్ఫూర్తితో 2016 నుండి ప్రగతిశీల, లౌకిక భావజాలంతో ముందుకు తీసుకెళున్నామని అన్నారు. ముఖ్యఅతిథిగా హాజరయిన ఆచార్య మేడిపల్లి రవికుమార్ 'వర్తమాన కవిత్వం' అంశంపై ప్రసంగించారు. వచన కవిత్వం ఆధునికంగా ఉండమని, మనిషిగా ఉండమని ఒక డిమాండ్ చేస్తుందని అన్నారు. అనంతరం అద్దేపల్లికి అత్మీయులైన ఎస్.ఆర్. పృథ్వీ రచన 'అక్షర కిరణాలు' వ్యాస సంపుటిని సాహితీస్రవంతి జిల్లా అధ్యక్షులు డా॥ జోశ్యుల కృష్ణబాబు ఆవిష్కరించారు. సంపుటిలోని 13 వ్యాసాలను క్లుప్తంగా ఆయన పరిచయం చేసారు. సాహితీస్రవంతి జిల్లా గౌరవ అధ్యక్షులు డా॥ వుయ్యపు హనుమంతరావు, నగర అధ్యక్షులు జానకిరామ్ చౌదరి, గ్రంథాలయ పాలకులు సాయి సత్యనారాయణ, ఎస్. ఆర్. పృథ్వీ, అద్దేపల్లితో తమకున్న జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పసుమర్తి పద్మజావాణి, అద్దేపల్లి ఉదయభాస్కర్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులు, ఇందిర, ఇంద్రగంటి నరసింహమూర్తి, గరికపాటి మాస్టారు శ్రీహస్త, డా॥ శిరీష, వి.ఆర్.ఎస్. సోమయాజులు, సర్కార్ ఎక్స్‌ప్రెస్ సత్యమూర్తి, కె. శివ, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, తంత్రపణి శ్రీరామ్మూర్తి, కాల్నాధభట్ట శ్రీరామశాస్త్రి, అవధానుల మణిబాబు, పుప్పాల సూర్యకుమారి తదితరులు సభలో పాల్గొన్నారు. ♦

---

మ్రోగించిందని అన్నారు. సీనియర్ పాత్రికేయులు, రచయిత నల్లి ధర్మారావు స్వాతంత్ర్య పోరాటంలో గరిమెళ్ళ జర్నలిస్ట్ గా చేసిన కృషి సోదాహరణం గా వివరించారు. ఆయన బ్రతుకు తెరువు కోసం ఎన్ని కష్టాలు అనుభవించినా, ప్రజల కోసం, దేశం కోసం ఆలోచన చేయడంలో ఏనాడూ రాజీ పడలేదని అన్నారు. తొలుత గరిమెళ్ళ చిత్రపటానికి పూలమాలలు వేసి సభికులంతా నివాళులర్పించారు. గరిమెళ్ళ రచనలను, గరిమెళ్ళ పై రచనలను ప్రాంగణం లో ప్రత్యేకంగా ప్రదర్శించడం విశేషం.

మధ్యాహ్నం సభకు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు చింతాడ రామారావు అధ్యక్షత వహించారు." ఆనాటి స్వాతంత్ర పోరాటం – నేటి సామాజిక స్థితిగతులు " అనే అంశం పై వచ్చిన కవితలపై ఒక సంపుటిని ప్రచురించగా స్థానిక శాసన సభ్యులు ధర్మాన ప్రసాదరావు ఆవిష్కరించారు. కవితలు పంపిన కవులను, హాజరైన యువతను ధర్మాన అభినందించారు. గరిమెళ్ళ స్మారక ట్రస్ట్ అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు కే ఏ ఎన్ భుక్త తాను గరిమెళ్ళ స్వగ్రామమైన ప్రియాగ్రహారం వాసిని అయినందుకు గర్వపడుతున్నానన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ మాట్లాడుతూ భావి పౌరులకు ఎటువంటి సమాజాన్ని అందించాలో ప్రజా కవులు, కళాకారులు రచయితలు ఆలోచన చేసి ప్రస్తుత పరిస్థితులపట్ల యువతని చైతన్యపరచవలసిందిగా పిలుపునిచ్చారు. సాహిత్యమే ఆయుధం గా బ్రిటిష్ వారిని ఎదిరించిన గరిమెళ్ళ ను మనం మరచి పోలేమని అంబెడ్కర్ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి హనుమంతు లజపతిరాయ్ అన్నారు. జిల్లా లోని డిగ్రీ కాలేజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీ విద్యార్థులకు " స్వాతంత్రోద్యమ " అంశం పట్ల క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీలు జిల్లాలోని పది కేంద్రాలలో నిర్వహించగా సుమారు ఐదు వందలమంది పాల్గొన్నారు. అందులో గెల్చిన వందమందికి మెమెంటోలు, ప్రశంసా పత్రాలతో పాటు విలువైన పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. చింతాడ రామారావు, నల్లి ధర్మారావు సంయుక్తంగా రచించిన " గరిమెళ్ళ గర్జన " నాటికను శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య వారు ప్రదర్శించారు. సుమారు మూడు వందలమంది సాహిత్యాభిమానులు, విద్యాధికులు, విద్యార్థులు ఉదయం నుండి సాయంత్రం వరకూ సభలో పాల్గొనడం పట్ల అతిథులు నిర్వాహకులను అభినందించారు. ♦

## విరసం కార్యదర్శి కాశీం అరెస్ట్ అప్రజాస్వామికం



విప్లవ రచయితల సంఘం కార్యదర్శి సి.కాశీం అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సాహితీస్రవంతి గౌరవ అధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్షులు వొరప్రసాద్ తెలిపారు. జనవరి 18 తెల్లవారు జామున కాశీం ఇంటిని ముట్టడించిన పోలీసులు 2016లో నమోదయిన కేసుకు సంబంధించి అరెస్ట్ చేసినట్లు చెప్పడం అనుమానాలకు తావిస్తున్నది. సరైన ఆధారాలు చూపకుండా దౌర్జన్యకర పద్ధతులలో పోలీసులు వ్యవహరించడాన్ని ప్రజాస్వామికవాదులు, వివిధ ప్రజాసంఘాలు పెద్దయెత్తున ఖండించాయి. ఉస్మానియా యూనివర్సిటీ ఆచార్యులుగా పనిచేస్తున్న కాశీం కవి, రచయిత. ఇటీవలనే జనవరి 11, 12 తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన విరసం 50 ఏళ్ళ మహాసభలలో నూతన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. బాధ్యతలు స్వీకరించిన వారం రోజులు కూడా గడవకుండానే కాశీంను అరెస్ట్ చేసారు. కాశీంను బేషరతుగా విడుదల చేయాల్సిందిగా సాహితీస్రవంతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. ♦

## శాంతి రజనీకాంత్ స్మారక పురస్కార సభ



విమలాశాంతి సాహిత్య సాంఘిక సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో జనవరి 5న అనంతపురంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో శాంతి రజనీకాంత్ స్మారక కథా పురస్కారం సభ జరిగింది. డా॥ ఎం. ప్రగతి అధ్యక్షత వహించిన ఈ సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన 'సాహిత్య ప్రస్థానం' మాసపత్రిక ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి ప్రసంగిస్తూ అద్దేపల్లి ప్రభు రాసిన కథల్లో జీవన విధ్వంసం కనిపిస్తుందన్నారు. 'సీమేన్' కథల్లో మానవీయ స్పృహ ఉందన్నారు. ప్రస్తుతం కవిత్వం కంటే కథలే ఎక్కువ మంది చదువుతున్నారన్నారు. జీవితాన్ని మధించే సాహిత్యం రావాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ప్రసంగిస్తూ డా॥ శాంతినారాయణ హేతుబద్ధంగా పురస్కారాలు ఇస్తారని, ఇప్పటి వరకూ పురస్కారాలు పొందిన రచయితలంతా పీడిత ప్రజల పక్షం వహించిన వారే అన్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతంలో కూడా అభివృద్ధి చెందని వాళ్ళ గురించి రాయడం ముఖ్యమన్నారు. మరో విశిష్ట అతిథి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకోబోతున్న ప్రసిద్ధ కవి, నవలా రచయిత బండి నారాయణస్వామి మాట్లాడుతూ అద్దేపల్లి ప్రభు సాహిత్యం నిండా ధ్వంసమవుతున్న జీవితాలే కన్పిస్తాయన్నారు. ♦

## చిన్న కథలకు 12వ 'సోమేపల్లి' పురస్కారాలకు ఆహ్వానం

తెలుగు చిన్న కథలను ప్రోత్సహించాలని గత 11 సంవత్సరాలుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు సోమేపల్లి కుటుంబం తరపున సోమేపల్లి వెంకటసుబ్బయ్య, చలపాక ప్రకాశ్ సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. 12వ సోమేపల్లి పురస్కారం కోసం రచయితలు చిన్న కథలను పోటీలకు పంపించవలసిందిగా కోరారు. అత్యుత్తమ కథకు రూ.2500/-, ఉత్తమ కథకు రూ.1500/-, మంచి కథకు రూ.1000/-, ప్రత్యేక బహుమతులు రూ.500/-చొప్పున ఇద్దరికి అందించనున్నట్లు తెలిపారు. కథలను మార్చి 10వ తేదీలోపు రమ్యభారతి, పి.బి.నెం.5, 11-57/1-32, జె.ఆర్.కాంప్లెక్స్, రెండవ అంతస్తు, రజక వీధి, విజయవాడ-520001 అనే చిరునామాకు పంపవలసిందిగా కోరారు. ఇతర వివరాలకు 9247475975 ద్వారా సంప్రదించవచ్చును. ♦

## జీవిత గమనంలో ఒక శకలం కథ



కొత్తగా రాస్తున్న కథకులు తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకం మొగ్గల్జడ అని సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షులు పిళ్ళా కుమారస్వామి అన్నారు. నెలనెలా సాహితీ సంగమం కార్యక్రమం లో భాగంగా శనివారం సాయంత్రం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల లో జరిగిన కథా సంగమం కార్యక్రమం లో ఆయన పాల్గొని డాక్టర్ బాలగొండ ఆంజనేయులు గారి మొగ్గల్జడ పుస్తకాన్ని సమీక్షించారు. కథకు క్లుప్తత ఉండాలని, శిల్పం ముఖ్యమని అన్నారు. అనంతరం ఎల్.ఆర్.వెంకట రమణ, జి.ఎల్.ఎన్.ప్రసాద్, అశ్వర్థ రెడ్డి, శోభామణి, శేషగిరి రాయుడు, స్వర్ణ తదితరులు కథలు చదివి వినిపించారు. సీనియర్ రచయిత డాక్టర్ బాలగొండ ఆంజనేయులు వర్ధమాన కథకులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షురాలు ప్రగతి, డాక్టర్ రాధేయ, సూర్య నారాయణ రెడ్డి, మేఘన పాల్గొన్నారు. ఉత్తమ కథకు బహుమతి అందజేశారు. ♦

## పుప్పాల ఫౌండేషన్ సాహిత్య పురస్కార సభ



జనవరి 18 న కాకినాడ రోటరీ సమావేశ మందిరంలో పుప్పాల ఫౌండేషన్ వారి 5వ సాహితీ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ సభలో పుప్పాల సూర్యకుమారి రాసిన “శ్రీమతి కన్య” నవలను స్థానిక ఎమ్.ఎల్.ఎ. ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి ఆవిష్కరించారు. ప్రముఖ కవి, రచయిత, చిత్రకారులు, ప్రయోక్త మాకినీడి సూర్యభాస్కర్ సభకి అధ్యక్షత వహించారు. ప్రముఖ సాహితీ సమీక్షకులు శ్రీమతి డా॥ కె. శైలజ ప్రముఖ కవి డా॥ ర్యాలి ప్రసాద్ ‘శ్రీమతి కన్య’ నవలను సమీక్షించారు. ఆత్మీయ అతిథులుగా శ్రీమతి ధూళిపూడి రమాదేవి, డిప్యూటీ కలెక్టర్, విజయవాడ మరియు డా॥ ఆర్. అమరేంద్ర కుమార్, గుడా వైస్ ఛైర్మన్, నవ మల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీ, విజయవాడ, సంస్థ ఉపాధ్యక్షులు ఉంగరాల వెంకటేశ్వరరావు, బాజిబోయిన వెంకటేష్ నాయుడు, శ్రీమతి ఉద్దళా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. సభకు రచయితలు కాకరపర్తి దుర్గాప్రసాద్ స్వాగతం పలకగా ఉండవిల్లి వందన సమర్పణ గావించారు. శ్రీమతి సూర్యకుమారి అధ్యక్షులుగా వున్న సూర్య సాహితి మరియు పుప్పాల ఫౌండేషన్ 5 వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ కథకులు కె.వి. కృష్ణ ‘మమతల పందిరి’ కథాసంపుటికి, ప్రముఖ కవి ర్యాలి ప్రసాద్ ‘గాంధీ’ దీర్ఘ కవితాసంపుటికి, పత్రికారంగం లో అనేక సంవత్సరాలుగా విశేష సేవలందిస్తున్న ప్రముఖ మాసపత్రిక నవ మల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీకి పురస్కారాలందించారు. కవిత్వం, కథల పోటీలు నిర్వహించి అయిదుగురు ఉత్తమ కథకులకు, అయిదుగురు ఉత్తమ కవులకు పురస్కారాలు అందజేసారు. ఉత్తమ కథకులుగా సిహెచ్. సింహప్రసాద్, హైదరాబాదు, పాణ్యం దత్తశర్మ, హైదరాబాదు, ఆర్.సి. కృష్ణస్వామి రాజు, తిరుపతి, శ్రీమతి రావుల కిరణ్మయి, వరంగల్, శ్రీమతి నామని సుజనాదేవి, వరంగల్. ఉత్తమ కవిత, విజేతలు: మాడిశెట్టి శ్రీనివాస్, ధర్మపురి, మార్ని జానకిరామ చౌదరి, కాకినాడ, చొక్కర తాతారావు, విశాఖపట్నం, పొత్తూరి సీతారామరాజు, కాకినాడ, చొక్కాపు లక్ష్మీనాయుడు, విజయనగరం, బహుమతులు, సత్కారాలు అందు కున్నారు. కథలకు, న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ రచయితలు శ్రీకంఠస్ఫూర్తి, దాట్ల దేవదానం రాజు వ్యవహరించారు. కవితలకు న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ కవులు మాకినీడి సూర్యభాస్కర్, బొల్లోజు బాబా వ్యవహరించారు. పుప్పాల సత్యనారాయణ సభా నిర్వహణ చూసారు. ♦

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

## నూతన సంవత్సర శుభాకాంక్షలు

# నేను విన్నాను.. నేను ఉన్నాను

## నవరత్నాలు నా సంకల్పం



**శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు**

గౌ॥ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు



## మద్యపాన నిషేధం

- మద్యపాన నిషేదము మహిళలకు ఇచ్చే కానుక
- మద్యం మత్తు పారద్రోలుకుందాం, కుటుంబాన్ని రక్షించుకుందాం.
- ఆరోగ్యాన్ని కాపాడుకుందాం, సుఖసంతోషాలతో జీవిద్దాం.

## ఇదే జగనన్న ఆశయం



**శ్రీ కె.నారాయణ స్వామి**

గౌ॥ ఉపముఖ్యమంత్రి

ఎక్సైజ్ మరియు వాణిజ్య పన్నుల శాఖామాత్యులు

ఆంధ్రప్రదేశ్

"దశలవారి మద్య నిషేధం -
నా ప్రియమైన అక్క చెల్లెమ్మలకు
నేను ఇస్తున్న కానుక"



మద్యపానం ఆరోగ్యానికి హానికరం

జారీ చేసినవారు :

కమీషనర్, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్‌శాఖ, ఆంధ్రప్రదేశ్.

మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్.

SAHITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.VJ/187/2020-22
Date of Posting : 1st &2nd of Every Month ▪ Date of Publication: 29.01.2020


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు



పోతులూరి వీరబ్రహ్మంపై సామాజిక దృష్టితో పరిశోధన చేసి వెలువరిస్తున్న ప్రామాణిక రచనలు. సాహిత్య ప్రస్థానం పాఠకులకు ప్రత్యేక తగ్గింపు కలదు.

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 520002, ఫోన్: 0866 - 2577533

బ్రాంచీలు: విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ, ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం


If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor
Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059